# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 5.00

నవంబర్ 2022



శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ స్వర్ణోత్సవము, (1972-2022)

ప్రత్యేక సంచిక

# వినాయక చవితి పూజా దృశ్యములు



శ్రీ సద్గురు పాదపూజ

గణపతి పూజ





హైదరాబాదు శాఖలో
గణపతి పూజ

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 42 సంచిక 3
పేజీలు 76
నవంబర్ 2022

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
శ్రీ సద్గురుమూర్తి-సజీవ దర్పణం ..........9
ఆశ్రమ స్వర్ణోత్సవ వివరాలు.....................11
ఆది శంకరాచార్య .........................................12
మంత్రిగారి ప్రవర్తన ....................................15
అగస్త్య హృదయం ........................ ..............18
కైవల్యోపనిషత్ ... ..........................................20
అపూర్వం - అద్వితీయం ...........................23
చంద్రశేఖర స్వామి ......................................26
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................28
వివేక చూడామణి ................. .................29
నిరీక్షణ ..........................................................31
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....33
భగవంతుని సర్వవ్యాపకత్వం .............35
మైల ...............................................................36
బాబూజీతో అనుభవాలు .........................40
గురువుల చెంత వుండవు చింతలు 53
మహిమలు చూపని మహాత్ములు 59
అంతా మన ఎంపికయే ..........................72
విష్ణు కథలు ....... ........................... ...................73

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

**28) చక్కెరలప్పకున్ మిగుల జవ్వని కెండిగురాకు మోవికిం**
**జొక్కపు జుంటితేనియకు జొకిలుచుం గనలేరు గాక నే**
**లక్కట! రామనామమధురామృతమానుటకంటే సౌఖ్యమా**
**తక్కిన మాధురీ మహిమ దాశరథీ! కరుణాపయోనిధీ!**

భావం - అయ్యో! ఈ కాలమువారు చక్కెర రాశికిని, యువతి యొక్క పెదవికిని, తేనెటీగలు పెట్టిన తేనెకును ఆశపడుచున్నారు. రాముని పేరులో గల తీపిని ఎరుగలేరు. రాముని పేరులో గల తీయదనముకంటే వానిలో గల తీయదనము అంత సుఖమా! దాశరథీ! కరుణాపయోనిధీ!






# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

8-7-1981

ఈరోజు రాత్రి 8గంటలకు శ్రీబాబూజీ భక్తులకు దర్శనం ఇచ్చారు.

చరణ్‌దాస్ అనే భక్తుడు శ్రీ బాబూజీతో మాట్లాడుతూ విజయవాడలో ఇటీవల ఒక వ్యక్తి హొటల్ పెట్టాడు. సుమారు కోటిరూపాయల వరకు ఖర్చుపెట్టి ఉండవచ్చు అని చెపుతూ ఆ వ్యక్తి చాలా ధనాన్ని సంపాదించాడు అని చెప్పారు.



శ్రీ బాబు కల్పించుకొని, "అయితే ఆ హొటల్ ప్రొప్రయిటరు గొప్పవాడు, సాధించవలసినదాన్ని సాధించాడంటావు. అసలు మానవుడు సాధించవలసినది ఏమిటి?" అని ప్రశ్నించారు శ్రీ బాబు.

దాస్ సమాధానం చెపుతూ, "మానవుడు సాధించవలసినది పరమాత్ముని అనుగ్రహం" అన్నారు.

"అంతమాత్రం జ్ఞాపకం ఉందికదా?" అని అన్నారు శ్రీ బాబు.

ఇంతలో వర్షంపడి, వాతావరణం చల్లబడింది.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "చూశారా! ఎంత చల్లగా ఉందో, ధ్యానం కుదిరినకొలది ఈ చల్లదనం చాలదు. ఇంకా చల్లదనం కావాలి. నా చిన్నతనంలో నేను అమ్మకి నమస్కారం చేసుకునేటప్పుడు నుదుటి నుంచి అంగుష్ఠము మీదికి అగ్ని వచ్చినట్లుగా అనిపించేది.

నా చిన్నతనంలో మద్రాసులో హైకోర్టు ఆవరణలో ఇప్పుడు మనమంతా ఇక్కడ కూర్చున్నట్టే చెట్టుక్రింద కూర్చుని తత్త్వ విచారణ చేసేవాళ్లం. మొదట్లో జనం తక్కువగా ఉండేవారు. క్రమేపీ మా సంఖ్య పెరిగింది. అంతా భయపడేవారు ఎవరైనా ఏమైనా అంటారేమోనని, నేను మాత్రం ధ్యానముద్రలోనే ఉండేవాడిని.

ఒకరోజు అనుకోకుండా జడ్జిగారు వచ్చి మా మధ్య కూర్చున్నారు.

నాకు ఏమీ తెలియదు. నేను కళ్ళు తెరచి చూసేసరికి నా ఎదురుగా జడ్జిగారు కూర్చుని ఉన్నారు.

ఆయన నన్ను కొన్ని ప్రశ్నలు వేశారు. దానికి నేను సమాధానం చెప్పాను. దానితో తృప్తిచెందిన జడ్జిగారు రోజూ నాకోసం వచ్చేవారు. అది ఆయన జన్మ సంస్కారం" అన్నారు శ్రీ బాబు.

"నేను సిమ్లా డార్జిలింగ్ వెళ్ళాను. అక్కడ కూడ ఎన్నడూ చలి అనుభవించలేదు. నేను కిటికీలు కూడ తీసుకుని పడుకునేవాడిని. నాకు  చల్లదనం అనే భావన ఉండేదికాదు. నాకు అష్టసిద్ధులు అంటే గిట్టదు. కొంతమంది అష్టసిద్ధుల్ని ప్రదర్శించి ప్రచారం చేయించుకొంటారు. దానివలన లాభం ఏమిటి? పరమాత్ముని అనుగ్రహం పొందుతాడా? లేకపోతే ఎవరికైనా ఆ అనుగ్రహాన్ని ప్రసాదించగలడా? ధనాన్ని సంపాదించటం మాత్రమే జరుగుతుంది. ధనము అశాశ్వతమైనది. శాశ్వతమైనది ఒక్క ఆత్మ మాత్రమే. అది తెలుసుకొనటమే ఆత్మజ్ఞానము. అట్టి ఆత్మ జ్ఞానాన్ని పొందటం గురువు ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది" అన్నారు శ్రీ బాబు.

**భక్తమహాశయులకు విజ్ఞప్తి**

సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ వారు భక్తులందరికీ ప్రసాదించిన మహా ప్రసాదం "శ్రీ సద్గురు పుణ్యారాధన మహోత్సవములు మరియు ఆశ్రమ స్వర్ణోత్సవాలు" 11-11-2022 నుండి 21-11-2022 వరకు శ్రీకాళీవనాశ్రమంలో జరుగనున్నవి. ఇందులో పాల్గొనే భక్తులు on line లో వారి పూజలు ముందుగా నమోదు చేసుకొనే ఏర్పాటు ఈ సంవత్సరం నుండి చేశాము. పూజ రుసుము చెల్లించటానికి ఈ QR కోడ్ స్కాన్ చేసి phone pay/Google pay/ paytm ద్వారా పంపవచ్చును. తరువాత మీ గోత్రము, పేరు, పూజ చేసుకొనే తేదీ, 8333067877, 9493786602 నంబరుకి మెసేజ్ పెట్టాలి. బ్యాంక్ ద్వారా పంప దలిచేవారు ఈ ఫోన్ నంబరుకి ఫోన్ చేసి అకౌంట్ నంబరు తెలుసుకొనగలరు.

Or SCAN QR CODE

TO PAY

Sri Sri Sri Hanupath Kali Vara Prasad Babu Trust

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## గురువిద్య

**గీతా శాస్త్రము ధర్మ శాసనము**
**తద్గీతార్ధమెన్నెన్నియో రీతులన్సెంద**
**యదార్థ తత్వమున్ సంప్రీతిన్ ప్రబోధింపగా**
**గీతాచార్యుడవై, జగద్గురుడవై**
**క్రీడించుచున్నావు! విఖ్యాత జ్ఞాననిధీ!**
**కృపాజలనిధీ! కాళీప్రసాద ప్రభూ!**



మన హృదయ క్షేత్రంలోనే ప్రకాశిస్తున్న గురుమూర్తి మనకి **గురువిద్య**ని అందిస్తారు. అదే బ్రహ్మవిద్య. దానినే' రాజవిద్య' అన్నారు గీతాచార్యుడు. అది చాలా పవిత్రమైనది, చాలా రహస్యమైనది. ఏ విద్యను తెలుసుకుంటే ఇక తెలుసుకోవలసినది వుండదో, అదే 'బ్రహ్మవిద్య' లేక 'ఆత్మవిద్య' అందుకనే గీతాచార్యుడు **అధ్యాత్మవిద్య విద్యానామ్** అని శెలవిచ్చి వున్నారు. అధ్యాత్మవిద్యయే విద్య; మిగతావన్నీ పొట్టకూటి కొరకే అన్నారు అస్మద్గురు దేవులు శ్రీబాబూజీ మహరాజ్. అలాగన్నారని మిగతా విద్యలని నిరసించడం కాదు; అక్కర్లేదనీ కాదు. వ్యావహారిక ప్రపంచంలో ఆ విద్యలు కావలసినదే. ప్రపంచ పురోగతికి ఈ లౌకిక విద్యలు కావాలి. కానీ, ఆధ్యాత్మిక పురోగతికి ఆ విద్యలు ఏమాత్రం ఉపకరించవు. తనను తాను తెలుసుకునే విద్య ఆత్మవిద్య. ఇది తెలుసుకున్ననాడు మానవునికి మరణమంటే భయం వుండదు. జీవించి వుండగానే, ముక్తిని పొంది, జీవన్ముక్తుడు అనిపించుకుంటాడు. ఈ విధంగా జీవన్ముక్తిని పొందిన మానవుడు దేహము అంతమైన తరువాత విదేహముక్తిని పొంది జనన మరణ వలయం నుండి తప్పించుకుంటాడు.

సత్యం మారనటువంటిది. అది మనకంటే భిన్నం కాదు. అది మనమే అయివుంది. అది మనలోనే వుండి, మనని ప్రకాశింపజేస్తోంది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడింటికీ సాక్షియై వున్నది సత్యమే.

అది గుర్తించడానికి గురుమూర్తి చెప్పినట్లుగా ఉపాసన చేయాలి. నిరంతరం సత్యవస్తు విచారణ చేయాలి. అంతరాంతరాళలోకి వెళ్ళి ధ్యానం చేయాలి. నీకు మనస్సనేది ఒకటుందని కూడా మరచిపోవాలి. బ్రహ్మవిద్యని ఇలా ఉపాసన చేయాలి.

'నిన్ను నువ్వు విశ్వసించు. నీలో వున్న పరమాత్మని గుర్తిస్తావు. అప్పుడు నువ్వే సర్వే సర్వత్రా వున్న నన్నే గుర్తిస్తావు' అంటున్నాడు భగవంతుడు. అంతఃకరణ శుద్ధి చేసుకో. అప్పుడు భగవానుడు నీకు శ్రమ తగ్గించి ఫలితం ఎక్కువ ఇస్తాడు. శ్రమ తక్కువ ఫలితం ఎక్కువ అదే గురువిద్య అంటే.

అటువంటి గురువిద్య పొందటానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## చందాదారులకు విన్నపము

ప్రియమైన పాఠకులకు, చందాదారులకు తెలుపునది ఏమనగా, కొద్ది సంవత్సరాలుగా కాగితము, ముద్రణ ఖర్చులు విపరీతముగా పెరిగినవి. ఇరవై సంవత్సరాల నుండి మన ఆధ్యాత్మిక మాసపత్రిక సమర్థసద్గురును ప్రతికి 5 రూ. చొప్పున పంపిణీ చేయుచున్నాము. ఇంకనూ అదే వెలను కొనసాగించుట అసాధ్యముగా వున్నది. కావున జనవరి 2023 నుండి ఈ క్రింద తెలిపిన విధంగా మాసపత్రిక వెలను పెంచుటకు నిర్ణయింపబడినది. తమ సహాయ సహకారములను ఎప్పటి వలెనే కొనసాగించి, మన మాసపత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా అందరినీ కోరుచున్నాము.

**విడి ప్రతి 10రూ, సంవత్సర చందా 120రూ, 5 సంవత్సరాలకు 500రూ, జీవిత చందా (15 సం॥లకు) 1250రూ.**

# శ్రీ సద్గురుమూర్తి - సజీవ దర్పణం

- సుషుమ్నా ప్రసాద

మానవ జీవితంలో అద్దమనేది చాలా వుపయుక్తమైన పరికరం. అద్దం నిర్జీవమైనదైనా, సజీవమైనదైనా మానవునికి ఎంతో సహకారి. నిరంతరం దాని సాన్నిధ్యమును, సహకారమును కోరుకుంటాడు మానవుడు. వుదయం నిద్రలేచినది మొదలు సరిగా దంతధావనం చేసుకున్నామా లేదా అని అద్దంలో పరిశీలించుకుంటాం. ఈ అద్దానికెంతో ఆధ్యాత్మిక ప్రతిపత్తి కూడా వున్నది. మన సౌందర్యాన్ని సరిదిద్దుకోవడానికి ప్రథమ పరికరము అద్దము. అద్దమెంత స్వచ్ఛంగా వుంటే మన ప్రతిబింబము కూడా అంత స్వచ్ఛంగా వుంటుంది.

అద్దం ఋజుత్వమునకు మారుపేరు. మానవులను యథాతథంగా చూపే సమర్థత అద్దానికున్నది. నీ రూపాన్ని మార్పులు చేర్పులు చేయదు. అద్దం నిష్పక్షపాతి. ఎవరినీ అందలమెక్కించదు. గోతిలో పడవేయదు. మానవునకు నిరంతరం సహచారియైనా నీలోని లోపాలను మరుగుపరచదు. నీ ముఖాన మసి వుంటే అది యథాతథంగా కనిపిస్తుంది. నీలోని లోపాలను నీవే సరిదిద్దుకోవాలి సుమా, ఇతరులకు సంబంధం లేదని నిరంతర హెచ్చరిక ఇస్తుందా అనిపిస్తుంది.

మానవుడు శోకతప్త హృదయుడై బాధపడుతున్నాడనుకోండి, ఆ బాధ ప్రతిబింబంలో యథాతథంగా గోచరిస్తుంది. అంతేకాని శోక తప్త హృదయాన్ని ఉల్లాసంగా, ఉత్సాహంగా, చిరునవ్వు చిందించేవానిగా గోచరింప జేయదు. అలాగే నీ అందాన్ని ద్విగుణీకృతం చేయదు. నీ అందాన్ని మెరుగులు దిద్దుకోమని హెచ్చరిస్తుంది కానీ వున్న అందాన్ని మరుగుపరచదు.

అద్దానికి మరొక విశేషత వుంది. మనలోని లోపాలను సరిచేసుకోవడానికి సహకరిస్తుంది కానీ, మన లోపాలు దానికేవీ అంటవు. దర్పణం నిర్వికారంగా, విలక్షణంగా వుంటుంది. అందుకే అద్దానికి ఆధ్యాత్మిక ప్రతిపత్తి వున్నదని చెప్పుకొన్నాము. మనలను నిరంతరం కాపాడే సజీవ దర్పణమొకటున్నది. అదే సద్గురుదేవుడనే దర్పణం. సద్గురుదర్పణంతో మనం సహచర్యం చేస్తే, మనలోని దోషాలను వేలెత్తి చూపడమే కాక, ఆ లోపాలను రహితం చేసే సజీవదర్పణం సద్గురువు. ఈ దర్పణాన్ని మనం చేతితో పట్టుకునే అవసరం లేదు.

ఆ దర్పణమే మనలను తన హస్తాలతో చేరదీసి, మనలోని లోపాలను తెలియజేయటమే కాక, పరమానుగ్రహంతో పరిష్కార మార్గం కూడా చూపిస్తారు. దానిని తు.చ. తప్పకుండా పాటించి ఆచరిస్తే విజయలక్ష్మి వారిని తప్పక వరిస్తుంది. సద్గురుమూర్తి పరమానుగ్రహమనే దర్పణంలో తమలోని లోపాలను శ్రద్ధాభక్తులతో సరిదిద్దుకుంటే వారి అందం ద్విగుణీకృతమవుతుంది. దివ్యసౌందర్యంతో ప్రకాశిస్తాం. దానికి వయస్సుతో పనిలేదు. నిరంతరం ప్రకాశిస్తూనే వుంటుంది. సద్గురుమూర్తి ఎంత స్వచ్ఛంగా, నిర్మలంగా వుంటారో శిష్యుని కూడా అలాగే తయారుచేస్తుంది. అంటే **త్వమేవాహం** నీవేనేను అనే యదార్థ స్థితిని ప్రసాదిస్తారు. అంటే బింబానికి దీటైన ప్రతిబింబంగా నిన్ను రూపొందిస్తారు.

గురుదేవుడు తన్నాశ్రయించి, నిరంతరం గురుసేవలో పునీతులైన భక్తుల ఆత్మ సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తారు. ఇనుము అయస్కాంతానికి హత్తుకుపోయినట్లు గురుదేవుని పరమానుగ్రహమనే దర్పణమునకు హత్తుకుపోయిన భక్తుల భాగ్యమే భాగ్యము! అటువంటి సంపద, సౌందర్యము ఎన్నో జన్మల పుణ్యఫలంతో మనకు లభించింది. కనుక సద్గురుదేవుడనే సజీవదర్పణమును సద్వినియోగం చేసుకునే శక్తిని, భక్తిని ప్రసాదించమని విఘ్నాధిపతియైన గురుగణపతిని ప్రార్థిద్దాం!!

***అతిగా విచారణ చేయరాదు. జగజ్జనని పాదపద్మాల పట్ల భక్తి ప్రపత్తులు కలిగితే చాలు. అతిగా విచారణ మనస్సును గందరగోళం లోకి దింపుతుంది.***

***మడుగు ఉపరితలంలోని నీరు త్రాగితే, స్ఫటికంలాటి నీరు లభిస్తుంది. చేతులతో ఎక్కువ లోతుగా కుదిపితే బురద నీరు వస్తుంది. కాబట్టి భక్తిని ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించండి!***

- శ్రీ రామకృష్ణ పరమహంస

## *శ్రీ సద్గురు స్వామి స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవ మహోత్సవములు*

**శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి చతుస్త్రింశత్(34వ) వార్షిక పుణ్యారాధన మహోత్సవములు, శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగము, అఖండ హరినామ సంకీర్తన, త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళన**

ది.11.11.2022 శుక్రవారము నుండి 21.11.2022 సోమవారము వరకు

**ఆహ్వానము**

ఆధ్యాత్మిక జిజ్ఞాసువులారా!

శ్రీ కాళీ వనాశ్రమము (శ్రీ కాళీ గార్డెన్స్) పరీధావి నామ సంవత్సర నిజ వైశాఖబహుళ తదియ బుధవారము అనగా ది.31.05.1972న శ్రీ బాబూ విజ్ఞాన మందిర్ గృహప్రవేశముతో ప్రారంభింపబడి 50 సంవత్సరములు పూర్తి చేసుకొన్న సందర్భముగా శ్రీ శుభకృత్ నామ సంవత్సర కార్తీకబహుళ తదియ శుక్రవారమునుండి కార్తీక బహుళ ద్వాదశి (తత్కాల త్రయోదశి) సోమవారము వరకు అనగా ది.11.11.2022 నుండి 21.11.2022 వరకు శ్రీ సద్గురుదేవుల పరమానుగ్రహముతో స్వర్ణోత్సవ మహోత్సవములు, అఖండ హరినామ సంకీర్తన, పరమహంస పరివ్రాజకాచార్య పరమ పూజ్యపాద శ్రీ శ్రీ శ్రీ దండి స్వామివారి సర్వాధ్యక్షతన త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము (19.11.2022 నుండి 21.11.2022 వరకు) నిర్వహించు కొనుచున్నాము. ఆస్తికమహాశయులందరూ ఈ కార్యక్రమములలో పాల్గొని, భక్తుల సేవచేసుకొని తరించగలరని ఆశించుచున్నాము.

**నిత్య కార్యక్రమములు:**

మేలుకొలుపు, సుప్రభాతం, ప్రార్ధన, శ్రీ సద్గురు పాదుకా ప్రదక్షిణ, పాశుపత వజ్ర గ్రథితమహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగము, తీర్థ ప్రసాదములు, అఖండ హరినామ సంకీర్తన, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ లక్షార్చన, హోమం, దర్బారు, మహాప్రసాదం.

**కార్తీకమాసము సందర్భంగా ప్రతిరోజూ మహన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకములు జరుగును.**

వివరములకు...
93465 35357
93983 34345

ఇట్లు
కార్యనిర్వాహక వర్గము
శ్రీ కాళీ వనాశ్రమము

# ఆది శంకరాచార్య

- హనుమత్ జయప్రద

**సదాశివ సమారంభామ్ వ్యాస శంకర మధ్యమాం**

**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం**

భారత దేశంలో ఏ దేవతను నమస్కరించుకోవాలన్నా, ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలన్నా ఆది శంకరుల స్మరణ లేకుండా ఏదీ జరగదు. అందుకే మనం వారిని సాక్షాత్ పరమేశ్వరుని స్వరూపముగా, గురురూపముగా ఆరాధిస్తాము. భారతీయ సంస్కృతికి ఒక ప్రవక్తలు ఎవరు లేరు అని అందరికి తెలుసు. కానీ, మనకంటూ చెప్పుకోవాలి అంటే వ్యాసమహర్షిని చెప్పుకోవాలి. వ్యాసమహర్షి వలననే వేదములు, అష్టాదశ పురాణములు, మహాభారతం, భాగవతం ఆవిర్భవించాయి. కానీ వ్యాసుల వారికి కూడా గురువులు ఉన్నారు. ఆయనే సదాశివుడు. అందుకే మనం **సదాశివ సమారంభామ్** అని నమస్కరిస్తున్నాము. గురు పరంపరని తెలుసుకుంటే, పరమేశ్వరుని ప్రధమ శిష్యుడు బ్రహ్మ, బ్రహ్మ శిష్యుడు వశిష్ఠుడు, వశిష్ఠుడు యొక్క శిష్యుడు మరియు పుత్రుడు, బ్రహ్మ విద్యని తెలుసుకున్నవాడు శక్తి. శక్తి యొక్క పుత్రుడు, శిష్యుడు పరాశర మహర్షి. పరాశరుని పుత్రుడు శిష్యులు వ్యాసదేవుడు. వ్యాసుని యొక్క పుత్రుడు, శిష్యులు శుక మహర్షి. శుకమహర్షి శిష్యులు గౌడ భగవత్పాదులవారు. ఆయన శిష్యులు గోవిందభగవత్పాదులవారు. అయన శిష్యుడు శ్రీ శంకర భగవత్పాదులవారు.

ఆది శంకరులు భారతీయులకి జ్ఞానాన్ని ఇచ్చేటప్పుడు మనకి మూడు రకాలు అయినటు వంటి సాహిత్యాన్ని ఇచ్చినట్లు అనిపిస్తోంది,

1. భాష్య రచన (ప్రస్థాన త్రయానికి ఆయన చేసినటువంటి భాష్యం) అంటే, ఉపనిషత్తులకి, బ్రహ్మ సూత్రాలకి, భగవద్గీతకు ఆయన చేసినటువంటి భాష్యం.

2. ప్రకరణ సాహిత్యం (వివేకచూడామణి, అపరోక్షానుభూతి మొదలైనవి)

3. స్తోత్ర వాఙ్మయము - అన్ని దేవతలని స్తుతిస్తూ మానవాళికి ఆయన ఇచ్చిన స్తోత్రాలు సౌందర్యలహరి, శివానంద లహరి, భజగోవిందం, గణేశ పఞ్చరత్నం, కనకధారా స్తోత్రమ్ మొదలైనవి.

శ్రీ శంకర భగవత్పాదులవారు కేరళ రాష్ట్రంలో 'కాలడి' అనే గ్రామంలో శివ గురువు, ఆర్యాంబలకు జన్మించి, ఆసేతుహిమాచలం పర్యటించి అద్వైతాన్ని బోధించి జాతిని జాగృతం చేశారు. ఆది శంకరులు అద్వైత ప్రచారానికి భారత దేశంలో నలుమూలల నాలుగు పీఠాలు వుండాలని సంకల్పించారు. తూర్పున పూరిలో గోవర్ధన మఠం, పశ్చిమాన కాళికా పీఠం, ఉత్తరాన బదరి క్షేత్రంలోని జ్యోతిర్మఠం. వాటికి వరుసగా పద్మపాదాచార్యులు, హస్తామలకాచార్యులు, తోటకాచార్యులని నియమించారు. కైలాసం నుండి తెచ్చిన స్ఫటిక లింగాలని ఆ పీఠాల్లో ఆదిత్యం, అంబికా, విష్ణుం, గణనాధమ్, మహేశ్వరం అని అయిదుగురు దేవతలని పంచాయతన పూజ విధానములో ఆరాధిస్తూ అద్వైతాన్ని ప్రబోధించారు.

అయితే ఇన్ని రాసిన శంకరులు, లలితా సహస్రానికి భాష్యం రాయలేదు. ప్రతిసారి తన శిష్యుడిని స్తోత్రం తీస్కునిరా అంటే ఆ శిష్యుడు ఎప్పుడు కూడా శ్రీ విష్ణు సహస్ర స్తోత్రం తెచ్చేవారట. ఇలా మూడు సార్లు జరిగేటప్పటికి శంకరులు ఇది ఆ పరమేశ్వరుని ఇచ్ఛ అనుకుని లలితా సహస్రానికి భాష్యం రాయడం జరుగలేదు. కానీ ఇక్కడ ఒక విషయం గమనించాలి. లలితా సహస్రనామం, **శ్రీశివా శివశక్త్యైక రూపిణి లలితాంబికతో** పూర్తవుతుంది. అదే సౌందర్యలహరి **శివశక్త్యాయుక్తో** అనే పదముతో ప్రారంభమవుతుంది. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం యొక్క పరమార్థం అంతా సౌందర్యలహరిలో నిక్షిప్తం చేశారు.

శ్రీ బాబూజీ మహారాజ్ తమయొక్క బోధలో ఎన్నోసార్లు ఆది శంకరాచార్యులు గురించి ప్రస్తావించడం జరిగింది. **జాతినీతి కులగోత్ర దూరగం। నామరూప గుణదోష వర్జితం । దేశకాల విషయాతి వర్తి యత్ బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని** ఇవేకాకుండా భగవద్గీత సారం, ఉపనిషత్ సారం అంతా గురుదేవుల దివ్య బోధామృతంలో ఉన్నది. సంసార బాధలు, బాధ్యతల మధ్య నలిగి పోయేటటువంటి మన అందరికి గురుబోధామృతం ఒక దివ్యమైన దిక్సూచి.

ఒకానొక ఊరిలో ఒక చెట్టుకొమ్మ మీద ఒక పక్షి ఉండేది. అది తన పిల్లలు పెద్దవి అవుతుండడంతో బయటకు వెళ్తే ఏదైనా అపాయంలో పడతాయేమోనని భయపడి, ఒకరోజు రెక్కల్ని

రెపరెపలాడిస్తూ, ఎగరడానికి ప్రయత్నిస్తున్న పిల్లల్ని చూసి పిల్లలారా..! రండి! మీకొక మంచి పాట నేర్పిస్తాను అంది..... సంతోషంతో గెంతుకుంటూ వచ్చిన పిల్లలకు, వేటగాడొస్తున్నాడు జాగ్రత్త..! గింజలు విసురుతాడు జాగ్రత్త..! వలవేస్తాడు జాగ్రత్త..! పట్టుకుంటాడు జాగ్రత్త..! మెడ విరుస్తాడు జాగ్రత్త.. ! అనే పాట నేర్పింది.

అతి త్వరలోనే ఆ పాటని చక్కగా నేర్చేసుకున్న ఆ పిల్లలు బహురమ్యంగా పాడటం మొదలుపెట్టాయి. హమ్మయ్య..! వేటగాడొచ్చినా నా పిల్లలకి ఇంకేం పరవాలేదు. అనుకొని వేట కొరకు అడవులలోకి వెళ్ళిపోయింది ఆ తల్లిపక్షి.

ఈలోగా రానే వచ్చాడు వేటగాడు. వాడిని చూడగానే పక్షి పిల్లలు వేటగాడొస్తున్నాడు జాగ్రత్త..! అని పాడసాగాయి. ... అది విన్న వేటగాడు ఆశ్చర్యపోయి చెట్టు చాటున నక్కి పోనీ గింజలు విసిరిచూద్దామని గింజలు విసిరాడు. వెంటనే ఆ పక్షిపిల్లలు గింజలు విసురుతాడు జాగ్రత్త! అని పాడసాగాయి. మరింత ఆశ్చర్యపడ్డ వేటగాడు ఏంచెయ్యాలో అర్థంకాక వల వేసాడు. ఈలోగా వలవేస్తాడు జాగ్రత్త! అని పాడుతూ ఆ పక్షి పిల్లలు అతడు విసిరిన వలపై వ్రాలాయి. పాడుకుంటూ గింజలు తింటున్న పక్షుల్ని ఒక్కక్కటిగా పట్టుకొని మెడ విరుస్తుంటే ఇంకా పాడుతున్న ఆ పక్షులు మెడ విరు...స్తా......డు........ అంటూనే చచ్చిపోయాయి.

అయ్యో... ఈ పక్షులు పాట అయితే నేర్చుకున్నాయి గాని...., దాని లోని అర్థాన్ని గ్రహించుకోలేదు. నేడు మనమందరమూ చక్కని దేవుని శ్లోకాలు, పాటలు, మంత్రాలు, పురాణాలు, ప్రవచనాలు, వేదాలు, సహస్ర నామాలు, వింటున్నాము, చదువుచున్నాము. పాటించకుండా వదిలేస్తున్నాము. ఎందుకు చేస్తున్నామో తెలుసుకోవడమే అసలైన భక్తి. తెలుసుకుని అలా ఆచరిస్తూ ఉండటమే భక్తి.

# మంత్రిగారి ప్రవర్తన

విదర్భ దేశపు మంత్రి ముకుందుడు వృద్ధుడు కావడంతో, బాధ్యతల నుండి తప్పుకుంటానని, తన కొడుకు శోభితుడుకి ఆ పదవినిమ్మని మహారాజుని కోరాడు. అలా కాకుండా పోటీలు నిర్వహిద్దామని, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేద్దామన్నాడు రాజు. శోభితుడిని కూడా పోటీల్లో పాల్గొనమన్నాడు.

మంత్రి పదవికి జరిపిన ఎంపిక పరీక్షల్లో శోభితుడు, సైన్యాధిపతి కుమారుడు వరుణుడు సహా యువకులెందరో పాల్గొన్నారు. వాళ్ళందరిలో రైతు కుమారుడు విజయుడు అసాధారణ ప్రతిభ చూపించి పదవికి ఎంపికయ్యాడు.

ఆరుమాసాల శిక్షణ తరువాతనే విజయుడికి పదవీ బాధ్యతల నిద్దామని, అంతవరకు శిక్షణనిమ్మని ముకుందుడికి చెప్పాడు రాజు. మంత్రిగారి నివాసం ప్రక్కనే ఉన్న వసతిగృహాన్ని విజయుడికిమ్మన్నాడు రాజు. 'అవన్నీ నేను చూసుకుంటానని' రాజుగారితో చెప్పాడు మంత్రి.

భటుల నివాస గృహాల మధ్యన ఉన్న పాడుబడిన ఇంటిని విజయుడికి కేటాయించాడు మంత్రి. ఒక చాప, బొంత, పరిమితమైన వంట సామగ్రి మాత్రమే ఉన్నాయక్కడ. రాజుగారు చెప్పింది పెడచెవిన పెట్టేసి అలాంటి ఇంటిలో ఉండమన్నందుకు బాధపడ్డాడు విజయుడు.

ఆ రాత్రి పడుకోబోయే ముందు ఒక భటుడు 'ఉదయాన్నే పదిహేను క్రోసుల దూరంలోని రాజవరం గ్రామానికి తనిఖీల కోసం వెళ్ళాలని, మంత్రిగారు బయల్దేర మన్నారని' విజయుడితో చెప్పాడు. తొందరగా లేచి మంత్రిగారి నివాసానికి వెళ్ళాడు విజయుడు. అప్పటికే ఆయన వెళ్ళిపోయినట్టు, రెండు రోజుల తరువాత తిరిగొస్తారని వాళ్ళింట్లో చెప్పారు. "కాబోయే మంత్రిని తనతో బాటు గుర్రపు బగ్గీలో తీసుకెళ్ళొచ్చు కదా. ఎందుకిలా చేసాడు? ఇప్పుడెలా వెళ్ళాలని" బాధపడ్డాడు విజయుడు.

కొంత దూరం కాలినడకన, ఇంకొంత దూరం ఎడ్లబండి మీద ప్రయాణించి ఎలాగో వూరు చేరుకున్నాడు. విజయుడిని చూసి కూడా చూడనట్టే ప్రవర్తించాడు మంత్రి. పరిచయమేదీ చెయ్యకుండా సాధారణ పౌరుడిలాగా నిలబెట్టాడు. అదంతా అవమానంగా భావించాడు విజయుడు.

పదిరోజుల తరువాత ఆనకట్ట నిర్మాణపు పనులు పర్యవేక్షణకు వెళదామని చెప్పాడు మంత్రి. విజయుడు వెళ్లేసరికే వెళ్ళిపోయాడాయన. ఎంతో కష్టపడి ఆయన చెప్పిన చోటుకి వెళ్ళాడు విజయుడు. అక్కడా విజయుడెవరో తెలియనట్టే ప్రవర్తించాడు మంత్రి. మధ్యాహ్న భోజన ఏర్పాట్లప్పుడు కూడా తనకొక్కడికే చెయ్యమన్నాడు మంత్రి. పూటకూళ్ళ ఇల్లు వెతుక్కుని భోంచేసి వచ్చాడు విజయుడు.

ఇంకొన్ని రోజుల తరువాత మరో గ్రామంలో కొట్లాటలు అవుతున్నాయని, వాటిని పరిష్కరించి రమ్మని విజయుడితో చెప్పాడు మంత్రి. భటుల సాయం కావాలని అడిగిన విజయుడితో "నువ్వెడుతున్నది యుద్ధానికి కాదు. కొట్లాట పరిష్కారానికి.. భటులెందుకని' అన్నాడాయన. ఆ వూళ్ళోకెళ్లి తనని పరిచయం చేసుకుని సమస్యను పరిష్కరించాడు విజయుడు. 'ప్రక్కన ఓ భటుడున్నా బాగుండేది. తనని పరిచయం చేసేవాడు' అనుకున్నాడు మనసులో.

మొత్తానికి విజయుడి ఆరునెలల శిక్షణ కష్టంగా పూర్తయింది. ఆయన కొడుక్కివ్వాల్సిన పదవిలోకి తాను వచ్చినందుకు కోపంతోనే మంత్రిగారు అలా ప్రవర్తించారని అనుకున్నాడు విజయుడు.

పదిరోజుల్లో మంత్రి బాధ్యతలు అప్పగిస్తారనగా విజయుడిపట్ల మంత్రి గారిలో మార్పు వచ్చింది. కాబోయే మంత్రి అని పరిచయాలు చేయడం, తన ప్రక్కనే ఆసనం వేయించి గౌరవించడం, గుర్రపు బగ్గీలో ప్రక్కనే స్థానమివ్వడం, విందు భోజనాల్లో సమాన స్థాయి కల్పించడం. వగైరా చాలా చేసాడు. తనలోని కోపాన్ని తగ్గించి మంచి చేసుకోడానికే ఇదంతా చేస్తున్నాడని అనుకున్నాడు విజయుడు. విజయుడికి బాధ్యతలు అప్పగించే రోజు ఉదయం విజయుడితో ఏకాంతంగా మాట్లాడాడు మంత్రి ముకుందుడు.

"శిక్షణా కాలంలో నిన్ను కావాలనే దూరంగా వుంచాను. అందుకు ఎంతో బాధ పడేవాణ్ణి. కానీ తప్పలేదు. నువ్వు పని నేర్చుకోవాలంటే కష్టాలు తప్పవు. నా ప్రక్కనే గుర్రపు బగ్గీలో నిన్ను త్రిప్పుతుంటే నిన్ను కూడా మంత్రి లాగానే చూస్తారు పౌరులు. మనస్సు విప్పి ఏమీ చెప్పుకోలేరు. అందుకే మంత్రిగా కాకుండా సామాన్యుడిలాగానే

వారితో  తిరిగేలా చేశాను. ప్రజలతో  కలవాలని, జరుగుతున్నవన్నీ తెలుసుకోవాలని, క్రిందివాళ్ల మంచి చెడులు, కష్టసుఖాలు స్వయంగా చూసి, అనుభవించి విషయాలను నువ్వర్థం చేసుకోవాలనే ఇదంతా చేశాను. భటుల నివాసగృహంలో ఉంచడానికి కారణమూ అదే. ఇప్పుడు నీకొచ్చిన అనుభవం పదవిలో ఉండగా  పదేళ్లకు కూడా రాదు. అందువల్ల ఇబ్బందులు  వచ్చేవి కూడా. చేద్దామనుకున్నది చేయలేక పోయేవాడివి. ఇప్పుడు ఎంతో నేర్చుకున్నావు. అందుకు సంతోషిస్తున్నాను. ముఖ్యమైన మాట చెబుతాను విను. రాజసేవ పూలపాన్పు కాదు. పదవి అనేది ముళ్ల కిరీటం. చాలా జాగ్రత్తగా ధరించాలి. కష్టాన్ని కూడా సులువుగా తీసుకునే ఓర్పు ఇప్పుడు నీకుంది. కాబట్టి అంతా మంచి జరుగుతుంది" అని దీవించాడు.

అనుభవజ్ఞుడైన మంత్రిగారు ముందుచూపుతో వ్యవహరించాడని, ఆయన  ప్రవర్తనను అపార్థం చేసుకున్నానని గ్రహించాడు విజయుడు. ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుని పాదాభివందనం చేసాడు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***నవంబర్ 2022 :*** AS 6996, 7609, 7924, 8915-8919

***డిసెంబర్ 2022 :*** AS 6617, 6639, 7062, 7632,7633, 7634, 8430, 8561 - 8564, 8567, 8921 - 8924, 8927 - 8934, 8936, 8937, 8939
LM - 4362

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**ఏషసుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః।**

**ఏషఏవాగ్నిహోత్రం చ ఫలం చైవాగ్నిహోత్రిణాం ॥**

తాత్పర్యం - ఈయన సకల ప్రాణులలో అంతర్యామియై ప్రకాశిస్తూ, జగత్తు నిద్రించుచున్ననూ జాగరూకుడై తాను మేల్కొని వుండును. అగ్నిహోత్రుని రూపంలో ప్రకాశించేది, తత్ఫలదాతయు ఈ భాస్కరుడే.

ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు ఆదిత్యుని సర్వాంతర్యామిగానూ, వైశ్వానరునిగానూ మరియు యజ్ఞఫలదాతగా కీర్తిస్తూనే, సాధకుడికి వుండవలసిన జాగరూకతను, అలవరచుకొనవలసిన స్థితప్రజ్ఞతను గుర్తు చేస్తున్నారు.

**ఏష సుప్తేషు జాగర్తి** అన్న అగస్త్యుల వాక్యము జగద్గురువులైన గీతాచార్యులు సాంఖ్యయోగములో **యానిశా సర్వభూతానాం, తస్యాం జాగర్తి సంయమి। యస్యాం జాగ్రతి భూతాని సానిశాపశ్యతో మునేః।** అంటూ వివరించిన స్థితప్రజ్ఞుని లక్షణమును ప్రతిపాదిస్తుంది. దీని ద్వారా అగస్త్యులు పరిణతి చెందిన సాధకుడు భౌతిక విషయాదుల యందు సామాన్య మానవుని వలె మమైకం చెందకుండా, కేవలం ఒక ద్రష్టయై, సాక్షిలాగా వుంటాడని తెలియజేస్తున్నారు. అదేవిధంగా అజ్ఞానాంధకారములో సర్వజగత్తు నిద్రిస్తుండగా జ్ఞానిమాత్రం మెలకువగా వుండి మాయను చేరనీయడు. శ్రీబాబూజీ మహరాజ్ ఈ అంశమునే వివరిస్తూ **బ్రహ్మజ్ఞాని సదాసదా జాగరూకుడు** అని శెలవిచ్చారు. ఆ జాగరూకత, అప్రమత్తత సాధకునికి ఎంతో అవసరమని అగస్త్యులు ఈ శ్లోకం ద్వారా తెలియజేస్తున్నారు.

**భూతేషు పరినిష్ఠితః** అన్న సంబోధనతో అగస్త్యులు పరమాత్మ సర్వభూతములలోనూ దాగివున్నాడని బోధిస్తున్నారు. ఉపనిషత్తులు కూడా **ఏకోదేవః సర్వభూతేషు గూఢః** అంటూ ఒకే పరమాత్మ సకల జీవరాశులలోనూ ప్రతిష్ఠితమై వుంటాడని తెలియజేస్తున్నాయి. అది కేవలం తన గురుపరమాత్మయే అన్న ఎరుకను నిజమైన సాధకుడు కలిగి వుంటాడు.

**ఏషయేవాగ్నిహోత్రంచ ఫలంచైవాగ్నిహోత్రిణాం** అన్న ప్రస్తావన ద్వారా అగస్త్యులు వైశ్వానరుడిగా వున్నది, ఆ జీర్ణశక్తి ద్వారా కలిగే జీవశక్తి

ప్రదాత కూడా గురుదేవులే అని సూచిస్తున్నారు. అంతేకాక, యజ్ఞములో ప్రజ్వరిల్లే అగ్నిహోత్రము, హవిస్సు మరియు యజ్ఞఫలం అందించేది కూడా వారేనన్నది దీనిలో దాగివున్న గుహ్యమైన విశేషము. శ్రీ విష్ణు సహస్రనామంలో కూడా **యజ్ఞభృత్, యజ్ఞకృత్, యజ్ఞీ, యజ్ఞభుక్, యజ్ఞసాధనః। యజ్ఞాంతకృత్, యజ్ఞగుహ్యం అన్నమన్నాదయేవచ॥** అంటూ యజ్ఞమునకు కర్తా, భర్తా, ఫలము, సాధనము అన్నీ నారాయణ స్వరూపమే అని తెలుపబడినది.

శ్రీబాబూజీ మహరాజ్‌వారు 1972వ సంత్సరంలో శ్రీకాళీవనాశ్రమ స్థాపన మొదలుకొని, అనేక యజ్ఞయాగాదులను సంకల్పించి, వాటిని భక్తులతో ఆచరింపజేయడం ద్వారా యజ్ఞ ఫలములను అందిస్తూ సాధకుల కర్మరాహిత్యము చేసేవారు. వారిని మనం ఎంతో ప్రీతితో స్తుతిస్తూ తలచుకునే **ఓం యజ్ఞరూపాయ నమః, ఓం యజ్ఞఫలప్రదాయ నమః** అనే అక్షర సత్యమైన నామములలోని అంతరార్థము కూడా అదే. శ్రీమాతాజీవారు కూడా అదేవిధముగా ఎన్నో యజ్ఞములను సంకల్పించి, మనందరితో చేయిస్తూ, ఇహపరములలో తరించేటట్లు ఆశీర్వదిస్తున్నారు.

ఆ క్రమములోనే ఈ సంవత్సరం సద్గురు స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవ మహోత్సవములు సందర్భంగా శ్రీ మాతాజీవారు తలపెట్టిన **శ్రీసద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహా మృత్యుంజయ సంపుటిత రుద్ర యాగంలో** పాల్గొనటం మనందరికీ ఒక స్వర్ణావకాశం!

సాధకుడు నిరంతరం తపోయజ్ఞాన్ని ఆచరిస్తూ **భోక్తారం యజ్ఞతపసా** అన్న జగద్గురువుల బోధలోని ఆంతర్యాన్ని గ్రహించి గురుదేవులు ప్రసాదించిన మంత్రరాజమునే జపిస్తూ ఆ తపో యజ్ఞములో సోమయాజులుగా వెలుగొందాలన్నదే అగస్త్యుల గురు హృదయము ఈ శ్లోకము ద్వారా అందిస్తున్న ఆశీర్వాదము.

- సశేషం

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ఈ సందర్భంలో శ్రీ మాతాజీ గురువు యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు. ఈ మార్గం సత్య మార్గం. కేవలం మనం ఆశ్రయించిన ఒకే ఒక గురుపాదం చూపించగలదు. వారిని ఆశ్రయించినప్పుడు వారి దగ్గర మన మనస్సు దాచకుండా మనలోని దోషాలు అన్నీ విన్నవించుకుంటే ఆ దోషాలు, వాసనలను హరింపజేసుకునే అవకాశం వుంటుంది. కైవల్యోపనిషత్ అధ్యయనం చేయడం వలన పైన చెప్పిన పాపాలన్నీ నశిస్తాయి అని చెబుతున్నారు.

ఇక్కడ రోజూ ఉదయం కాళహస్తి ఆశ్రమంలో గీతాపారాయణ చేసిన తరువాత పరమగురువుల వ్యాఖ్యానం గీతమీద వినిపిస్తారు. ఎందుకంటే కేవలం పారాయణ చేస్తే చాలదు. గురువులు చెప్పినవి మననం చేసుకోవాలి. నిరంతరం విచారణ చేయాలి. మన నడవడికలో, ప్రవృత్తిలో, జీవితంలో మార్పు రావాలి. విన్న వేదాంతం ఆచరణ వేదాంతం కావాలి. ఆత్మ తత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. అందుకే **గురుం ధ్యాత్వా** అంటే గురువుని ధ్యానించాలి అని ఈ ఉపనిషత్తు మొదట్లోనే చెప్పారు. గురువులు ఉపనిషత్ ఉపాసన ద్వారా తనను తాను తెలుసుకునే మార్గం చూపించారు. అదే **అహంగ్రహోపాసన**.

ఈ మంత్రంలో **అధీతే** అన్న పదాన్ని ఉపయోగించారు. అంటే అధ్యయనం చేయాలి. ధీ - బుద్ధి, అధీయతే - ఒక భావనను బుద్ధిలోకి తెచ్చునది అని అర్థం. ఒక భావాన్ని బుద్ధితో అవగాహన చేసుకుని దానిని తనదిగా చేసుకోవాలి. దానినే అధ్యయనం అంటారు. వేదాంత భావాలు కేవలం బుద్ధితో అర్థం చేసుకుంటే చాలదు. వాటిని బాగా అవగాహన చేసుకుని జీవితం దాని ప్రకారంగా జీవించాలి.

పైన చెప్పిన విధంగా చేస్తే ఏమి ఫలితం వస్తుందో శ్రీ మాతాజీ ఈ ఆఖరు మంత్రంలో వివరించారు......

ఈ ఆత్మ తత్వాన్ని నిరంతరం విచారణ చేసి, అనుభవానికి తెచ్చుకున్న సాధకుడు సంసారం అంటే కేవలం భార్యా పిల్లలు కాదు, బాహ్య ప్రపంచం కూడా ఏమీ చేయలేదు, ఈ అధ్యయనం ద్వారా సంసారిక సముద్రమును నశింపజేసే దివ్య జ్ఞానాన్ని పొందుతాడు. ఈ ప్రకారంగా తెలుసుకుని, ఆత్మానుభూతిని పొంది, కైవల్య రూపమైన

మోక్షఫలాన్ని పొందుతాడు. అంటే కైవల్య స్థితిని చేరుతాడు అని మంత్రార్థం. కానీ, మనం కైవల్యంలోనే వున్నాం. అయితే అది గుర్తించడం లేదు. ద్వంద్వాలతో నిండి వున్న ప్రపంచ దృష్టి **నానత్వం** ఆవరించి వున్నందువలన గుర్తించలేక పోతున్నాము. తన్నుతాను గుర్తింపజేసే కైవల్య స్థితిని దివ్యజ్ఞానం గురువుల అనుగ్రహంతో వస్తుంది. ఆ గురుతుని తెలిపేది మామూలు దేవుడు కాదు. గుళ్ళో దేవుని దర్శనం వలన కొంత పుణ్యం కలుగవచ్చు. కానీ, అక్కడ వుండే ఆ శక్తిని అర్థం చేసుకోవడానికి, దానిని అందుకోవడానికి తగిన శక్తి మనకి లేదు. కాబట్టి ఆ దివ్యమైన, అనంతమైన శక్తి మనకోసం మనకు తగినట్లుగా ఒక మానవ రూపంలో అవతరించిన గొప్పదేవుడు గురుదేవుడు. గురుదేవుడు **అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మమాయయా, ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే.** మనని అనుగ్రహించి, తన్నుతాను గుర్తింపజేసే తత్వజ్ఞానాన్ని ప్రసాదిస్తారు గురుదేవులు.

శ్రీ శంకర భగవత్పాదులవారు చెప్పారు - **దుర్లభం త్రయమేవైతత్ మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయః** అని. ముందు మన ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఇల్లు అంటే ఈ బాహ్యమైన ఇల్లు వాకిళ్ళు కాదు. ఈ దేహమే ఒక ఇల్లు. ఎంతో పుణ్యం చేసుకోబట్టి ఈ దేహమనే గొప్ప ఇల్లు అంటే మానవ జన్మ లభించింది. శ్రీ మాతాజీ ఈ క్రింది గీతాన్ని ఆలపించారు......

**అది నాది, ఇది నాదని విర్ర వీగెదవు**

**ఏదీ నీది కాదురా, నేను, నాది**

**దూరమైనప్పుడు నీవు నీవుగా**

**నిలిచెదవురా. ఇది నిజమురా, ఇదే సత్యమురా**

**మమకారములో పడకుమురా, మాధవుని తలపరా జీవా!**

మానవుడు ప్రపంచంలో ప్రతిదీ నాది, నేను అనే అహంకారంతో తనకు సంబంధించిన వాళ్ళమీద, కనిపించే విషయాదుల మీద మమకారంతో తిరుగుతూ వుంటాడు. సుఖదుఃఖాలు అనుభవిస్తూ వుంటాడు. కర్తృత్వ భోక్తృత్వాలు మీద వేసుకుంటాడు.

మన పూర్వ జన్మల పుణ్య సంస్కారం వలనే మహాత్ముల, గురువుల ఆశ్రయం దొరికింది. వారి పాదాల చెంతన చేరాము. వారు మనలను అనుగ్రహించి, ఆశ్రయమిచ్చి వదలిపెట్టడం లేదు. భ్రమరకీటక

న్యాయం రీతిలో అంటే కీటకం చుట్టూ గూడు వుంటుంది. భ్రమరం దాని చుట్టూ తిరుగుతూ, (ఓంకారాన్ని పూరిస్తూ) ఝుంకరిస్తూ, మధ్య మధ్యలో పొడుస్తూ, (గురువు పెట్టే పరీక్షలకు పట్టుదలతో నిలిచే శిష్యుడిలాగా) వుంటే కొన్నాళ్లకు భ్రమరం మాటిమాటికీ పొడిచినా, భయంతో, బాధతో వున్నా సహించి, భ్రమరాన్నే చింతిస్తూ వుంటే కీటకం కూడా ఝుంకరించే భ్రమరం లాగా మారిపోతుంది. ఒక కీటకమే మారిపోతోంది భ్రమరంలాగా. నిజానికి భ్రమరం కీటకం యొక్క రూపాంతరమే. కీటకంలో భ్రమరత్వం వుండబట్టే మిగతా పనులన్నీ మాని, భ్రమరాన్నే చింతిస్తూ భ్రమరమైపోయింది.

అలాగే ప్రతి జీవిలోనూ దివ్యత్వం వుండబట్టే, గురువు అనుగ్రహంతో, నిరంతర తత్వ విచారణ, గురుబోధ ధారణ వలన తత్వానుభూతిని పొందుతూ బ్రహ్మత్వాన్ని చింతించి, చింతించి జీవుడు బ్రహ్మ అవడంలో ఆశ్చర్యమేమున్నది? జాగ్రత, స్వప్న, సుషుప్తి అవస్థలలో ఆ మూడిటిని అనుభవించే విశ్వ, తైజస, ప్రాజ్ఞులలో సమానంగా వుండే పరమాత్మ తత్వం ఒక్కటే అని ఉపనిషత్తులో ముందే చెప్పారు. జీవాత్మ భావన పూర్తిగా నశించిపోయి, అందరిలో వుండే సర్వభూతాత్మ అనే దివ్యమైన ఆత్మానుభూతి స్థితికి చేరుతాడు. ఈ విధంగా ఒక వ్యక్తి మూడు అవస్థలలోనూ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను అధిగమించి, తరువాత తురీయావస్థ స్థితికి చేరుతాడు. అక్కడ ఆ పరమాత్మ ఒక్కటే వున్నది (అస్తి). ఆ నిత్య పరమాత్మలో అనిత్యమైన జీవ భావనకు స్థానమే లేదు. ఇటువంటి కేవల ఆత్మానుభూతిని **కైవల్య పదవి** అంటారు.

ఆఖరులో **కైవల్యం పదమశ్నుతే** అని ఫలశృతిలో రెండుసార్లు చెప్పడం వలన ఈ ఉపనిషత్తు సమాప్తమైనది అని చెప్పడమే కాకుండా, ఆచార్యుల అనుభవానికి మించిన భాషగాని, వాక్యంకాని లేదని దృఢముగా చెప్పడమైనది. ఆఖరి వాక్యం రెండుసార్లు పలించడమనేది ఉపనిషత్తులోని సాంప్రదాయం.

నిరంతర ధారణ, భక్తి శ్రద్ధలతో సాధన చేస్తూ, గురుదేవులు ఆశించిన ఆత్మజ్ఞానాన్ని అనుభవిస్తూ, గురుదేవుల అనుగ్రహం, ఆశీస్సులు పుష్కలంగా మనందరిపై వర్షించు గాక!

# అపూర్వం - అద్వితీయం

- పాలూరి కాళీప్రసాద్

పురాణ కాలంలో వశిష్టాది మహర్షులు బ్రహ్మజ్ఞానులైనప్పటికీ, సంసారులై బహు సంతానంతోనే ఆశ్రమవాసం చేసేవారు. అంతే కాదు, వారి ఆశ్రమాలలో అనేక పశుపక్ష్యాదులు కూడా ఆశ్రయం పొందేవి. అయితే ఈ కలియుగంలో ఎప్పుడు మొదలైందో కానీ ఆధ్యాత్మిక సాధన చేయాలన్నా, గురువులను ఆశ్రయించాలన్నా సంసారాన్ని వదిలేసి సన్యాసులు కావాలని ఒక అపోహ బయలుదేరింది.

ఈ అపోహను పటాపంచలు చేస్తూ, గృహస్థాశ్రమమే ఆధ్యాత్మిక సాధనకు అత్యంత సురక్షితమైనదని బోధించడమే కాక, ఆచరణలో నిరూపించడానికి సమర్థ సద్గురు శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ వారు "శ్రీ కాళీ గార్డెన్స్" అనే ఆశ్రమాన్ని 1972 మే 31వ తేదీన స్థాపించి ఇక్కడ ఎందరో గృహస్థులతో వారి వారి ప్రాపంచిక ధర్మాలను ఒకప్రక్క నిర్వహింపజేస్తూనే, ఆధ్యాత్మిక మార్గంలో పురోగతిని అందిస్తూ మోక్షపథగాములను చేసి, ముక్తిని ప్రసాదించారు, ఇప్పటికీ ఎప్పటికీ ప్రసాదిస్తూనే ఉన్నారు. "కేవలం నీ ఆధ్యాత్మిక జీవితంతోనే నాకు సంబంధం కానీ ప్రాపంచిక జీవితంతో నాకు సంబంధం లేదు" అని శ్రీగురుదేవులు ఏ శిష్యునితోనూ ఎన్నడూ అనలేదు. వారి దృష్టిలో ప్రపంచం ఆధ్యాత్మికానికి భిన్నం కాదు. ఉన్నదంతా ఆత్మయే అయినప్పుడు దానికి భిన్నంగా ఏముంటుంది? అందుకే వారు తమ వద్దకు ఎవరు ఎటువంటి సమస్యలతో వచ్చినా, వారి సమస్యలకు పరిష్కారం చూపుతూ, మెల్లగా వారి మనస్సును భగవంతునివైపు మళ్ళిస్తూ, వారికి ఆధ్యాత్మిక జీవనాన్ని ప్రసాదించారు.

అలాగే పూర్వకాలంలో గార్గి, మైత్రేయి వంటి ఎందరో విదుషీమణులు వేద శాస్త్రాలను అభ్యసించడమే కాక అందులో అపార పాండిత్యాన్ని గడించి వినుతికెక్కారు. అయితే మధ్యలో ఎప్పుడో స్త్రీలకు వేదాలు నేర్పరాదని, వారు దేవాలయాలలో పూజాదికాలకు పనికిరారని ఒక అపోహ బయలుదేరింది. అలాగే కేవలం బ్రాహ్మణులు మాత్రమే అర్చకులుగా ఉండాలనే నియమం కూడా వచ్చింది. అయితే ఇటువంటి అపోహలను తొలగిస్తూ శ్రీగురుదేవులు ఆశ్రమంలో స్త్రీలకు కూడా సకల

విద్యలు నేర్పే ఏర్పాటు చేసి, ఇక్కడి అన్ని ఆలయాలలోనూ స్త్రీలనే (అది కూడా కులంతో సంబంధం లేకుండా) ప్రధాన అర్చకులుగా, సహాయకులుగా నియమించి ఒక క్రొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అది ఇప్పటికీ, ఎప్పటికీ అలాగే కొనసాగుతుంది.

సన్యాసాశ్రమాలకు ఏ పెద్ద కార్యక్రమాన్ని తలపెట్టినా, ఆశ్రమం వెలుపలి గృహస్థులపై ఆధారపడవలసిన పరిస్థితి ఉంటుంది. ఇక్కడ అలా కాక అందరూ గృహస్థులే ఆశ్రమవాసం చేస్తూ ఉండటంతో ఈ ఆశ్రమం స్వయం సమృద్ధిని సాధించి ఎంతటి బృహత్తర కార్యక్రమాన్ని అయినా అలవోకగా నిర్వహించగల సామర్థ్యాన్ని సంతరించుకొంది. అంతేకాక, కేవలం ఇక్కడి గృహస్థుల అవసరాలకే కాక ఈ చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రజలందరికీ ఉపయోగపడేలా అత్యంత తక్కువ ఖర్చుతో, అర్హులైనవారికి ఉచితంగానే విద్యను, వైద్యాన్ని అందించడానికి గురుకులాన్ని, వైద్యశాలను ఏర్పాటు చేశారు శ్రీగురుదేవులు. ప్రతి సంవత్సరం కులమతాలకతీతంగా ఎన్నో వేలమంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. శ్రీగురుదేవుల బోధామృతం, అలాగే ఈ ఆశ్రమంలో విలసిల్లే వినూత్న భావజాలం దేశం నలుమూలలా వ్యాప్తిచెంది సమాజంలో మార్పు రావడంకోసం "సమర్థసద్గురు" ఆధ్యాత్మిక మాసపత్రిక కూడా విశేష కృషి సలుపుతోంది.

అలాగే గోమాతల సంరక్షణార్థమై విశాలమైన గోశాల, అతిథుల కోసం అన్నదానం, జీవన మలిసంధ్యలో సత్తువ క్షీణించి స్వయంగా పనులు చేసుకోలేక, ఆధ్యాత్మిక జిజ్ఞాసతో ఆశ్రమ నివాసం కోరుకునే వృద్ధులకు ఆశ్రిత ఆశ్రయం నిర్వహించబడుతున్నాయి.

ఇక ప్రశాంతతకు నిలయమైన ఈ ఆశ్రమాన్ని మొదటిసారి సందర్శించిన చాలామంది అనే మాట ఇది మరో తిరుమలలాగా వుందని. నిజమే. శ్రీగురుదేవులు వేంకటేశ్వర స్వామిని "మా బ్రదర్" అనేవారు. తిరుమలలాగానే ఈ ఆశ్రమం కూడా నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, వార్షికోత్సవాలతో నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఎల్లప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. అయితే తిరుమలలో స్వామివారిని తనివితీరా దర్శించుకోవాలన్నా, విశేషంగా సేవించుకోవాలన్నా అంత సులభంగా అందరికీ ఆ అవకాశం లభ్యం కాదు. అందుకే **"అహం దూరదస్తే**

**పదాంభోజ యుగ్మ ప్రణామేచ్ఛయాగత్య సేవాం కరోమి! సకృత్సేవయా నిత్యసేవా ఫలం త్వం ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ!"** - "స్వామీ! వేంకటేశా! నేను ఎంతో దూరంనుంచి ఎన్నో ప్రయాసలకోర్చి నీ పాదారవిందాలకు ప్రణామం చేయాలనే కోరికతో వచ్చాను. ఈ చిన్న సేవకే నీవు సంతోషించి నీకు నిత్యసేవ చేసుకున్న ఫలితాన్ని నాకు అనుగ్రహించు" అని వేడుకొని అక్కడితో సంతృప్తి పడవలసి వస్తుంది. కానీ ఆశ్రమంలో ఎవరి ఆవేదనను అనుసరించి వారు ఎంతసేపైనా సాక్షాత్తు భగవదవతార స్వరూపులైన శ్రీగురుదేవుల దర్శన, స్పర్శన, వందన, సంభాషణాది భాగ్యాలను పొంది తమ శక్తికొలది ఆశ్రమసేవ చేసుకొనే అవకాశం అందరికీ లభిస్తుంది. అంతేకాదు, తిరుపతి వేంకటేశ్వర స్వామికి ఏదైనా మ్రొక్కుకుని, అక్కడికి వెళ్ళే అవకాశం లేనివారు కూడా ఈ ఆశ్రమంలో ఆ మ్రొక్కును తీర్చుకుని, సంతృప్తిని చెందిన సందర్భాలు అనేకం.

కాశీ క్షేత్రాన్ని మోక్షధామమని, ఎవరైనా అక్కడ మరణిస్తే, కనీసం బయట మరణించినవారికి అక్కడ అంతిమ సంస్కారం జరిపితే, లేదా వారి అస్థికలైనా అక్కడి గంగలో నిమజ్జనం చేస్తే ఆ మరణించిన జీవునికి మోక్షం కలుగుతుందని హిందువులందరి విశ్వాసం. అలాగే కాశీలోని శ్మశానాలలో పరమేశ్వరుడు సంచరిస్తూ ఉంటాడని, చితికి నిప్పంటించి, అయినవారందరూ వదలి వెళ్ళిపోతే, విలపిస్తున్న ఆ జీవుడికి 'నేనున్నాన'ని ధైర్యం చెప్పి, నారాయణ మంత్రాన్ని ఉపదేశించి తరింపజేస్తాడని కూడా చెబుతారు. అలాగే శ్రీగురుదేవులు కూడా ఈ కాళీవనాశ్రమాన్ని నమ్ముకొని ఇక్కడ జీవనం సాగించిన మానవులకే కాక, పశుపక్ష్యాది సమస్త జీవరాశికి ముక్తిని ప్రసాదిస్తానని అభయం ఇచ్చారు. అందుకే ఇక్కడి భక్తులందరూ ఈ మోక్షధామంలోనే ప్రాణాలు విడవాలని బలంగా కోరుకుంటారు. ఒకవేళ విధివశాత్తు బయట ప్రాణాలు విడిచినా, వారి కుటుంబసభ్యులు వారి భౌతికదేహాన్ని ఇక్కడికే తరలించి అంత్యక్రియలను ఇక్కడనే నిర్వహిస్తారు. అంతేకాక, ఇక్కడి రుద్రభూమిలో అంత్యక్రియలకు సహకరించే సేవకులకు పరమేశ్వర దర్శనం ఎన్నోసార్లు జరిగిన నిదర్శనాలు ఉన్నాయి.

**(తరువాయి భాగం 52వ పేజీలో.................................)**

# చంద్రశేఖర స్వామి

సేకరణ - మురళి

పూర్వం శ్రీశైల పుణ్యక్షేత్రములో అనేక సాధు మఠాలుండేవి. వాటిలో తపస్సంపన్నులైన మహాత్ములుండేవారు. వారిని ఆశ్రయించిన భక్తులకు తగిన మార్గదర్శకత్వం వహించి తరించటానికి మార్గం చూపించేవారు. అట్టివారిలో గొప్ప తపస్వి అయిన చంద్రగుండ మఠాధిపతి శ్రీ చంద్రశేఖర స్వామి ఒకరు. 15వ శతాబ్దం ఆదిలో కన్నడ దేశంలోని సిరిగిరిలో జన్మించారు చంద్రశేఖరయ్య. తల్లి పార్వతమ్మ, తండ్రి శివప్ప. బ్రహ్మచారి చంద్రశేఖరయ్య ఎల్లప్పుడూ శివుని ఆరాధిస్తూ తరచూ యాత్రలు చేస్తుండేవారు. ఒక పర్యాయము శ్రీశైలం చేరుకున్నప్పుడు అక్కడి మఠాలన్నీ దర్శించారు. వాటిలో చంద్రగుండం మఠంలో అపర మల్లికార్జునస్వామి వలే ఉన్న మల్లయ్యస్వామిని చూసి, వారి తేజస్సుకు ఆకర్షితులై వారికి సేవచేస్తూ అక్కడే ఉండిపోయారు. మల్లయ్యస్వామి అనుగ్రహముతో సాధన చేసి పరిపూర్ణులయ్యారు. మల్లయ్యస్వామి అనంతరం  ఆ మఠానికే అధిపతయ్యి చంద్రశేఖర స్వామిగా ఖ్యాతిగాంచారు.

మహబూబునగర్ జిల్లాలో అప్పటి గోపాలపేట సంస్థానములో ఒక గ్రామం బండ్రవెల్లి. ఆ గ్రామంలో గందె నాగప్ప అనే శివభక్తుడు వుండేవాడు. అతడు ప్రతి శివరాత్రికి శ్రీశైలం వెళ్ళి శ్రీ భ్రమరాంబ మల్లికార్జునులను సేవించి, మఠాలను దర్శించి అక్కడి స్వాముల ఆశీర్వచనం పొంది వచ్చేవాడు. ఒక శివరాత్రి రోజున నాగప్ప శ్రీశైల యాత్ర చేసి చంద్రగుండ మఠం దర్శించినప్పుడు శ్రీ చంద్రశేఖరస్వామి వారిలోని దివ్య తేజస్సు అతడిని అక్కడినుంచి కదలనీయలేదు. అక్కడి భక్తులు మరియు సేవకుల ద్వారా స్వామివారి మహిమ తెలుసుకుని, వారిని తనకు మంత్రదీక్ష అనుగ్రహించమని ప్రార్థించాడు. స్వామివారు కరుణించి నాగప్పకు మంత్రోపదేశం చేశారు. నాగప్ప కొన్ని రోజులు మఠంలోనే ఉండి మంత్రానుష్ఠానం చేసుకుని తన స్వగ్రామం చేరుకున్నాడు.

నాగప్ప గురుభక్తి దినదినాభివృద్ధి చెందింది. గురుదేవులు సదా తన వెన్నంటి ఉన్న అనుభూతిని పొందేవాడు. నాగప్ప అభ్యర్థన మేరకు

చంద్రశేఖర స్వామి అనేక పర్యాయములు బంద్రవెల్లి గ్రామం సందర్శించారు. నాగప్ప బంధువులు, మిత్రులు వచ్చి స్వామిని దర్శించి వెళ్లేవారు. స్వామి అక్కడ ఉన్నన్ని రోజులు భక్తి, జ్ఞాన వైరాగ్యముల గురించి తన దర్శనార్థమై వచ్చిన భక్తులకు బోధించేవారు. స్వామి వారి మహిమ తెలిసిన ఇతర గ్రామ ప్రజలు కూడా వచ్చి దర్శించుకునేవారు. నాగప్ప, ఇతర భక్తుల కోరికను అనుసరించి ఆ గ్రామంలో చంద్రగుండ మఠం శాఖను ప్రారంభించారు.

స్వామివారు తమ పర్యటనలో చరిగొండ సీమలో గూడ (నేటి షాద్ నగర్ తాలూకాలోని కేశంపేట) గ్రామం సందర్శించారు. అక్కడి భక్తులు స్వామివారిని తమ మహిమలు చూపమని కోరగా ఒక ఎండిపోయిన మామిడి చెట్టు చిగురించేటట్టు చేశారు. ఈ అద్భుత లీలకు అమితానంద పడిన ఆ గ్రామస్థులు అక్కడ కూడా మఠం శాఖను ప్రారంభించమని కోరడంతో స్వామి అనుగ్రహించి గూడ గ్రామంలో కూడా చంద్రగుండ మఠం శాఖను ప్రారంభించారు. స్వామి వారు ప్రతిసంవత్సరం బంద్రవెల్లి, గూడ శాఖలను సందర్శించి అక్కడి భక్తులకు భగవద్భక్తిని ప్రబోధించి, వారి కష్టాలు తీరటానికి మార్గ దర్శకం చేస్తూ, జిజ్ఞాస ఉన్నవారికి మంత్రోపదేశం చేసేవారు. భక్తులతో అన్నదానం, సాధువుల సేవ చేయించేవారు.

బంద్రవెల్లి, గూడ గ్రామముల ప్రశాంతత, అక్కడి భక్తుల నిరాడంబరత, స్వచ్ఛత, నిజాయితీ, మర్మము ఎరుగని నడవడిక, నిర్మలమైన భక్తి విశ్వాసములు స్వామివారికి ఎంతో ఆనందాన్నిచ్చేవి. స్వామివారి వయస్సు సుమరు 80 సం.లకు చేరింది. స్వామి తమ శేష జీవితాన్ని బంద్రవెల్లి గ్రామములో గడపాలని నిర్ణయించుకున్నారు. బంద్రవెల్లి లోని మఠము చిన్నదిగా ఉండుటవలన, సమీపములోని అరణ్యములో తగిన స్థలము తామే ఎంపికచేసి తమ సమాధిని అక్కడ నిర్మించమని నాగప్పకు, మిగిలిన భక్తులకు సూచించారు. స్వామి ఎప్పుడు జీవసమాధి చెందేది ముందుగానే తమ భక్తులకు తెలియజేశారు. ఆ సమయమునకు వేలాది మంది భక్తులు అక్కడకు చేరుకున్నారు. నాగప్ప మొదలగు భక్తులు స్వామి సూచించిన విధముగా సమాధికి తగిన ఏర్పాట్లు చేశారు. స్వామివారి అభీష్టానుసారము శ్రీ ప్లవంగనామ సంవత్సర మాఘ బహుళ ఏకాదశి సోమవారము

(11-2-1488) బండ్రవెల్లి మఠము నుండి ఊరేగింపుగా మేళతాళాలతో సమాధి స్థలమునకు తీసుకు వెళ్ళారు. స్వామి వృద్ధ శంకరులవలే అత్యంత తేజస్సుతో వెలుగుతున్నారు. భక్తులు హరహర మహాదేవ శంభో అంటూ భక్తితో ఆర్తితో నినాదాలు చేస్తుండగా స్వామి వారు సమాధి ప్రవేశం చేశారు. సమాధి దర్శించే భక్తులకు వారి అభీష్టాలను నెరవేరుస్తూ, నిత్యపూజాదికములతో  మఠం అత్యంత వైభవముగా నిర్వహింప బడుతోంది.

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**నవంబర్ 2022**

4 శుక్ర - చిలుకు ఏకాదశి - ఏకాహం, శ్రీసద్గురుపాదపూజ, సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతములు, భక్తసమారాధన.

5 శని - క్షీరాబ్ధి ద్వాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

7 సోమ - జ్వాలా తోరణం, శ్రీరామలింగేశ్వరస్వామి నగరోత్సవం.

8 మంగ - కార్తీక గురుపూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన. పాక్షిక చంద్రగ్రహణం మ. 2-39గం. నుండి సా. 6-19గం. వరకు.

11 నుండి 21వరకు శ్రీసద్గురు దేవుల ఆరాధనా మహోత్సవములు

10 సాయంత్రం 4-05 గం.లకు పూజ్యమాతాజీవారిచే దీక్షా స్వీకరణ

18 శుక్ర - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ, దీపోత్సవం, శ్రీసద్గురు ఆరాధన

19 శని - శ్రీసద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీసద్గురుపాదపూజ, శ్రీసద్గురు దీక్షలోని వారికి హెూమం

21 సోమ - హెూమం పూర్ణాహుతి, దీక్షా విరమణ.

22 మంగళ - మాస శివరాత్రి

23 బుధ - అమావాస్య

29 మంగళ - సుబ్రహ్మణ్య షష్టి - స్వామికి క్షీరాభిషేకము, సహస్రనామార్చన

**డిసెంబర్ 2022**

3 శని - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేది. శ్రీసద్గురు పాదపూజ, భక్తసమరాధన.

4 ఆది - గీతాజయంతి - గీతాపారాయణ, శ్రీసద్గురుపాదపూజ.

7 బుధ - మార్గశిర పూర్ణిమ - దత్తజయంతి - శ్రీసద్గురుపాదపూజ

17 శని - ధనుర్మాసవ్రత ప్రారంభం

18 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

22 గురు - మాసశివరాత్రి

23 శుక్ర - అమావాస్య

25 ఆది - క్రిస్మస్ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

# వివేక చూడామణి

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

**ఆత్మ జ్ఞానమే ముక్తికి ఉపాయము**

ఆకాశమునకు నీలి రంగు ఎట్లు వాస్తవము కాదో, అట్లే సంగ రహితము, క్రియా రహితము, నిరాకారము అగు ఆత్మకు పదజాల అర్థములతో సంబంధము కూడ భ్రాంతి మూలకమైనది. ఆత్మయందు బుద్ధియొక్క భ్రాంతి చేత జీవ భావము కలిగినది. ఆ భ్రాంతి వున్నంతవరకు రజ్జువునందు సర్ప భ్రాంతి తోచుచుండును.. ఆ భ్రాంతి తొలిగిన ఇక సర్పము గోచరించదు. బ్రహ్మము, ఆత్మ యొక్కటియే అనునట్టి జ్ఞానము కలిగినచో జీవభావము అంతరించును. ఉదాహరణకు బురదతో ఉన్న నీరు ఆ బురద క్రిందికి దిగిపోవుటతో నిర్మలమగును. అట్లే దోష రహితమైనప్పుడు ఆత్మ స్పష్టముగా ప్రకాశించును. (196-203)

**ఆత్మ స్వరూప నిరూపణము**

**జాగ్రత్స్వప్నసుషుప్తిషు స్ఫుటతరం యౌஉ సౌ సముజ్జృంభతే**
**ప్రత్యగ్రూపతయా సదామహమిత్యంతః స్ఫుస్నైకధా,**
**నానాకార వికార భాగిన ఇమాన్ పశ్యన్నహంధీముఖాన్**
**నిత్యానందచిదాత్మనా స్ఫురతి తం విద్ధి స్వమేతం హృది ॥** 219

జాగ్రత్ స్వప్న సుషుప్తులయందు ఏది అంతఃకరణమున 'అహం అహం' (నేను నేను) అని స్ఫురించుచు ప్రత్యగ్రూపముగా భాసించుచున్నదో, ఏది సాక్షి మాత్రముగా చూచుచు ఆనందించుచుండునో, దానినే నీవు అంతఃకరణమునందు వెలుగొందు ఆత్మయని ఎరుగుము.

ఉదాహరణలు : కుండలో ప్రతిబింబితమైన నీటిని చూచి మూఢుడు అదియే సూర్యుడు అని భావించును. అట్లే ఉపాధి గతమైన చిదాభానమును అజ్ఞాని అదియే ఆత్మయని భావించును. విద్వాంసుడైనవాడు, కుండ జలము, సూర్యుని లోని ప్రతిబింబము-కాదని వీటిని ప్రకాశింపచేయువాడు వీటికి భిన్నముగా ఉన్న స్వయం ప్రకాశ స్వరూపుడు అగు సూర్యునే చూచును. అట్లే దేహము, బుద్ధి, చిదాభాసము ఈ మూడిటిని వీడి, బుద్ధిగుహలో సాక్షిరూపంగా ఆత్మను

అఖండబోధ స్వరూపునిగా, స్వయం ప్రకాశకునిగా, నిత్యునిగా, సర్వగతునిగా ఎరిగినవాడు పాపరహితుడు నిర్మలుడు అగును. (223).బ్రహ్మీ భావము పొందిన విద్వాంసుడైన పురుషుడు ఇక జనన మరణరూపమగు సంసార చక్రములో పడడు.

**సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ విశుద్ధపరం స్వత స్సిద్ధమ్।**
**నిత్యానందైకరసం ప్రత్యగభిన్నం నిరంతరం జయతి॥** 227

బ్రహ్మ సత్యము, జ్ఞాన స్వరూపము, అనంతము. అది శుద్ధము, పరము, స్వతఃసిద్ధము, నిత్యము, ఆనంద స్వరూపము, అభిన్నము, నిరంతరము అయినది.

- సశేషం

### *పెదసింగ్రకాలను శాఖలో కార్యక్రమాలు*

**** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును****

**నవంబర్ 2022**

8 మంగళ - కార్తీక పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ. పాక్షిక చంద్రగ్రహణం మ. 2-39గం. నుండి సా. 6-19గం. వరకు.

18 శుక్ర - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ.

**డిసెంబర్ 2022**

7 బుధ -మార్గశిర పూర్ణిమ - దత్తజయంతి - శ్రీసద్గురుపాదపూజ

17 శని - ధనుర్మాస వ్రత ప్రారంభం

18 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, అమెరికావాసులు డా॥ శ్రీ కురిచేటి భైరవ ప్రసాద్‌గారు 4-9-22 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

**సను హి గౌతమ వాక్యేన దుర్నిరీక్ష్య బభూవః।**
**త్రయాణాం అపి లోకానాం యావత్ రామస్య దర్శనం॥**
**శాపస్య అంతమం ఉపాగ్యం తేషాం దర్శనం ఆగతా॥**
**రాఘవౌ తు తతః తస్యాః పాదౌ జాగృహతుః ముదా।**
**స్మరంతి గౌత వచః ప్రతిజగ్రాహ సా చ తౌ॥**
**పాద్యం అర్ఘ్యం తధా ఆతిథ్యం చకార సిసమాహితా।**
**ప్రతిజగ్రాహ కాకుత్సత్యో విధి హష్టేన కర్మణా॥**

ఈ దృశ్యమును గాంచిన విశ్వామిత్రుని హృదయము ఆనందముతో ఉప్పొంగిపోయిన విధమును వాల్మీకి రామాయణములో వివరించిన విధమిది.

గౌతమముని మాటలచే(శాపముచే) అహల్య రూపము, రామునికి తప్ప ముల్లోకములందు ఎవ్వరికీ అగుపడని, దుర్నిరీక్షమైన రీతిలోనుండునట్లు గావింపబడింది. శాపాంతర సమయమందు రామాగమముచే, అహల్య ఆ రాఘవుని దర్శించి, ఆతని పాద ధూళి సోకిన వెంటనే జాగృతి స్థితి పొందింది.

అలా దుర్నిరీక్షణమైన తేజస్సుతో పైకి లేచిన అహల్య రామ, లక్ష్మణులకు ఆత్మ సాక్షిగ పాద్య, అర్ఘ్య, ఆతిధ్యములను గౌరవముతో సాంప్రదాయబద్ధంగా సమర్పించింది.

ఆ తరువాత అచ్చటకు విచ్చేసిన గౌతమమునిని గాంచిన రాముడు, అహల్యను భార్యగా స్వీకరించమని వేడుకొన, ఆతడు అహల్యను మన్నించి తనతో తీసుకుని వెళ్ళిపోయారు.

ఆ సంఘటన పిదప మిథిలానగరమునకు చేరిన విశ్వామిత్రుడు, రామ లక్ష్మణులను జనకుని భవనమునకు తీసుకుని వెళ్ళారు. మార్గ మధ్యమున గల ఉద్యానవనమందలి పూదోటల నడుమ తన చెలికత్తెలతో కలసి పూబంతులతో ఆడుకొనుచున్న యువరాణి జానకి అని పిలవబడు సీత అలసటచే ఆయాసపడుతు నిలబడి పోయింది. అలా నిలిచిపోయిన ఆమెపై రాముని దృష్టి పడింది. యధేచ్చగా సీత చూపులు కూడ రాముని చూపులతో కలిసాయి.

మరుక్షణమే వారు "ఒకరి కోసరం ఒకరు" అన్న స్థితికి వెళ్ళిపోయారు. ఈ దృశ్యమును కవి చక్రవర్తి వాల్మీకి ఇలా వివరించారు.

అంతే! అలా ఒకరినొకరు ఇష్టపడినట్లు చూసుకొనిన చూపులచేత వారిరువురూ ఒకరి మనసులో మరొకరు చొరబడ్డారు. సీత 'ఈ యువరాజు కోసమా నేను ఇంతకాలమూ నిరీక్షించేను?' అని మనసులో అనుకుంది. 'ఈమె కరమందుకొనుటకు మిథిలానగరమునకు విచ్చేసామో' అన్న భావన రామునికి కూడా కలిగింది. కవి చక్రవర్తి తెలియపరచినట్లు, నిజమైన ప్రేమభావనకు మౌనమే సంకేతము కదా?

తన జన్మ రహస్యమును తెలిసిన వైదేహి (విదేహ రాజు జనకునిచే పెంచబడినదిగాన వైదేహి అని సీతకు మరొక పేరు కూడా గలదు) నా మనసు ఎందులకు ఇలా కలవరపడుచున్నది? ఒకవైపు ఆనందావేశముతో ఉప్పొంగుచున్నది. మరొకవైపు ఈ యువరాజుచే ఘనమైన ఆ శివధనుస్సును ఎక్కుపెట్టి, నారను సంధించి విరిచివేయ సాధ్యమగునాయను భయం కూడా కలిగింది. ఈ ధనుస్సు ఉంచబడిన పెట్టె ఎవరిచేతనూ కదలించబడ సాధ్యముకానిది. దానిని చిన్నతనమున తాను సునాయాసముగ కదలించుటను గాంచిన తన తండ్రి జనక మహారాజు ఈ శివధనుస్సును ఎవరైతే విరిచివేయగలరో వారికే తననిచ్చి వివాహం చేయదలచారు. ఎందరో రాజకుమారులు ఈ ధనుస్సును కదలించ యత్నించి విఫలులైనారు. ఈ యువరాజుకి సాధ్యమగు కార్యమా? ఏదేమైనా సరే ఈతనికి నా మనసును అర్పించాను కనుక ఈతనినే నేను వివాహమాడవలయును. ఇంకెవరికీ నా జీవితమును సమర్పించుకోలేను..' అని పదే పదే తనలో అనుకుంది సీత. మునివర్యులతోను, సహోదరునితోను కలసి నగరమందలి విడిది భవనమందు బసచేసిన రాముడు కూడా సీతయొక్క చంద్రబింబ వదనమును తలచుకొనుచూ నిద్రకు దూరమయ్యాడు. వారిరువురికీ ఆ రాత్రి చాలా కష్టంగానే గడచింది. కానీ ఆదిత్యుడు మాత్రం తన ధర్మమును తాను నెరవేర్చుచున్నాడనుటకు చిహ్నంగా తూర్పున వుదయించ నారంభించాడు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)  - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

1972లో ఆశ్రమ స్థాపనానంతరం కృష్ణవేణమ్మగారు ఆశ్రమానికి వచ్చి అక్కడే ఉండిపోయారు. శేషంరాజు గారు కూడ ఉద్యోగ విరమణ కాగానే ఆశ్రమానికి వచ్చి స్థిరపడిపోయారు.



ఆశ్రమ నివాసులైనందుకు సార్థకతగా వాళ్ళు తమ యావచ్ఛక్తితో ఆశ్రమమును, భక్తులను, శ్రీగురుదేవుని సేవించుకున్నారు. కృష్ణవేణమ్మగారు ఆశ్రమంలో ఏ పండుగగాని, ఉత్సవంగాని జరిగినా, భోజనాల ఏర్పాట్ల విషయంలో వంటయింట్లోనే వుండి, తమ వ్యక్తి గత పర్యవేక్షణలోనే వంట కార్యక్రమమంతా జరిపించే వారు. అలాగే దేవాలయాలకు నివేదనకు కావలసినంత పదార్థమంతా సర్దిపెట్టించే వారు. ఆవగింజంత పదార్థం కూడా వ్యర్థం కాకుండా జాగ్రత వహించే వారు.

శేషంరాజు గారు ఉద్యోగ విరమణ చేయగానే పెద్ద జీతాలతో కూడిన ఉన్నతోద్యోగావకాశాలు వచ్చాయి. వారు శ్రీ బాబుతో సంప్రదించారు. శ్రీ బాబు వారితో "ఇప్పుడు మీ ముందు రెండు మార్గాలున్నాయి. ఒక మార్గము ప్రపంచంలో మీకు మరింతగా ధనమును, పలుకబడిని ఎరగా చూపి మహామాయ అనే ఊబిలో మరింత లోతుగా దింపేది. రెండవది, కలిగినది చాలుననే భావనతో అరుదైన మానవ జన్మను ఎలా సార్థకం చేసుకోవాలో తెలియబరచి ఆ దిశలో ముందుకు నడిపేది. రెండూ కావాలనుకోవటం మాత్రం రెండు పడవలలో ప్రయాణం చేసే ప్రయత్నమే. అది జరుగదు. మీరు మొదటి మార్గంలో బాగా అనుభవం పొందిన వారు. రెండవ దానిలో యిప్పుడిప్పుడే కొంచెం కొంచెం అనుభవాన్ని పొందుతూ ఆ మాధుర్యాన్ని కూడా రుచి చూస్తున్న వారు కనుక యీ రెంటిలో మీకేది శ్రేయస్కరమో నిర్ణయించుకుని ఆ ప్రకారమే చేయండి. మీరేది నిర్ణయించుకున్నా, నా ఆశీస్సులు మీకెప్పుడూ ఉంటాయి. మీ ధర్మపత్ని మాత్రం రెండవ మార్గాన్నే ఎంచుకుని, ఆశ్రమానికి వచ్చేసి స్థిర నివాసం ఏర్పచుకున్నది.

ఆమె ఎలాగూ ధన్యురాలే" అన్నారు. శేషంరాజుగారు అంతటితో వుద్యోగ పర్వానికి స్వస్తి పలికి ఆశ్రమ నివాసమే తమ భవ్యకర్తవ్యమని నిశ్చయించుకుని ఆశ్రమానికి వచ్చేశారు.

ఆశ్రమ నివాసం ప్రారంభించిన నాటి నుండి శేషంరాజు దంపతులు తమ జీవితాంతం వరకు ప్రతిరోజు తప్పక తెల్లవారు ఝామున 3 గంటలకు లేచి, స్నానం చేసి వెళ్లి ఆలయంలో ఒక గంట ధ్యానం చేసుకునే వారు. ఎంతటి కార్యభారమైనా నెరవేరుస్తూనే ఆ నియమం తప్పని సరిగా పాటించేవారు.

అప్పటిలో ఆశ్రమంలో జరిగే గృహ నిర్మాణ కార్యక్రమాలను, దేవాలయ నిర్మాణ కార్యక్రమాలను ప్రభుత్వ సివిల్ ఇంజనీరు, శ్రీ బాబు భక్తులు అయిన వీరయ్య చౌదరిగారు మొదటి నుండి తమ స్వయం పర్యవేక్షణలో నిర్వహించే వారు. వారికి శేషంరాజు గారు, మరొక భక్తులు ఉనికిలి సుబ్బరాజు గారు (సూపరింటెండింగ్ సివిల్ ఇంజనీరు) చేదోడు వాదోడుగా ఉండేవారు. విద్యుదీకరణ కార్యక్రమాన్ని శేషంరాజు గారు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించేవారు.

క్షణం కూడా కాలం వృథా చేయక శేషంరాజు దంపతులిరువురు ఆశ్రమ సేవకు తమ్ము తాము అంకితం చేసుకున్నారు. తమ అనంతరం కూడా శ్రీకృష్ణాష్టమి పూజా మహోత్సవాలు ఎప్పటి వలె తమ పేరుతోనే కొనసాగాలని ఆ పుణ్యదంపతులు దృఢ నిశ్చయం చేసుకున్నారు. సుగుణశీలురైన వారి కుమారులు కూడా అలాగే వారికి భరోసా యిచ్చారు. అయినా ఎట్టి వికల్పముల వలనను, ఆ నిర్వహణకు విఘ్నం కలుగరాదనే పట్టుదలతో శేషంరాజు గారు తమ ఆస్తిలో కొంత భూమిని దేవుని పేర వ్రాసి యిచ్చి, దానిపై వచ్చే ఆదాయంతో ప్రతి యేటా శ్రీకృష్ణాష్టమి పూజలు తమ వంశం పేరిట జరుగవలెనని ఏర్పాటు చేశారు.

ఆ విధంగా ఆ పుణ్య దంపతులు తమ గురుదేవులైన శ్రీ బాబునే శ్రీ కృష్ణపరమాత్మునిగా భావించి, ఆ భావనను ఆచరణ రూపంలో శాశ్వత పరచుకొని ధన్యజీవులైనారు. 1998లో కృష్ణవేణమ్మగారు శ్రీగురుసాయుజ్యం పొందారు. 2000 సంవత్సరం నూతన సహస్రాబ్ది, నూతన శతాబ్ది ప్రవేశ శుభ సమయంలో శేషంరాజు గారు శ్రీ గురుచరణ లయం పొందారు.

# భగవంతుని సర్వ వ్యాపకత్వము

ఉద్దాలక మహర్షి కుమారుడు శ్వేతకేతు. ఒక దినము కుమారుని ఈ విధంగా ప్రశ్నించాడు

తండ్రి: "కుమారా! నీవిన్ని దినములు పరతత్వము, బ్రహ్మము, అను విషయములను గురించి అధ్యయనం చేశావు కదా. ఈ భగవంతుడెక్కడ వున్నాడు?" అని అడిగాడు. వారిద్దరికి ఈ విధంగా సంభాషణ సాగింది.

శ్వేత : భగవంతుడు సర్వాంతర్యామి అని మా గురువుగారు బోధించారు.

ఉద్దాలకుడు : కుమారా! సర్వవ్యాపకత్వము అంటే ఏమిటో తెలుసునా?

శ్వేతకేతు: తెలియదు.

ఉద్దాలకుడు: కుమారా! నీవు లోపలికి వెళ్ళి ఒక పాత్రలో నీరు, కొంచెము ఉప్పు తీసుకుని రా. శ్వేతకేతు తండ్రి చెప్పినట్లు చేశాడు.

ఉద్దాలకుడు : కుమారా! ఉప్పును ఆ నీటిలో బాగా కలిపి నోట్లో వేసుకొని చూడు.

శ్వేతకేతు: ఉప్పగా వుంది నాన్నా!

ఉద్దాలకుడు: పాత్రలో చేయి పెట్టి ఉప్పుచేతికి చిక్కుతుందేమో చూడు. శ్వేతకేతు ఆ విధంగానే చేశాడు.

శ్వేతకేతు: ఉప్పు నీటిలో కరిగిపోయింది నాన్నా! చిక్కదు.

ఉద్దాలకుడు : నీ కెట్లాతెలిసింది?

శ్వేతకేతు: పాత్రలోని నీటిని రుచి చూచాను కదా.

ఉద్దాలకుడు : మంచిది. నీవు అనుభవపూర్వకంగా ఉప్పు నీటిలో కలిసిపోయిందని తెలుసుకున్నావు. అదే విధంగా భగవంతుడు ఈ సృష్టిలో లీనమైవున్నాడు. ఆ సత్యమును అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి. ఇదే నీవు ఇక మీదట చేయవలసినది.


గతనెల తరువాయి
మైల
మధుప
వీడు మా పిల్లవాడే స్వామీ! క్షమించండి. మీకు మళ్ళీ స్వయంపాకం ఇస్తాను.
అలాగే అమ్మా! వీడిని మళ్ళీ ఇటు రాకుండా చూసుకో తల్లీ!
1
హమ్మయ్య! మళ్ళీ కష్టపడి అన్నీ వండుకున్నాను. ఇప్పటికే చాలా ఆకలి వేస్తోంది. ఇక భోజనం చెయ్యాలి.
2


ఓం నారాయణాయ స్వాహా!
ఆ! ఈ బాలుడు మళ్ళీ వచ్చాడే? యశోదమ్మా.... !!!
3
అయ్యో స్వామీ! వీడు మళ్ళీ వచ్చాడా? ఈసారి మీరు తలుపులు లోపలనుండి గడియ వేసుకోండి. నేను కూడా వీడిని వేరే గదిలో పెట్టి తాళం వేస్తాను.
4


మూడవసారి..
ఓం మాధవాయ స్వాహా!
అయ్యయ్యో! ఈ బాలుడు మళ్ళీ వచ్చాడే? యశోదమ్మా.... !!!
5
కన్నయ్యా! ఎందుకు మళ్ళీ మళ్ళీ వచ్చి ఇలా ఆయన భోజనాన్ని మైల చేస్తున్నావు?
మూడు సార్లుగా ఆయనే నన్ను పిలుస్తున్నారమ్మా!
అయ్యో! నిన్ను నేనెప్పుడు పిలిచాను?
6


ప్రతిసారీ భోజనం ప్రారంభించే ముందు మీరే నన్ను కేశవా! నారాయణా! మాధవా! అని పిలిచారు కదా స్వామీ?
అయినా మైల అంటే ఏంటమ్మా? కులమతాల అడ్డుగోడలతో సాటి మనిషిని మనిషిగా చూడలేని ఈయన వల్ల నేను మైల పడ్డానా? నేను రావడం వల్ల ఈయన మైల పడ్డారా?
7
నా కళ్ళు తెరిపించారు దేవాదిదేవా! అసలు నేను ఇక్కడకు వచ్చిందే తమరి దర్శనం కోసం. తీరా తమరు నా మీద దయతో పిలవగానే నా వద్ధకు వస్తే గుర్తించలేక సాధారణ గోపబాలుడని భ్రమలో పడిపోయాను.
ఇకనుండి ఎటువంటి భేదభావాలు చూపకుండా ప్రతి మనిషిలోనూ నెలకొన్న పరమాత్మను దర్శించే ప్రయత్నం చేస్తాను తండ్రీ!
8

# బాబూజీతో అనుభవాలు

- మీనాక్షీ శివ సుబ్రహ్మణ్యం

సద్గురు సన్నిధి సేవా భాగ్యం లభించినవారు అదృష్టవంతులు. అజ్ఞాన బంధముల నుండి విముక్తులు కావటమేకాక, గురు మహిమలను తిలకించి పులకించే భాగ్యం లభిస్తుంది.

ఒకసారి నేను పూజ్య బాబూజీ మహరాజ్‌తో కలిసి ప్రయాణం చేసే అదృష్టం లభించింది. ఆనాటి అనుభవాలు ఈనాటికీ విస్మరించలేనివి. బాబూజీ ప్రయాణం హఠాత్తుగా నిర్ణయించబడింది. కావలసిన సామానులు తుని లక్ష్మక్కగారు, కుమారి చంద్ర కారులో హడావిడిగా సర్దుతున్నారు. ఏమీ మరచిపోలేదు కదా? అని ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. అన్నీ సవ్యంగానే చేర్చినట్లు సంతృప్తితో వెలిగిపోతున్నారు. నేను క్రొత్తదానిని కావటం చేత, వారి కోలాహలాన్ని గమనిస్తూ నిలబడి చూస్తున్నాను.

మేమంతా బాబూజీతో సహా కారులో ఆసీనులమయ్యాము. కొద్దిసేపట్లోనే కారు శరవేగంతో రోడ్డుపై దూసుకుపోతోంది. చెట్లు చేమలు వెనుకకు పరుగులు తీస్తున్నాయి. ఆ వేగం నా గుండెల్లో భయోద్వేగాన్ని కలిగించింది. మనస్సు కీడును శంకిస్తోంది. కాస్త నెమ్మదిగా పోనిమ్మని చెప్పడానికి నోరాడలేదు నాకు. హఠాత్తుగా బుద్ధభగవానునికి సంబంధించిన సంఘటన ఒకటి నా మదిలో మెరిసింది!

ఒకసారి బుద్ధభగవానుడు నలుగురు శిష్యులతో కలిసి అరణ్యమార్గం గుండా వెడుతూవుంటారు. ఎదురుగా ఒక మదించిన ఏనుగు రావడం తటస్థించింది. శిష్యులు కలవరపడ్డారు. భీతితో తలమునకలైపోయిన ముగ్గురు శిష్యులు బుద్ధుని విడిచిపెట్టి తలోదిక్కుకూ పారిపోయారు. నాల్గవవాడు మాత్రం బుద్ధుని వెనుక గంభీరుడై నిలుచుని వున్నాడు. 'నీవు పారిపోవేమి?' అని బుద్ధుడు అతనిని ప్రశ్నించాడు. దానికా శిష్యుడు 'భగవాన్! మీరు వుండగా నాకు భయం ఎందుకు?' అని ప్రశాంతంగా సమాధానం చెప్పాడు.

నాకు ఈ సంఘటన జ్ఞాపకం రాగానే ధైర్యం వచ్చింది. బాబు సన్నిధిలో భయం ఏమిటి? అనుకున్నాను. ఇందాక భయాన్ని కలిగించిన కారువేగం ఇప్పుడు నాకు ఆహ్లాదకరంగా పరిణమించింది. గాలిలో తేలియాడుతున్నట్లు ఆనందపడసాగాను.

ప్రయాణం కొంతదూరం సాగాక బాబు 'మజ్జిగా వుందా?' అని అడిగారు. లక్ష్మి అక్క, చంద్ర ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వారు ముఖాలు వెలవెలబోయాయి. 'పోనీ, కొబ్బరి బోండం వుందా?' తిరిగి ప్రశ్న. వారి ముఖాలలో ఖిన్నత ఆవహించింది. ఆ మండుటెండ ప్రయాణంలో దాహానికి మజ్జిగ, లేదా కొబ్బరి నీళ్ళు సమకూర్చాలని వారికి తోచనే లేదు. అన్ని ఏర్పాట్లు సవ్యంగానే చేసినట్లు కొట్టుమిట్టాడి ఎంతో సమయం కాలేదు.

చంద్ర దానిమ్మ గింజలు వలిచి బాబుకి ఇవ్వబోయింది. వారు స్వీకరించకుండా 'నువ్వే తిను' అంటూ ఆమె చేతనే తినిపించారు. భగవంతుడు కోరేవి మానవులు సమర్పించలేరు, మానవులు సమర్పించేవన్నీ భగవంతుడు స్వీకరించడు! మజ్జిగ, కొబ్బరిబోండం వారు కావలసి అడుగలేదనీ, అన్నీ సవ్యంగా సమకూర్చ గలిగామనే వారి భావనని తొలగించేందుకే పూజ్య బాబూజీ వారిని అలా అడిగివుంటారని నేను భావించాను.

దారిలో పెట్రోల్ బంక్ సమీపిస్తుండగా కారు యజమాని, కారు డ్రైవర్‌తో పెట్రోల్ నింపేందుకు కారును బంకుకు మళ్ళించమన్నాడు. 'సరాసరి పోనివ్వు పైన నింపవచ్చులే' అని బాబు హెచ్చరించారు. కానీ, డ్రైవర్ ఆ మాట పట్టించుకోకుండా కారును బంకు దగ్గర పోనిచ్చాడు. ఆశ్చర్యం! బంకు కుర్రవాడు 'పెట్రోల్ అయిపోయింది' అంటూ చేయి ఊపాడు. ఆ తరువాత వరుసగా తటస్థపడిన రెండు బంకులలోనూ కూడా ఇలాగే జరిగింది. భగవంతుడు వారించినా కూడా మానవుడు తన నైజగుణాన్ని వదలలేడు అన్నట్లుగా డ్రైవర్ ప్రవర్తించాడు.

నాల్గవ బంకు సమీపించింది. 'ఈ బంకుకు పోనివ్వు' అని బాబు ఆజ్ఞాపించారు. కారు బంకుకు మళ్ళింది. కుర్రవాడు కారులో పెట్రోలు నింపాడు. ఆకలి తీరిన సంతృప్తితో కారు వాయుజవంతో పరుగులు తీస్తోంది. వాయుదేవుడే మాకు వింజామరలు పడుతున్నాడా అన్నంత హాయిగొలుపుతోంది. మెల్లగా నిద్రాదేవి ఒడిలోకి చేరిపోయాను.

మెలకువ వచ్చేసరికి కారు ఆశ్రమ ప్రాంగణంలో నిలిచి వుంది. అందరమూ కారు దిగాం. బాబు డ్రైవర్‌తో 'ఇక నెమ్మదిగా పో' అంటూ హెచ్చరించారు. ఆ హెచ్చరికలో 'ఇప్పటిదాకా నీవు భగవంతునికి సారథిగా వున్నావు. ఇప్పుడు కాదు సుమా!' అని నాకు ధ్వనించింది.

## బాబూజీతో అనుభవాలు - శైల బాల

ఆర్తితో అర్థించే కోరికలను భగవంతుడు సఫలీకృతం చేస్తాడనే సత్యం భక్తులకు అనుభవైకవేద్యమే! తమతమ ఇష్టదైవాలకు సంబంధించిన అనుభవాలను వినిపించడం వలన వినినవారు సంతోషపడటమేకాక, తమ దైవం మహిమను వ్యక్తపరచటమవుతుంది. అందుకే పూజ్య బాబూజీ మహరాజ్‌వారి వలన నా భర్తగారు పొందిన అనుభవాన్ని సహభక్తులకు వినిపించాలని నా ఉబలాటం. నేను మొదటి నుండి 'బాబూజీ' శిష్యురాలను. నా వివాహానంతరం నా భర్తగారు కూడా శిష్యులయ్యారు. వారు కూడా నా అభీష్టానికి అనుకూలురు కావటం నా అదృష్టంగా భావిస్తాను.

ఇంజనీరింగ్ డిగ్రీ చేతబట్టుకుని ఉద్యోగం కోసం మా వారు ఆఫీసుల చుట్టూ తిరిగి చివరకు రిగ్గుల కంపెనీలో ఇంజనీరుగా చేరారు. ఒకసారి పెద్దమొత్తంలో ఆర్డర్ రావడం జరిగింది. ఈ విషయాన్ని శ్రీ బాబూజీకి ఎరుకపరచి, ఆర్డర్ పూర్తికాగానే ఆశ్రమంలో బోర్ వేయించాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. ఎలాగో చాలా కష్టాలు అధిగమించి ఆర్డర్ పూర్తిచేయడం జరిగింది. కానీ ఆశ్రమంలో బోర్ వేయాలనే వారి ప్రగాఢ వాంఛ అలాగే వుండిపోయింది. రిగ్గులు తయారు చేయించినవారిని ఆశ్రమంలో బోరు వేయమని అడిగేందుకు వారికి మనస్సు ఒప్పలేదు. రోజులు దొర్లిపోతున్నాయి. ఆశ్రమంలో బోరు వేయించలేకపోయాననే చింత వారిని పీడిస్తోంది.

ఒకనాడు వారు గదిలో కూర్చుని నా సంకల్పాన్ని నెరవేర్చే భారం నీదేనంటూ తన గురుదేవునికి మనస్ఫూర్తిగా నివేదించుకున్నారు. ఆవేదనను గురుదేవులు స్వీకరించారా? అన్నట్లు టేబులు మీద ఫోన్ గణగణ మ్రోగసాగింది. వెళ్ళి రిసీవర్ ఎత్తి మాట్లాడారు. సంతోష పారవశ్యంలో మునిగిపోయారు. తన అభీష్టం తను ఊహించలేని రీతిలో ఫలించింది. ఎవరికైతే వారు రిగ్గులు తయారు చేశారో వారే ఫోన్‌లో చెప్పారు 'శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంలో బోరు వేసేందుకు గవర్నమెంట్ మంజూరు జరిగింది. వెంటనే ఏర్పాటు చేయండి' అని.

వారి సంకల్ప సిద్ధికి చిహ్నమా! అన్నట్లు ఆశ్రమం మామిడితోటలో బోరు వెలిసింది. మా వారి ఆనంద బాష్పాలు బోరు నుండి ధారాళంగా ధారాపాతంగా వెలువడుతున్నాయి.

# బాబూజీతో అనుభవాలు

- డా॥ శివ

మనలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను అంకురింపజేసి, ముక్తికి మార్గం చూపే సద్గురువు మనకు లభించడం మన పూర్వజన్మ సుకృతం అనుకుంటున్నప్పుడు 'భుక్తి' అనే చిన్నమాటయిన పెద్ద సమస్య అడ్డు తగులుతుంది. అందరిలోనూ ఈ విషయం నిజమైనా, కాకపోయినా కొందరిలో మాత్రం నూటికి నూరుపాళ్ళూ నిజం. అందుచేత ఆ 'ముక్తి'కి మార్గం కన్నా, ఈ సద్గురువు మన 'భుక్తి'కి మార్గం చూపుతారేమో అన్న ఆశ కలిగి, సద్గురువులు లభ్యమైనప్పుడు భుక్తే ప్రధానంగా ఆయనతో మన సమస్యలు, బాధలు చెప్పుకుని నివారణోపాయం తెలుసుకుందాం అనిపిస్తుంది.

సుమారు 10 సంవత్సరాల క్రితం 'సద్గురు బాబు'ని చూడాలని ఆశ్రమానికి వచ్చాను ఒక రోజు శెలవు పెట్టి. రాత్రయినా బాబు దర్శనం కాలేదు. మనస్సు తపన పడుతోంది. ఎలా ఈ సమస్యకు నివారణోపాయం బాబుగారి ద్వారా అవ్వదా? అని, వేచి వేచి పిల్లిలాగా, అతిభయంతో మేడమెట్లు ఎక్కి పైకి వెళ్ళాను. బాబు ఎవరితోనో మాట్లాడుతున్నారు. నా ఆదుర్దాలో నేను ఆయనకు ఆటంకం కలిగిస్తున్నాను అని తెలిసి కూడా అసభ్యంగా వరండాలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తున్నాను. నా ప్రక్కనే వున్న మరో వ్యక్తి కూడా బహుశ నాలాగే ఆదుర్దాలో వుండి బాబు దర్శనార్థం ధైర్యం చేసి పైకి వచ్చినట్లున్నారు.

బాబు ఇద్దరినీ గట్టిగా విసుక్కున్నారు. 'బాబు మాట్లడుతున్నప్పుడు రాకూడదని తెలియదా?' అని. నా ప్రాణం చివుక్కుమన్నది. అహం దెబ్బతింది. ముఖం వాయలేదుగాని, కందగడ్డలాగా ఎఱ్ఱగా అయింది. గుండె దడదడ కొట్టుకుంది. కాళ్ళు క్షణంలో మెట్లమీద నుండి క్రిందకు నడిపించాయి. మనస్సు పరిపరి విధాల పోయింది. గురువులకు కోపం వుంటే ఎలా? అనుకున్నాను. అయినా ఆయనకు అంతకోపం ఎందుకు రావాలి? అని కూడా అనుకున్నాను. నేను అజ్ఞానిని నన్ను నెమ్మదిగా 'మళ్ళీ రా' అనవచ్చు కదా! అని నాలో నేను సమాధాన పరచుకున్నాను. ఆయన నన్ను గదమాయిస్తుంటే ఎవరైనా నన్ను చూశారా అని జ్ఞాపకం

చేసుకున్నాను. ఇక ఈ రాత్రికి ఎట్టి పరిస్థితులలోనూ వెళ్ళక తప్పదు. రేపు నేను శెలవు పెట్టలేదు కాబట్టి అని మనస్సు ముందు చేయబోయే పని గురించి చెబుతోంది.

ఇంతలో బాబుగారితో మాట్లాడే ఆయన క్రిందకి దిగి వచ్చారు. బాబు నన్ను రమ్మనమన్నారు. ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. నేను అన్నీ మరచిపోయాను. అనురాగంతో చూస్తున్న ఆయన ముఖం చూస్తుంటే 'అబ్బ! ఎంత ప్రేమ బాబుకి!' అనిపించింది. తేలిక హృదయంతో, మందహాసంతో యింటికి వచ్చాను.

మరోసారి మరో అనుభవం! ఆ రోజు రాత్రి బాబుగారు కారులో యిటుగుండా ఆశ్రమానికి వెడుతున్నారని నాకు ముందుగా తెలిసింది. రాత్రి 10గంటలకల్లా తల స్నానం చేసి, లుంగీ కట్టుకుని మా పల్లెటూరు నుంచి నా స్కూటర్ మీద బస్సు వెళ్ళే రూట్‌లో హనుమంతుని గుడికి ఎదురుగా స్కూటర్ వుంచి, గుడి అరుగు మీద కూర్చున్నాను. రాత్రి 10గంటలు దాటింది. బాబు కారు రావడం గుర్తించాను. రోడ్డు మీదకు వచ్చాను. బాబు చూశారు. కారు ఆపారు. డోర్ తెరిచారు. నమస్కారం చేశాను. బాబు కుడి చేతితో నా తలను నిమురుతున్నారు. నా చేతులు రెండూ బాబు పాదాల మీద ఉన్నాయి. నా శరీరంలో కరెంట్ ప్రవహిస్తోంది. ఆనందపడిపోతున్నాను. బాబు అనురాగంతో ఏమి దీవిస్తున్నారో తెలియదు. నిమిషాలు గడిచిపోతున్నాయి. బాబు చేయి నా తల మీద నుండి తియ్యరు. నేను పాదాలను వదలను. ఆ మహదానందం గొప్ప అనుభూతి! ఆ అనురాగ ప్రేమకు నా కళ్ళ నుండి నీళ్ళు వచ్చాయి. తనివితీరా నన్ను దీవించారు అనుకున్నాను. కారు కదిలేవరకూ చూస్తూనే వున్నాను. రాత్రి 11 గంటలకు ఏదో ధైర్యంతో సంతోషంగా నిద్రపోయాను.

# బాబూజీతో అనుభవాలు

-జగన్నాథ ప్రసాద్

**నీతో నవ్వుల్ నాటపాటలు నుడుల్ నీతో విహారమ్ములున్**
**నీతో నున్కి ప్రయాణముల్గలిగి వన్నెంగన్న మా జన్మలే**
**రీతిం జూచినగాని ధన్యతమముల్ లేదిందు సుంతైన వా**
**క్చాతుర్యం బిది చాలు మాకు హనుమత్కాళీ ప్రసాద ప్రభూ!**

భక్త సులభుడు భగవంతుడు! నిర్మలమైన భక్తునికి సేవ చేయడానికి భగవంతుడు ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు, ఎన్ని ఇబ్బందులనైనా స్వీకరిస్తాడు, ఆనందిస్తాడు. దీనికి ఉదాహరణగా పురాణాలలో ఎన్నెన్నో సంఘటనలు కనిపిస్తాయి.

సద్గురు ఎన్నడూ తన శిష్యులను దూరంగా వుంచడు. 'నీవే నేను, నేనే నీవు' అనుకుంటాడు. శిష్యుల మనస్సులో కూడా ఆ భావన కలగాలని సద్గురువు ఆశీర్వదిస్తాడు. అందుకు ముందుగా తానే ఒక అడుగు శిష్యునివైపు వేస్తాడు. గురువు వేసిన ఒక అడుగుకు అదనంగా శిష్యుడు పది, వంద, వెయ్యి, ...... అలా అనంతమైన అడుగులు మనసారా వేయాలి. వేస్తూనే వుండాలి. గురువును విశ్వసిస్తూ, ప్రేమిస్తూ వుండాలి.

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం స్థాపించక ముందు శ్రీబాబు ఎక్కడికైనా కాలినడకనే పయనిస్తూ వుండేవారు. దారిలో తారసపడినవారిని వారివారి పుణ్యఫలాలననుసరించి, వారికి శ్రీబాబు గురించి తెలియకపోయినా శ్రీబాబే వారిని ముందుగా పలుకరించి, వారి యోగక్షేమాలను విచారించి, వారి హృదయాలలో గూడు కట్టుకునే వారు. 'అదే కదా మా అమ్మ జగన్మాత నా ద్వారా చేయించుకునే బిజినెస్' అనేవారు శ్రీబాబు.

శ్రీ చల్లా శేషగిరిరావుగారు 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు సంపాదకుడిగా మద్రాసులో ఉద్యోగం చేసేవారు. వీరి గోత్రం 'స్వతంత్ర కపి'. వారి కుమారుడు శ్రీ కృష్ణమూర్తిగారు బి.ఎ. చదివాక అదే ఆఫీసులో ఎడిటర్‌గా వుద్యోగం ప్రారంభించారు. కృష్ణమూర్తిగారు చాలా పట్టుదలగల వ్యక్తి. నిక్కచ్చిగా వుండేవారు. ముక్కుకు సూటిగా పోయే తత్వం, నిష్కపటంగా మాట్లాడేవారు.

యనమదుర్రు నివాసి శ్రీ కందర్ప పరశురామయ్యగారు శ్రీబాబూజీని 'నా జ్ఞాన పుత్రుడు' అనేవారు. శ్రీబాబు వారిని 'నాన్నగారూ' అని పిలిచేవారు. పరశురామయ్యగారు తమ పెద్ద కుమార్తెను కృష్ణమూర్తిగారికిచ్చి వివాహం చేసారు. అందుచేత కృష్ణమూర్తిగారిని 'బావగారూ' అని వరసపెట్టి పిలిచేవారు శ్రీబాబు. కృష్ణమూర్తిగారి కుమారుడు చల్లా వెంకట రమణ బాబు చిన్నతనంలో తాతగారి దగ్గర వుండి చదువుకునే వారు. బాబూజీకి కూడా చదువు నేర్పాలని శ్రీ పరశురామయ్యగారు విఫలులయ్యారు. శ్రీబాబు వెంకట రమణ బాబును 'నా క్లాస్‌మేట్' అంటూ వుండేవారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఆఫీసు పని భారం వలన ఆరోగ్యం దెబ్బతిన్న శ్రీ కృష్ణమూర్తిగారు వైద్యుల సలహాలను అనుసరించి, 'ఆంధ్ర పత్రిక' ఉద్యోగానికి రాజీనామా చేశారు. యనమదుర్రు గ్రామం వెళ్ళారు. వారు ఒకసారి శ్రీ రమణమహర్షిని కలిసి 'నాకు భగవద్దర్శనం కలుగుతుందా?' అని సూటిగా ప్రశ్నించారు. 'తప్పక కలుగుతుంది' అని భగవాన్ రమణ మహర్షి ఆశీర్వదించారు. మరొకసారి శ్రీ మెహర్ బాబాను కూడా అలాగే ప్రశ్నించారు. వారు కూడా 'నీకు దైవదర్శనం తప్పకుండా కలుగుతుంది' అని సూచించారు.

శ్రీకృష్ణమూర్తిగారు ప్రథమంగా శ్రీబాబును యనమదుర్రులో మామగారింట్లో దర్శించారు. ప్రథమ దర్శనం లోనే వారు 'శ్రీరమణులు, మెహర్‌బాబా చెప్పిన భగవంతుడు శ్రీబాబే' అని నిర్ధారణకు వచ్చారు. యనమదుర్రులో పాఠశాల లేకపోవటంతో రమణబాబుగారి చదువు నిమిత్తం కృష్ణమూర్తిగారు భీమవరంలో పాలూరి శ్రీరామమూర్తి (భీమవరం తాతయ్య) గారి ఎదురింట్లో కాపురం పెట్టారు. భీమవరం గ్రామదేవత శ్రీ మావుళ్ళమ్మ వారిపై కృష్ణమూర్తిగారికి అపరిమితమైన భక్తి, విశ్వాసం. ఆ అమ్మవారి సన్నిధిలో కూర్చుని ఆయన సాధన చేస్తూండేవారు.

శ్రీబాబు భీమవరం వెళ్ళినప్పుడు వీరి ఇంటికి కూడా వెళ్ళేవారు. కృష్ణమూర్తిగారితో చాలా చనువుగా వుండేవారు. ఆయన కూడా అంతకు రెట్టింపు చనువుతో వుండేవారు బాబు దగ్గర. బావగారిని

ఆటపట్టించాలని, ఉడికించాలని బాబు ఏదో అడిగేవారు. కృష్ణమూర్తిగారు ఏదో చెప్పేవారు. 'అదికాదు, నాకు మా అమ్మ చెప్పింది' అని బాబు వాదించేవారు. 'అదేం కాదు. నేను చెప్పినదే కరెక్టు. నాకూ మా అమ్మ చెప్పింది. అదంతే. అయినా మా అమ్మ వేరు, మీ అమ్మ వేరా? కావాలంటే మీ అమ్మనే అడగండి' అనేవారు కృష్ణమూర్తిగారు.

'అసలే కపి' పైగా 'స్వతంత్ర' (వారి గోత్రం 'స్వతంత్రకపి' కదా) ఇంక చెప్పేదేముంది? ఒప్పుకోక తప్పుతుందా' అని నవ్వుకునేవారు శ్రీబాబు.

కృష్ణమూర్తిగారు కూడా అంతే చనువుతో సరదాగా, 'మా ఇంటి పేరులో మాత్రమే 'స్వతంత్రకపి' కానీ, మీ వంటి పేరంతా కూడా అదే కదా' (హనుమత్ కాళీ ప్రసాద బాబు పేరులో 'హనుమత్' అంటే 'కోతి'ని వుద్దేశించి) అనేవారు కృష్ణమూర్తిగారు. శ్రీబాబు మనసారా నవ్వుకునేవారు. తన పాదాలను అంటిన కృష్ణమూర్తి గారిని ఆశీర్వదించేవారు శ్రీబాబు. బావ, బావమరుదుల సరస సంభాషణలు విని చుట్టూ వుండేవారంతా ఆనందించేవారు.

ఒక రోజు రాత్రి కృష్ణమూర్తిగారు ఇంటి అరుగు మీద మంచం వేసుకుని పడుకున్నారు. బాగా గుర్రు పెడుతున్నారు. భీమవరం తాతయ్యగారి ఇంటి అరుగు మీద శ్రీబాబు భక్తులతో మాట్లాడుతున్నారు. అర్ధరాత్రి అయింది. శ్రీబాబు నలుగురు కుర్రాళ్ళను పిలిచి, కృష్ణమూర్తిగారిని తాడుతో నెమ్మదిగా అల్లరి చేయకుండా మంచానికి కట్టేసి, ఆ మంచాన్ని తెచ్చి, తాతయ్యగారి రెండవ అరుగు మీద పెట్టమన్నారు. వాళ్ళు ఎంతో కష్టంగా వచ్చే నవ్వును ఆపుకుంటూ, అలాగే కట్టేసి మంచం తెచ్చారు. తెల్లవారుజామున 3గంటలు అయింది. అయినా కృష్ణమూర్తిగారికి మెలకువ రాలేదు. ఏమీ తెలియనట్లుగా శ్రీబాబు 'రండి రండి అందరూ రండి! దొంగలెవరో వచ్చి కృష్ణమూర్తిగారిని మంచానికి కట్టేశారు' అని అరిచారు. మెలకువ వచ్చిన కృష్ణమూర్తిగారు లేవబోగా అది కుదరలేదు. అప్పుడు శ్రీబాబు 'దొంగలెవరో వచ్చి మిమ్మల్ని మంచానికి కట్టేసి, ఆ మంచాన్ని తెచ్చి ఇక్కడ వదిలేసి వెళ్ళిపోయారు' అన్నారు అమాయకంగా కృష్ణమూర్తిగారితో.

'ఆ దొంగలెవరో నాకు బాగా తెలుసులెండి. అయినా దొంగల నాయకుడు ఇక్కడే వుండగా, ఇంకొక దొంగ రావడానికి ఎన్ని గుండెలు వుండాలి? కృష్ణావతారంలో ఇలాంటి అల్లరి పనులు చేశారని తెలుసుగాని, ఇప్పుడు కూడా మీరు ఇలాంటి కొంటె పనులు చేస్తారని అనుకోలేదు' అన్నారు కృష్ణమూర్తిగారు ధీమాగా.

మనసారా నవ్వుకుని శ్రీబాబు నెమ్మదిగా ఆ కట్లు విప్పారు. భవబంధాలు అనే కట్లు శ్రీబాబు విప్పారు అనుకుని శ్రీకృష్ణమూర్తిగారు మనస్సులోనే శ్రీబాబుకు వందనాలు అర్పించుకున్నారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**నవంబర్ 2022**

4 శుక్ర - చిలుకఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.
5 శని - క్షీరాబ్ధి ద్వాదశి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.
8 మంగళ - కార్తీక పూర్ణిమ -సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ. పాక్షిక చంద్రగ్రహణం మ. 2-39గం. నుండి సా. 6-19గం. వరకు.
18 శుక్ర - శ్రీగురుదశమి -సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.
29 మంగళ - శ్రీ సుబ్రహ్మణ్య షష్టి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

**డిసెంబర్ 2022**

3 శని - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేదీ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
4 ఆది - గీతాజయంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
7 బుధ - మార్గశిర పూర్ణిమ - దత్త జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ
17 శని - ధనుర్మాస వ్రత ప్రారంభం
18 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.
25 ఆది - క్రిస్మస్ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# బాబూజీతో అనుభవాలు

- ఎన్. కుట్టీ

అది 1968వ సంవత్సరం. గుండుగొలనులో శ్రీబాబూజీ శరన్నవరాత్రులు జరుపుతున్నారు. అప్పుడు నా వయస్సు 21 సంవత్సరాలు. మేము పిల్లలమని మా నాన్నగారు మమ్మల్ని ఎక్కడకీ పంపించేవారు కాదు. మా తాతగారైన కందర్ప పరశురామయ్యగారిని శ్రీబాబూజీ 'నాన్నగారూ' అని పిలిచేవారు. కందర్ప పరశురామయ్య గారు జ్ఞాని. వడాలిమామ్మగారి కొడుకు సుబ్బారావు అప్పుడు హైదరాబాద్‌లోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తూ వుండేవారు. అతని భార్య రామలక్ష్మి. వారి కుటుంబంతో నాకు బాగా పరిచయమున్నది. నేను ప్రతిరోజు వారింటికి వెడుతూ వుండేవాడిని. ఆ భార్యాభర్తలిద్దరూ నన్ను ఎలాగైనా గుండుగొలనులో నవరాత్రులకు శ్రీబాబూజీ దగ్గరకు తీసుకువెళ్ళాలని నిశ్చయించుకుని, మా నాన్నగారిని అడిగారు. వారు ససేమిరా వీల్లేదన్నారు. మొత్తానికి ఎలాగైతే బలవంతంగా ఒప్పించి, నేను వారితో కలసి గుండుగొలను బయలుదేరాను.

ఎప్పుడూ హైదరాబాద్ విడిచి నేను ఎక్కడకీ వెళ్ళలేదు. అందులో బస్ ప్రయాణం అదే మొదటిసారి. చాలా ఉత్సాహంగా గుండుగొలను జేరాము. అప్పుడు అక్కడ పూజ జరుగుతోంది. పూజలో మధ్యాహ్నం వరకు బాగానే వున్నది. మధ్యాహ్నం అయ్యేసరికి మనస్సులో 'ఏమిటీ పూజ ఇంతసేపు విరామం లేకుండా' అని విసుగు పుట్టింది. ఇహ రాత్రికి తిరిగి హైదరాబాద్ వెళ్ళిపోవాలి అనిపించింది. సాయంత్రం పూజ అవ్వగానే కామేశ్వరి అత్తయ్య కనిపించింది. నేను ఆమెతో 'రాత్రికి బయలుదేరుతున్నాను హైదరాబాద్‌కి' అని చెప్పాను. అప్పుడు ఆమె 'బాబు అనుమతి తీసుకుని అప్పుడు వెళ్ళాలి' అన్నారు. నా గుండెల్లో రాయి పడింది. నాకు అసలే కొత్త! ఈ బాబుగారు ఎప్పుడు కనబడతారు! నాకు వెళ్ళడానికి ఎప్పుడు అనుమతి ఇవ్వాలి అని. సరే వీలున్నప్పడు ఆయనను అడిగేద్దాం అని ఎదురు చూస్తున్నాను. ఎంతకీ ఆయన దర్శనం అవలేదు.

ఆ రోజు రాత్రి 9గం.లకు ప్రసాదాల అనంతరం ఒక చిన్నగదిలో ఆడవారు ఒక ప్రక్క, మగవారు మరో ప్రక్క అలసిపోయి నిద్రపోతున్నారు.

నాకు నిద్ర పట్టలేదు. నా దృష్టి అంతా బాబు ఎప్పుడు కనబడతారు, ఎప్పుడు అనుమతి ఇస్తారు, ఎప్పుడు హైదరాబాద్ వెళ్ళిపోదామా అని వుంది. ఆలోచిస్తూ ఒక మూల కూర్చున్నాను. ఆ గదికి ఒక ప్రక్క బాబు గది, మరో ప్రక్క బయటకు వెళ్ళడానికి మెట్లు వున్నాయి. సరిగ్గా రాత్రి 12గం.లకు బాబు తమ గది తలుపు తెరచుకుని, అందరూ నిద్రపోతూ వుండటం గమనించి, 'ఏమిటల్లా ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు' అంటూ వారి చేతిలోని టార్చ్‌లైట్ నా మొహం మీద వేసి, 'ఎవరు?' అన్నారు. నేను 'కుట్టిని బాబూ!' అన్నాను. వెంటనే ఆయన 'భగవంతుణ్ణి మరచిపోవద్దు' అని చెప్పి తమ గదిలోకి వెళ్ళిపోయారు. ఇహ మళ్ళీ ఆ మరునాడు రాత్రి దాకా ఆయన అనుమతి ఇవ్వలేదు.

ఆ మరునాడు నేను 'అందరూ బాబు భగవంతుడు అంటున్నారు కదా! అదే నిజమైతే ఎంత రాత్రి అయినా సరే ఈ రోజు కూడా వచ్చి ఆయన నాకు దర్శనం ఇవ్వాలి' అనుకొని అదే స్థానంలో అలాగే కూర్చుని ఎదురు చూస్తున్నాను. (రెండోరోజు) రాత్రి 1-30ని॥లకు శ్రీబాబు తమ గది నుండి బయటకు వచ్చి, టార్చ్‌లైట్ నా ముఖం మీద వేసి, 'కుట్టీ! భగవంతుణ్ణి మరచిపోకు' అని చెప్పి వెళ్ళిపోయారు. పూజలు జరుగుతున్నాయి. అనుమతి మాత్రం రాలేదు. అది మూడవ రోజు. మళ్ళీ మనసులో నేను ఈ రోజు కూడా ఎంత రాత్రి అయినా సరే ఆయన దర్శనం కోసం మేలుకునే వుంటాను తప్పక నా కోసం వస్తారు' అనుకున్నాను. రాత్రి 10 అయింది, 12 అయింది, 1గం. అయింది ఆయన మాత్రం రాలేదు. తెల్లవారుఝామున 3గం.లకు తలుపు తీసుకుని వచ్చి నేరుగా నా మీద టార్చ్‌లైట్ వేసి, 'కుట్టీ! భగవంతుణ్ణి మరువవద్దు' అని చెప్పి గదిలోకి వెళ్ళిపోయారు.

ఆ మరునాడు నన్ను హైదరాబాద్‌కు వెళ్ళమన్నారు. అంతవరకు మనస్సు ఎప్పుడెప్పుడు వెళ్ళిపోతానా అని ఆతృతతో వున్న వాడిని, ఏలూరు వెళ్ళి బస్ టిక్కెట్ కొనగానే ఇంకా రెండు రోజులు ఇక్కడే వుండిపోతే బాగుండే అని అనిపించింది.

సద్గురుదేవులకు తెలుసు. ఎప్పుడు ఏమి చెయ్యాలో, ఎప్పుడు మన మనస్సు మార్చాలో అప్పుడే మారుస్తారు!

# బాబూజీతో అనుభవాలు

-డా॥ పి. రామచంద్రరాజు

సుమారు 40 సంవత్సరాల నాటి మాట. ఆది నారాయణ శాస్త్రికి బాల్యంలోనే బాబూజీతో పరిచయం ఏర్పడి, చదువుమాని బాబునే అంటిపెట్టుకుని వుంటున్నాడు. 'నీతోపాటు సన్యాసిని చేస్తావా ఏమిటి?' అని వూళ్ళోవారు బాబుని అడిగేవారు.

బాబు శాస్త్రిని పిలిచి, 'శాస్త్రీ! నీవు నాతోనే వుండాలని అనుకుంటున్నావు కదా! మనిద్దరం యిలా వుంటే మనల్ని ఎవరు పోషిస్తారు? నీవు మొదట చదువు పూర్తి చెయ్యి. తరువాత నీకు వుద్యోగం వస్తుంది. అప్పుడు నేను కూడా నీతోనే వుంటాను' అన్నారు.

శాస్త్రికి ఈ ఆలోచన బాగా నచ్చింది. తమ్ముడు అనంతం అన్నను తన దగ్గర వుంచుకుని చదివిస్తున్నాడు. బాబు వచ్చి చూసి వెడుతున్నారు.

తమ్ముడు చూస్తున్నప్పుడు అన్న చేతిలో పుస్తకం వుండేది. చూడనప్పుడు బాబు ఫొటో పెట్టుకుని ధ్యాన ముద్రలో పడిపోయేవాడు. పరీక్షకు కూర్చున్నాడు. పత్రం తీసుకుని బాబుని ప్రార్థించుకున్నాడు. పేపరులో పద్మం లాంటి బాబు ముఖం, విశాల ఫాల భాగం, కలువరేకుల వంటి కన్నులు, సంపెంగ పుష్పం లాంటి నాసిక దర్శనం అవుతోంది. శాస్త్రి తన్మయుడైపోయాడు. ఆ తన్మయ స్థితిలో గంట మ్రోగింది. వులిక్కి పడ్డాడు. పరీక్షాధికారికి తెల్ల కాగితం యిచ్చి బయటకు వచ్చాడు.

ఫలీక్షా ఫలితాలు వచ్చాయి. పరీక్ష పోయింది. నింద బాబు మీద పడింది. ఆశ్చర్యం! మార్కుల లిస్ట్ వచ్చింది. అందులో శాస్త్రి వుత్తీర్ణుడైనట్లు తెలిసింది. పట్టా వచ్చింది. ఉద్యోగమూ వచ్చింది.

ఇంకా శాస్త్రికి ఎన్నో అనుభూతులు. ఏ పని చేస్తున్నా లోపల బాబు దర్శనం. బయట వస్తువులలో సైతం బాబు దర్శనం. భాక్త్యావేశంలో ఒక సారి గుండెలు చీల్చుకునే ప్రయత్నంలో బ్లేడుతో ఉదరం పైభాగాన కోసుకున్నాడు. అప్పుడూ బాబు దర్శనం అయింది. ఏ శబ్దం అయినా బాబే అనుకునేవాడు. మనస్సు ఏకత్వాన్ని పొందింది.

ఒకసారి నడిరోడ్డు మీద వెడుతూ శునకాన్ని చూశాడు. దానిలో కూడా బాబునే దర్శించాడు. నమస్కరించి క్రింద కూర్చుండిపోయాడు. కార్లు, లారీలు ఆయన్ను తప్పించుకుని తిరుగుతున్నాయి. ఇలా ఎన్నోసార్లు!

అక్కౌంట్ పుస్తకాలలో బాబు నామం, రూపం తప్ప ఇతరం కనిపించేది కాదు. తనలో బాబూజీ మహావాక్య బోధ ఇంకా ఇంకా పైకి నిలుపమని ఆదేశం. ఫలితం శాస్త్రి సమాధి నిష్ఠుడయ్యేవాడు. కానీ, ఉద్యోగం మాననీయ లేదు బాబు. శాస్త్రి, బాబూ కలిసే వుంటున్నారు. శాస్త్రి కోరికా నెరవేరింది. కుటుంబ సమస్యా తీరింది.

ఆనాడు 'సన్యాసిని చేస్తావా?' అని అడిగిన వారే ఇప్పుడు అంటున్నారు 'బాబు నిజంగా సమర్థ సద్గురువే!' అని.

(పేజి 25 నుండి అపూర్వం - అద్వితీయం తరువాయి భాగం........)

ఎందరో మహర్షులు పూర్వకాలంలో తపస్సులు, యజ్ఞ యాగాదులు నిర్వహించిన పవిత్ర క్షేత్రమైన ఈ కాళీవనాశ్రమం ఆధునిక కాలంలో శ్రీగురుదేవుల పవిత్ర పాదస్పర్శతో అణువణువూ పునీతమై, పుట్టినది మొదలు శ్రీగురుసాయుజ్య ముక్తిని పొందేవరకు మానవుని సరైన మార్గంలో నడిపిస్తూ, అడుగడుగునా ఆదుకొంటూ, కులమతాలు, ఆర్థిక వ్యత్యాసాలతో సంబంధం లేకుండా అందరూ ఒక్క కుటుంబంవలె మెలిగే ఆశ్రమవాసులతో విరాజిల్లుతూ ఆచంద్రతారార్కం ఇలాగే వర్ధిల్లుతూ ఉంటుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

శ్రీకాళీవనాశ్రమ స్వర్ణోత్సవాలు 11 నవంబర్ 2022 నుండి 21 నవంబర్ 2022 వరకు అత్యంత వైభవంగా జరుగబోతున్నాయి. ఈ ఉత్సవాలకు భగవద్భక్తి, ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగినవారందరూ ఆహ్వానితులే!

# గురువుల చెంత వుండవు చింతలు

- కూచిమంచి సుబ్రహ్మణ్యం

శ్రీ ఎక్కిరాల భరద్వాజ 'సాయి లీలామృతం' అనే గ్రంథంలో ఆసక్తిదాయకమైన ఒక సన్నివేశాన్ని మనోజ్ఞంగా వర్ణించారు. ఒకానొక కేసు సందర్భంగా కోర్టువారి పనుపున వచ్చిన న్యాయవాది ప్రశ్నలకు షిరిడి సాయిబాబా విచిత్రమైన సమాధానాలు చెప్పడం అందలి విశేషం. ఈ విధంగా సాగాయి ప్రశ్నోత్తరాలు.

న్యాయవాది - మీ పేరేమిటి?

సాయిబాబా - మీరంతా నన్ను సాయిబాబా అంటున్నారు.

మీ తండ్రి పేరో? - అదీ సాయిబాబాయే. మీ మతం ఏమిటి? - కబీర్ మతం. మీ కులం? - దైవం. మీ వయస్సు? - లక్షల సంవత్సరాలు. సరిగ్గా చెప్పండి - నేను ఎప్పుడూ అబద్ధం చెప్పను.

న్యాయవాది మతిపోయింది. చాలు చాలు అనుకుని తిరుగుముఖం పట్టాడు.

ఇలలో సాక్షాత్ పరబ్రహ్మస్వరూపులుగా వెలుగొందే మహాత్ములను వారి కులగోత్రాలను గురించి ప్రశ్నించటం కంటే అవివేకం మరొకటి వుండదు. అనంత విశ్వమంతటా వ్యాపించిన మహాతేజస్సును కృత్రిమమైన గోడల మధ్య బంధించడం సాధ్యమా! సద్గురువులు వుండేది గదులలో కాదు. వారిది కాని మతం లేదు, కులం లేదు. షిరిడి సాయిబాబా చెప్పిన జవాబులు మళ్ళీ ఇటువంటి చొప్పదంటు ప్రశ్నలు వేయవద్దని హెచ్చరించడానికి తగిలించిన చురకలు మాత్రమే.

తన మతం కబీర్ మతం అనడంలో సాయినాధుని ఆంతర్యం సర్వమత తత్వ సారానికి తాను ప్రతీకనని చాటటమే. ఇక తన కులం దైవం అని చెప్పడంలో అంతరార్థం సర్వమానవులలో ఆత్మవస్తువు ఒక్కటేననీ, అదే నిత్యమని, బాహ్యరూపాదులు అనిత్యం, అప్రధానం అని గుర్తు చేయడమే. మరి వయస్సు మాటేమిటి? ఎంతటి మహిమాన్వితులైనా కొన్ని లక్షల సంవత్సరాలు జవసత్వాలతో జీవించారంటే నమ్మశక్యమా? పైగా అది అబద్ధం కాదట. సాయి ప్రభువుకు అనృత దోషం ఆపాదిస్తే కళ్ళుపోవూ?

తన గురువు వయస్సు నాలుగువేల అయిదువందల

సంవత్సరాలని ఒక యోగి చెప్పినప్పుడు పాల్ బ్రంటన్ విస్తుపోయాడట! రమణ మహర్షి శిష్యుడిగా మారి తరించిన మహాజిజ్ఞాసువు పాల్‌బ్రంటన్. వృత్తి పత్రికా రచన. అప్పట్లో ఇంకా విజ్ఞాన శాస్త్ర వాసనలు వదలుకోలేని ఈ మాజీ బ్రిటీష్ సంపాదకుడు అదెట్లా సాధ్యమని నిలదీసి అడిగాడట. యోగవిద్యను అభ్యసిస్తే 4000 ఏండ్లే కాదు, ఎంతకాలమైనా జీవించడం సాధ్యమేనని యోగి చెప్పాడట. పవిత్రమైన హిమాలయ ప్రాంతాలలో కేవల సంకల్పమాత్రాన మృత్యువును జయించి తపస్సమాధిలో మునిగిన మహాపురుషులు ఇప్పటికీ వున్నారని చాలా మంది నమ్మకం.

దీన్నిబట్టి తేలే విషయం ఏమిటంటే, నిజమైన జ్ఞానులకు కాలమానం వర్తించదు. కాలసర్పం వారి దరిదాపులకు రాజాలదు. కాలం కల్పించే వృద్ధిక్షయాలకు వారు అతీతులు. వారి వయస్సు ఇంత అంత అని గణించి చెప్పడం ఎవరికి సాధ్యం? పైగా సామాన్య మానవులకు, జ్ఞానులకు ఒక తేడా వున్నది. సామాన్యులకు పూర్వజన్మ స్మృతి వుండదు. కానీ మహాత్ములకు పూర్వజన్మ జ్ఞానం వుంటుంది. ఒక జన్మ చాలించి మరొక జన్మ ఎత్తడం అనేది వారి విషయంలో పాత వస్త్రం విసర్జించి, క్రొత్త వస్త్రం ధరించడం వంటిదే. జనన మరణాల ప్రసక్తి లేదు. భగవంతుని వలెనే కారణ జన్ములు ఆదిమధ్యాంత రహితులు.

నంబూరులో వేంచేసి వున్న శ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబుగారి వయస్సు కూడా అంతుబట్టని రహస్యమే. ఆయన రూపం ఒక్కొక్కసారి ఒక్కొక్క విధంగా కనిపించడం ప్రత్యేకించి గమనించదగిన విషయం. ఒకసారి మిసమిసలాడే నవయువకులు, మరొకసారి నడివయస్సులు, ఇంకోసారి అనుభవం పండిన వృద్ధులు - సూక్ష్మంగా పరిశీలించేవారికి బాబుగారిలో ఈ రూప భేదాలు స్పష్టంగా గోచరిస్తాయి. ఇలాగే బాబుగారి వదనంలో హావభావాలు, శరీరవర్ణం ఆయా సందర్భాలను బట్టి మారిపోతూ వుండటం మరొక విశేషం. అటు ఊర్లో శ్రీరామ నవమి, శివరాత్రి వంటి పండుగల సందర్భంగా భక్తి పారవశ్యంతో ప్రజలు పూజలు, వేడుకలు జరుపుతుంటే, ఇటు మసీదులో సాయిబాబా అమితావేశంతో చిందులు త్రొక్కేవారట. దానికి కారణం సులభంగా ఊహించుకోవచ్చు. నంబూరు బాబుగారు కూడా శివరాత్రి

నాడు రౌద్రాకారం దాల్చి, అనంత శక్తి సంపన్నులుగా సాక్షాత్కరిస్తారని, దేవీ నవరాత్రులలో ఉగ్రరూపంతో వుంటారని, కృష్ణాష్టమి రోజున, శ్రీరామ నవమి సందర్భంలోనూ నీలివర్ణ ఛాయతో వెలిసిపోతూ శ్రీ మన్నారాయణుని అవతార లీలలను రుచి చూపిస్తుంటారని ఆశ్రమవాసులు చెప్పగా విన్నాను. అటువంటప్పుడు రూపాన్నిబట్టి లేదా ఇతర ఆధారాలనుబట్టి బాబూజీ వయస్సు ఇంత అని నిర్ణయించడం ఎవరి తరం? ఒకసారి ఒక భక్తుడు సాహసించి, బాబూజీని వారి వయుస్సు విషయువై ప్రశ్నించగా 'ఎప్పటి నుండి లెక్కపెట్టి చెప్పమంటావు?' అని ఎదురు ప్రశ్న వేశారట.

వయస్సు విషయంలోనే కాక, ఇతర విషయాలలో కూడా షిరిడీసాయినాధునికి, నంబూరు బాబుగారికి పోలికలు వున్నాయి. ఇరువురి జన్మ వృత్తాంతం మూసిన పుస్తకమే! ఎప్పుడు ఎక్కడ జన్మించారో, వారి జననీ జనకులు ఎవరో ఎంత ఆరాతీసినా ఎవరికీ అంతుపట్టలేదు. సాయిప్రభువు ఎక్కడో పుట్టి, ఎక్కడెక్కడో తిరిగి షిరిడీ గ్రామం చేరుకున్నట్లే, నంబూరు బాబుగారు కూడా ఎక్కడో ఆవిర్భవించి, కొండలలో, పుణ్యనదీ తీరాలలో, పవిత్ర క్షేత్రాలలో కఠోరమైన నిష్ఠతో జపతపాదులు ఆచరించి చివరకు బాల్యదశలోనే పశ్చిమ గోదావరి జిల్లాలోని యనమదుర్రు గ్రామంలో ప్రవేశించి, శ్రీ కందర్ప పరశు రామయ్యగారి 'దత్తపుత్రులు'గా పెరిగి పెద్దవారైనారు. బాబుగారికి మానవాకృతిలో గురువు అనేవారు ఎవరైనా వున్నారనుకుంటే అది పరశు రామయ్యగారే! అయితే ఒక విశేషం - పరశురామయ్యగారు కొన్ని విషయాలలో మాత్రమే బాబూజీకి గురువు. ఆత్మజ్ఞానం, ఆధ్యాత్మిక విషయాలలో మటుకు శిష్యుడే గురువుకు గురువు! సాయిబాబా లీలలను, బాబూజీ నిరాడంబరంగా భక్తకోటిపై వర్షించే ప్రేమానుగ్రహాలను గమనిస్తే, ఇరువురూ స్వయంభువులని, పుట్టుకతోనే జ్ఞానులని అనిపిస్తుంది. అటు సాయిబాబాలోనూ, ఇటు హనుమత్కాళీ వర ప్రసాద్ బాబుగారిలోనూ ప్రముఖంగా కనిపించే విశేషం పరాకాష్ఠ నందుకున్న గురుభావన. సాయిబాబా సమర్థ సద్గురువుగానే వ్యవహరించడం గమనార్హం. బాబూజీ కూడా తనను సద్గురువుగా భావించుకుంటే చాలు అంటారు. అయితే సద్గురువు అంటే ఎవరు?

ఆయన పాత్ర ఏమిటి? ఈ విషయాలపై ఇరువురి భావాలు ఒక్కటే.

సాయిబాబా తనకు ఒక గురువు వున్నట్లు పెక్కు సందర్భాలలో శిష్యులకు వెల్లడించారు. తన గురవు పేరు రోషన్‌షా అని కొందరితోనూ, వెంకూసా అని మరికొందరితోనూ చెప్పారు. పేరు ఏదైతేనేమి? షిరిడి ప్రభువుకు ఒక గురుదేవులు వుండేవారని నమ్మడానికి తగినంత ఆధారం వున్నది. అడవిలో ఒక కూలివానితో చర్చిస్తున్న సమయంలో ఆ దివ్యపురుషుడు వారి ఎదుట నిలిచి 'నీకు కావలసినదాన్ని నేను చూపిస్తాను. నాతో వస్తావా?' అని సాయిబాబాని ఆహ్వానించారట. ఆ తరువాత తన గురువు తననొక బావి దగ్గరకు తీసుకువెళ్ళి తాటితో తల క్రిందులుగా చెట్టు నుంచి బావిలోనికి వ్రేలాడదీశారట. ఈ స్థితిలో 5గంటలు వుంచిన తరువాత గురువు తిరిగి వచ్చి, ఎట్లా వున్నావని ప్రశ్నించగా, పరమానందంలో తేలిపోతున్నానని సాయి సమాధానం. శిష్యుని చేవ ఏపాటిదో తెలుసుకొనడానికి అదొక అగ్ని పరీక్ష! అందులో క్లేశపడకుండా సాయిబాబా ఆనంద పారవశ్యంలో తేలియాడేసరికి గురువు పొంగిపోయి ఆయనను శిష్యుడిగా స్వీకరించారట. ఈ గురువు వద్ద 12 సంవత్సరాలపాటు భక్తివిశ్వాసాలతో, ఏకాగ్ర చిత్తంతో, సర్వసమర్పణ భావనతో శుశ్రూష చేసినట్లు సాయిబాబా స్వయంగా చెప్పారు. తన శక్తినంతటినీ దృష్టిలో లగ్నం చేసి, ఆ దృష్టిని గురుదేవులపై నిలిపేవాడనని, తన ధ్యాన మూర్తి తన గురువేనని సాయి తెలియజేశారు. నేను గురుపాదుకలపై పూర్తి విశ్వాసం వుంచి, భక్తి శ్రద్ధలతో గురువును సేవించి, వారంతటివాడనయ్యాను. మీరు కూడా నన్ను (సద్గురువును) ఆవిధంగా సేవిస్తే, మీరూ నా అంతటివారవుతారు అని సాయినాధులు తన శిష్యులకు ఉద్బోధించేవారు. ఈ సందర్భంలో తన గురువు తనకు వాత్సల్యపూరితంగా ఇచ్చిన హామీని సాయిబాబా ఉదహరించేవారు. 'నీవు ఎక్కడ వున్నా సరే, నేను ఎప్పుడూ నీ వెంటనే వుంటాను. నా దృష్టిచేతనే నిన్ను కాపాడతాను' గురుదక్షిణగా రోషన్‌షా రెండుపైసలు ఇమ్మన్నారట. ఒక పైసా నిష్ఠ, రెండోపైసా సబూరి (అంటే సంతోషంతో కూడిని ఓరిమి) భక్తి విశ్వాసాలతో ఈ దక్షిణ సమర్పించుకుంటే గురుకృప లభించి తీరుతుంది.

నంబూరు సద్గురువులు భక్తులకు నూరిపోసేది ఈ పరమ తత్వాన్నే. హిందూ సంప్రదాయంలో గురువు ప్రత్యక్ష దైవం, సాకార పరబ్రహ్మ. **గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**

త్యాగరాజస్వామి తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రుడెవరో తేల్చుకోలేక 'శివుడవో, మాధవుడవో, కమల భవుడవో ఎవరని నిర్ణయించేదిరా!' అని ఆవేదనతో ప్రభువును ప్రశ్నించారు. అయితే గురుదేవుల విషయంలో ఇటువంటి మీమాంస అనవసరం. ఎందుకంటే గురువులో త్రిమూర్తులు లీనమై వున్నారు. అంతేకాదు, ఆయనే పరబ్రహ్మ, పరబ్రహ్మమే ఆయన. గురువుకు మన శాస్త్రాలలో చెప్పిన ఇతర విశేషణాలు కూడా గమనించదగినవి. గురువు శుద్ధ జ్ఞానైక మూర్తి, నిర్మలుడు, ప్రశాంతుడు, సర్వవిద్యలకు నిధి, మూర్తిభేద విభాగి, వ్యోమవత్ వ్యాప్త దేహుడు, సచ్చిదానంద రూపుడు, మహనీయ గుణాత్ముడు, సాధురూపుడు. ఒక్కమాటలో చెప్పాలంటే గీతాచార్యుని వంటి సద్గురువు సర్వసమర్థుడు, సర్వశక్తి సంపన్నుడు, మీదుమిక్కిలి మంగళ స్వరూపుడు.

ఏ విషయంలోనైనా, మార్గం చూపేవాడు కావాలి. ముఖ్యంగా ఆధ్యాత్మిక పురోగమనానికి గురువు చేయూత మరీ మరీ అవసరం. ముముక్షువులకు తరించే మార్గం చూపి, చేయిపట్టి ముందుకు తీసుకువెళ్ళే మహనీయుడే సిసలైన గురువు! వారినే సత్యగురువులు, సమర్థ సద్గురువులు అంటారు. నా వ్యాపారం ఇదే అంటారు నంబూరు సద్గురువు శ్రీకాళీవర ప్రసాద బాబు. నిజంగా ఆయన అంతటి మహిమాన్వితులేనా? ఇది ఎవరికివారు తమతమ అనుభవాలు, అనుభూతులను బట్టి నిర్ణయించుకోవలసిన విషయం. సద్గురువుగా మీరు ఆయనను నమ్మడం, నమ్మకపోవడం అనేది ఏ దృక్పథంతో మీరు ఆయన వద్దకు వెళ్ళారనే విషయంపై ఆధారపడి వుంటుంది. మహాత్ముల వద్దకు కోరికలను మూటకట్టుకుని వెళ్ళకూడదు. వారుకోరే మూట భక్తివిశ్వాసాలు, సర్వసమర్పణ భావం, నిర్మలమైన అంతఃకరణం. 'అహంకార మమకారాలను విడనాడి, నాపై విశ్వాసాన్ని పెంపొందించుకున్న పక్షంలో అట్టివారి యోగక్షేమాలు నేను

చూసుకుంటాను' అనే ధోరణిలో నంబూరు బాబుగారు అభయమివ్వటం ఈ రచయితకు తెలుసు. ఈ విధమైన ఆత్మారణ గురుకృపకు అర్హత సంపాదించి పెడుతుంది. గురుకృప లభిస్తే, అన్నీ లభించినట్లే! మన సర్వబాధ్యతలు గురుదేవులకు అప్పగించి, అచంచల విశ్వాసంతో వారి ఉపదేశాలను తు.చ. తప్పకుండా అనుసరించేదానికి మించిన సన్యాసం మరిలేదు.

నా అనుభవాన్ని రెండు మూడు వాక్యాలలో కుదించి చెప్పి, ఈ వ్యాసాన్ని ముగిస్తాను. సుమారు ఏడాది క్రితం ప్రథమంగా నాకు నంబూరు సద్గురువుల దర్శనభాగ్యం, ఆశీర్వాదం లభించాయి. అది నా జీవితంలో ఒక మహత్తర పరిణామం. ఎక్కడ చూసినా ఇప్పుడు వారి దివ్యమంగళ విగ్రహం కనిపిస్తున్నది. అంతకంతకు నన్ను గురుదేవులు ఆప్యాయంగా తమ అమృతహస్తాలతో తమ చెంతకు చేర్చుకుంటున్న అనుభూతి కూడా కలుగుతున్నది. ధన్యోస్మి! తుఫానులు చెలరేగనీ, భూకంపాలు విరచుకుపడనీ, అమెరికావాడు న్యూట్రాన్ బాంబులు కురిపించనీ భయం నాస్తి.



# మహిమలు చూపని మహాత్ములు

- కౌశిక

మానవుల మధ్యనే ఉద్భవించి మానవాతీత ప్రభువులైన మహామహితాత్ములనెందరినో కన్న పుణ్యభూమి భారతదేశం. ఎన్నో యుగాల మహోజ్వల చరిత్ర వున్నది ఈ పవిత్ర భూమికి. అన్ని యుగాలలోనూ, ఈనాటికీ, ఏనాడు చూసినా ఎందరో మహాత్ములు కనిపిస్తారు, కనగలిగిన కనులు, ఆవేదనతో కూడిన అన్వేషణ వుండాలి గాని. సర్వ సామాన్యంగా మహాత్ములను గుర్తించగలిగిన జిజ్ఞాసువులైన మానవుల సంఖ్య ఎప్పుడూ తక్కువగానే వుంటుంది. అందుచేతనే ఏ మహాత్ముని జీవితకాలం గమనించినా, వారిని గుర్తించి, అనుసరించి తరించినవారి సంఖ్య చాలా స్వల్పంగా వుంటుంది.

ఏమిటి దానికి కారణం? మహిమలు చూపేవారిని, తమ తమ అభీష్టాలను నెరవేర్చేవారిని మహాత్ములుగా భావించడం మానవ సహజం. ఎక్కడైనా మహాత్ములున్నారని తెలిస్తే 'అలాగాండీ! వారి విశేషమేమిటండీ? వారేమైనా మహిమలు చూపుతారా? అద్భుతాలు చేస్తారా? కోరికలు అడుగవచ్చునా?' అని వెంటనే ప్రశ్నిస్తారు. అవునని జవాబు వస్తే చాలు, ఇక సమస్యల మూట చంకన బెట్టుకుని, కోరికలు కొంగున కట్టుకుని తీర్థ ప్రజల లాగా ఆ మహాత్ముల సన్నిధికి తయారవుతారు. ఆయన మహిమలేవీ చూపరని, ఏదో తత్వం బోధిస్తారని అంటే పెదవి విరిచి, నోరు చప్పరించి ఒక 'మర్యాద చిరునవ్వు' విసిరేసి వెళ్ళిపోతారు. లేదా మహా అయితే, ఒక 'మొక్కుబడి దర్శనం' చేసి వస్తారు. అయితే వారి వారి అదృష్టం కొద్దీ అలా మొక్కుబడికోసం వెళ్ళినా, ఆ మహాత్ముల పవిత్ర సన్నిధిలో ప్రభావితులై, మనఃపరివర్తన కలిగి, వారు చూపే వెలుగు బాటలో పయనించి, తరించే భాగ్యశాలురు కొందరు వుంటారు.

మహాత్ములను దర్శించబోయే మానవుల ఆలోచనలు ఇలా వుండగా, ఇంక మహాత్ముల ఆలోచనలు ఎలా వుంటాయో వారి నోటివెంటనే విందాం. ఈ సంకల్పంతోనే నేను శ్రీహనుమత్కాళీ వర ప్రసాదబాబుగారి దర్శనార్థమై శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమానికి వెళ్ళాను.

అది అందమైన మామిడితోట. ఆశ్రమ ప్రాంగణంలో ప్రవేశించేసరికి అరుణకిరణాలు విరజిమ్ముతూ బాల భానుడు

మావిగుబుళ్ళలో నుండి తొంగిచూస్తూ, అప్పుడే ఉదయిస్తూ దర్శనమిచ్చాడు. అది శుభోదయం. పక్షుల కిలకిల రావాలు, గిలిగింతలు పెట్టే చల్లని పిల్ల వాయువులు ఎంతో మనోల్లాసం కలిగిస్తున్నాయి. మరి నాలుగు అడుగులు ముందుకు వేసేసరికి, ప్రాతఃకాల హారతి కాబోలు, లోపలి నుండి ఘంటానాదము మధుర గానము సుశ్రావ్యంగా వినిపించాయి. బయటి ఆవరణ దాటి కాంతిద్వారం గుండా రెండవ ఆవరణలోకి ప్రవేశించేసరికి, భక్తుల కుటీరాలు, రామకృష్ణ ప్రార్థనా మందిరం కనిపించాయి. తీర్థ ప్రసాదాలు స్వీకరించి వస్తున్న భక్తులలో పురుషులు, స్త్రీలు, బాలబాలికలు, వృద్ధులు ఎందరో కనిపించారు. వీరంతా మధ్యాహ్న సమయంలో జరిగే పురాణ శ్రవణానికి హాజరవుతారని, బాలబాలికలకు, ఉత్సాహంగల స్త్రీ పురుషులకు సంస్కృత శిక్షణ, హిందీ శిక్షణ, పురుష సూక్త, శ్రీసూక్త, నమకచమకాలు, ఉపనిషత్తులు, భగవత్ స్తోత్రముల పఠనములలో శిక్షణ ఇస్తారని, సాయంకాల ప్రార్థనానంతరము స్వామి బోధామృతం అందరికీ లభ్యమవుతుందని చెప్పారు. ఇది ఒక అపూర్వ రాజయోగ ప్రయోగశాల వలె వున్నదని అనుకున్నాను.

అంతలో ఎవరో స్వామి వస్తున్నారన్నారు. అటువైపు చూశాను. స్ఫురద్రూపంతో చామనచాయలో వున్న ఒక వ్యక్తి తెల్లని పంచె, ఒక కొంగు పంచెగా చుట్టుకుని, రెండవ కొంగు పైన కప్పుకుని వస్తూ కనిపించారు. ముగ్గురు నలుగురు వ్యక్తులు వారిని అనుసరించి వస్తున్నారు. స్వాములవారెవరని ఒక భక్తుని అడుగగా, ఆయనే అని చూపించాడు. అప్పటివరకూ స్వామి కాషాయ వస్త్రాలతో, గడ్డాలు మీసాలతో, ముండిత శిరస్సుతోగానీ వుంటారని అనుకున్నాను. కాని, శుభ్రంగా దువ్వుకున్న క్రాఫు, నున్నగా గీయబడిన గడ్డము, చేతికి గొలుసుతో రిస్టువాచి, ఒక చేతిలో విలాస దండము పట్టుకుని, తెల్లపంచె కట్టుకుని, మెడలో సన్నని ముత్యాలహారం, అంతకంటె సన్నని పగడాలహారం ధరించి కనిపించిన ఈ స్వామిని చూసి చాలా ఆశ్చర్యపోయాను. అంతలో వేషంలో ఏముంది? అనే భావం మనస్సులో తళుక్కున మెరిసింది. ఒక చీకటితెర విచ్చినట్లయింది. సంతోషంతో అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించాను. ఆయన ఇంకా

వినయంగా వంగి రెండు చేతులతో నాకు నమస్కరించారు. ఆశ్చర్యంతో తలమునకలయ్యాను. నమస్కారం చేస్తే ఏ స్వాములవారైనా చేయి ఎత్తి ఆశీర్వదిస్తారు. ఈయన వంగి రెండు చేతులతో నమస్కరిస్తున్నారే!

'స్వామీ!! తమ దర్శనం లభించినందుకు ఎంతో సంతోషంగా వుంది' అన్నాను. 'చిత్తం! నాకు కూడా తమ దర్శన భాగ్యం ఎంతో సంతోషాన్ని కలిగించింది' అన్నారు. ఆయనకు నా దర్శనం ఒక భాగ్యమా! అది ఆయనకు ఎంతో సంతోషమా! 'చాలా రోజుల నుంచి ప్రయత్నిస్తున్నాను స్వామీ! ఈ అవకాశం గురించి ఈనాటికి అది నెరవేరింది' అన్నాను. 'అవును బాబూ! ఈనాడు ఈ సమయంలో ఇక్కడ ఈ విధంగా మన సమావేశం జరగాలని ఆ జగన్నాథుని ఉద్దేశ్యము. ప్రతి సంఘటనా, అది ఎంత చిన్నదైనా భగవానునిచేత నిర్ణయింపబడి వుంటుంది బాబూ!' అన్నారు. 'స్వామీ! తమతో ఏకాంతంగా సంభాషించాలని, కొన్ని విషయాలు తమ నుండి తెలుసుకోవాలని వుంది' అన్నాను. 'తప్పకుండా అలాగే బాబూ! తత్వ జిజ్ఞాసతో ఎవరైనా వస్తే ఎంతో సంతోషంగా వుంటుంది. ఎన్ని గంటలైనా వారితో మాట్లాడతాను. ఆహారం, నిద్ర కూడా జ్ఞాపకం రావు. ఎలాగైనా భగవానుని యందు భక్తి విశ్వాస బీజములు వారి హృదయాలలో నాటుకుని, మొలకెత్తితే అంతే చాలు! అదేకదా నా వ్యాపారం! వ్యాపారస్థుడికి బేరం దొరకాలేగాని, వదులుకుంటాడా? నా ప్రాతఃకాల వ్యాహ్యాళి ముగించుకుని 9గం.ల కల్లా తమ దర్శనం చేసుకుంటాను. అప్పుడు మనం ఎంతసేపు అయినా మాట్లాడుకోవచ్చును. మీ కోరికా నేరవేరుతుంది, నా బేరమూ సాగుతుంది' అన్నారు. వారి నిరాడంబరత్వానికి, సహజ సౌజన్యానికి మనస్సులోనే జోహారులు అర్పించుకున్నాను.

9గంటలకు స్వామి నివాసమైన బాబూ విజ్ఞానమందిరంలో వారి పూజా గృహంలో స్వామి భక్తులకు దర్శనమివ్వటానికి వచ్చారు. ఆ పూజా మందిరంలో శ్రీకాళీమాత, శ్రీ వీరహనుమాన్‌ల దివ్య మూర్తులు ప్రతిష్ఠింపబడి వున్నాయి. జాతి, కుల, మత భేదం లేకుండా హరిజనులు, క్రైస్తవులు, మహమ్మదీయులు కూడా ఆ మందిరంలోకి ప్రవేశిస్తున్నారు. పట్టు వస్త్రాలు ధరించి వున్న స్వామి పాదాలను స్పృశిస్తున్నారు కొందరు;

ముద్దు పెట్టుకుంటున్నారు కొందరు; కన్నులకు అద్దుకుంటున్నారు కొందరు. కొందరు స్వామిని పుష్పాలతో అభిషేకించారు. కొందరు వారిని పుష్పమాలలతో అలంకరించుకుని ఆనందిస్తున్నారు. వారందరినీ చిరునవ్వుతో పలుకరిస్తూ ప్రేమామృతం వర్షిస్తూ, ఆప్యాయంగా చేతులతో నిమురుతున్నారు స్వామి. అందరికీ ఆయనే తీర్థం ఇస్తున్నారు. ఎవరేది స్వామికి అర్పిస్తే, అదంతా తిరిగి ప్రసాదంగా వారికి తామే అందిస్తున్నారు. ఇదంతా ఎంతో వినూతనంగానూ, అద్భుతంగానూ కనిపించింది నాకు. నా ఆశ్చర్యం అవధులు దాటిపోతోంది. పట్టు వస్త్రాలు ధరించి, పూజా పీఠం పైన కూర్చున్న స్వామి అన్ని కులాల వారినీ, అన్ని మతాలవారినీ తమను తాకనిస్తున్నారే! పూజాపీఠం మైల పడిపోదా? స్వామి మడికి భంగం కలుగదా? వారు స్వయంగా తీర్థమిస్తున్నారే! స్వాములెవరూ హరిజనులకు, ఇతర మతాలవారికి తీర్థం ఇవ్వరు కదా! పూజా గృహంలోనికే రానివ్వరే! తమకు సమర్పించిన దానిలో కొంతైనా తీసుకోకుండా అంతా ఎవరైనా తిరిగి ఇచ్చివేస్తారా? ఇలా సందేహపరంపరలు నన్ను ముంచెత్తుతుండగా, స్వామి నా వంక చూసి, చిరునవ్వు చిందిస్తూనే ఆ కార్యక్రమం పూర్తి చేశారు.

అందరూ వెళ్ళిపోయాక, మేమిద్దరమే మిగిలాం. ఒక చాప తెప్పించి, ఆ పూజ మందిరంలోనే వేయించారు. నన్ను దానిపై కూర్చోమని, తామూ ఆ చాప మీదనే కూర్చున్నారు. నేను చాప దిగబోయాను. ఆయన పట్టుకుని చాపపైనే నన్ను కూర్చోబెట్టారు. 'ఇక మనం స్వేచ్ఛగా, హాయిగా ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చు. చెప్పండి బాబూ!' అన్నారు. 'నాకు కొన్ని సందేహాలు వున్నాయి. అవి అజ్ఞానం వలన కలిగినవే కావచ్చు. కానీ, మీరు చూపిన ప్రేమను పురస్కరించుకుని, అవి మీ ముందు వుంచడానికి సాహసిస్తున్నాను నేను' అన్నాను. 'చాలా సంతోషం బాబూ! తప్పకుండా అడగండి. సంశయ నివృత్తి కావడం చాలా అవసరం. శంక తొలగనిదే శంకర సాక్షాత్కారం కాదు. సంశయం మనస్సులో వున్నంత కాలం మానవుడు ఏ పనినీ చిత్తశుద్ధితో చేయలేడు. చేసినా ఫలించదు. వైద్యునిపై విశ్వాసం కుదిరిన రోగికి మట్టి నలిపి వుండ చేసి ఇచ్చినా, మరణ శయ్యమీద నుండి లేచి కూర్చుంటాడు. అనుమానం వున్న వాడికి అమృతం ఇచ్చినా బ్రతకడు. అందుకే **సంశయాత్మా వినశ్యతి** అన్నారు

గీతాచార్యులు. అలాగని మనస్సులోకి వచ్చిన సంశయాన్ని అణచివేసుకుని మూసిపెట్టరాదు. అలా వుండనిస్తే అది మానవునిలోని విశ్వాసాన్ని, అతని గొప్ప శక్తిని పీల్చివేసి, అతన్ని నిర్వీర్యుణ్ణి చేసి పతనం చేస్తుంది. ఒక పెద్ద ఆనకట్టలో చిన్న సూదిమొనంత రంధ్రం పడినా దాన్ని మరమ్మత్తు చేయకపోతే, అది ఆ ఆనకట్టనే కూల్చివేసి, నిలువచేయబడిన నీరంతటినీ వ్యవసాయానికి పనికిరాకుండా వృథా చేసి, ఎంతో నష్టాన్ని, ప్రమాదాన్ని కలిగిస్తుంది' అన్నారు.

'తమ పూజా మందిరంలో వున్న మూర్తులను బట్టి తమకు శ్రీకాళీమాత, శ్రీవీరహనుమాన్‌లు ఇష్ట దైవాలని, అందుకే తమకు శ్రీహనుమత్కాళీ వర ప్రసాదబాబు అనే నామధేయం వచ్చిందని అనుకుంటున్నాను. నిజమేనా?' అని అడిగాను. 'నిజమే బాబూ!' ప్రణవ స్వరూపిణి, అనంతశక్తి, నారాయణ స్వరూపిణి, జగజ్జననీ అయిన శ్రీ కాళీమాత నా ఆరాధ్యదైవమే. తేజస్సుకు, సౌర్య వీర్యములకు, భక్తి జ్ఞానములకు, ఆత్మజ్ఞాన సంపదకు నిలయమైన వీరహనుమాన్ నా అభిమానదైవమే. నా మొదటి ఇష్ట దైవము శ్రీరామచంద్ర ప్రభువు. బాల్యంలోనే ఆ తారక పరబ్రహ్మమునకు నా మనస్సు అంకితమైనది. ఆ స్వామి ఎంతో అనుగ్రహంతో తమ దివ్య మంగళ మూర్తి దర్శనం కూడా ప్రసాదించారు. ఆ స్వామి హృదయ నివాసి కావడం వలన ఘోరమైన అడవులలో వున్నా, ప్రేతభూములలో సంచరించినా, ఎంతో ధైర్యంగా, నిర్భయంగా వుండేది. నేను ఒంటరిగా వున్నప్పుడల్లా, శ్రీ వీర హనుమాన్ నాకు తోడు నీడగా వెన్నంటి వున్నట్లు నాకు తెలిసేది. అది కేవలం భావన మాత్రమే కాదు. స్వామి సాక్షాత్ సాకార రూపులై నాకు దర్శనం ఇచ్చేవారు. ఆ తరువాత త్రిమూర్త్యాత్మక స్వరూపిణి అయిన జగన్మాత నాకు ఆరాధ్య దైవమైనది. ఇక జగన్మాత శ్రీకాళికి కృష్ణ అనే పేరు కూడా వుంది. ఆ కారణం చేతనే కాక, సంపూర్ణ అవతారమై, తన గీతా సందేశంతో మానవ హృదయాలను అమృతమయంగా మార్చివేసిన శ్రీకృష్ణుడు నాకు ప్రియతమ దైవం. ఇలా ఏ పేరుతో పిలిచినా, ఏ రూపంతో స్మరించినా, అంతా అనంతశక్తి స్వరూపమే. ఆ రూప భావన అంతా నాలోనిదే కనుక అంతా నా స్వరూపమే. అంటే ఆత్మ స్వరూపమే అవుతుంది. అలా తెలుసుకున్న వానికి అంతా అనంతము, అఖండము, అభేదము అయిన

ఆత్మ వస్తువే తప్ప రెండవది లేని అద్వైత సిద్ధి కలుగుతుంది' అన్నారు.

2. 'తమరు స్వాములవారని, కాషాయంబరాలు, రుద్రాక్షలు ధరిస్తారని అనుకున్నాను. కానీ, ఇప్పటి తమ దుస్తులను బట్టి, వేషధారణను బట్టి, తలకట్టును బట్టి తాము సన్యాసాశ్రమము స్వీకరించలేదని అనుకోవలసి వస్తోంది నిజమేనా?' అన్నాను.

'బ్రహ్మచర్యాశ్రమము, గృహస్థాశ్రమము, వానప్రస్థాశ్రమము, సన్యాసాశ్రమము అని పిలువబడేవి ధర్మాలు గానీ, స్వీకరించడానికి, వదిలిపెట్టడానికి అవి వస్తువులు కావు. ఆ ధర్మాలను అనుసరించవలసినది మనస్సు. కాషాయాంబరాలు ధరించి, ముండిత శిరస్కుడై, రుద్రాక్షమాలలు, తులసిమాలలు ధరించినా, ఆ మానవుని మనస్సు విషయవాంఛలను విడనాడకపోతే, అతను ఎన్నటికీ సన్యాసి కాజాలడు. ఇక దారాపుత్రాదులతో సంసారం చేస్తూ వున్నా, ఎవని మనస్సు విషయాసక్తితో వుండక, నిరంతరం భగవచ్చింతనయందే వుండి, భగవత్పాదముల యందే రమిస్తూ వుంటుందో, అతడు పైకి గృహస్థుడే అయినా, యదార్థమైన సన్యాసి. అట్టి సన్యాసి కాషాయాంబరములు ధరించనందున ఏమి కొరత కలిగింది? మొదటి వ్యక్తి వేషము అతనికి ఎంతవరకు సన్యాసిత్వాన్ని ఆపాదించగలిగినది? సన్యసించవలసినది మనస్సు. వేషభాషలు కాదు. అలాగని కాషాయాంబరాలను, రుద్రాక్షమాలలను ఇతర సన్యాస చిహ్నాలను నేను దూషిస్తున్నానని, కించపరుస్తున్నానని ఎన్నడూ అనుకోవద్దు. వాటి ప్రాముఖ్యత తప్పకుండా వుంది. కాషాయాంబరాలు వైరాగ్యాన్ని గుర్తు చేయాలి. రుద్రాక్షమాల శివ స్మరణ కలిగించాలి. ఆ భావాలను, స్ఫూర్తిని ఆ వేషధారణ వలన పొందగలిగితే ఉపయోగ పడినట్లు. లేనిచో ఆ వేషం బూటకము, ఆత్మవంచన' అన్నారు.

3. 'స్వామీ! మహాత్ముల వద్ద ఎన్నో మహిమలు వుంటాయంటారు. ఈనాడు మహిమలు ప్రదర్శించే వారిని గురించి వింటున్నాము. వారందరూ ఆత్మానుభూతిని పొందిన మహాత్ములేనని అనుకోవచ్చునా? మానవుని దృష్టిని ఆధ్యాత్మిక మార్గానికి మళ్ళించడానికి మహిమలు ప్రదర్శించడం అవసరమా? తమరు కూడా మహిమలు ప్రదర్శిస్తారా? ఇలా సూటిగా అడిగినందుకు క్షమించండి'

'తప్పులేదు బాబూ! అలా సూటిగా హృదయం విప్పి అడిగేవారంటే నాకెంతో ఇష్టం. సత్యమార్గాన్ని గుర్తించడానికి అది ఎంతో వుపయోగపడుతుంది. మహాత్ములు మహామహిమాన్వితులు అనే మాట సత్యమే. అందుకు సందేహం లేదు. కానీ, వారెన్నడూ మహిమలు చూపరు. చూపవలసిన అవసరమూ లేదు. వారి దృష్టి మాత్రం చేతనే సర్వారిష్టాలు తొలగిపోతాయి. సకల శుభాలు సమకూరుతాయి. ఇక రెండవది; మహిమలు ప్రదర్శించేవారి విషయమై తమరన్నారు. నిజానికి అవి మహిమలు కావు. ఇంద్రజాలమో, హస్తలాఘవమో, లేక క్షుద్రదేవతలను ఆరాధించి సంపాదించిన క్షుద్రశక్తులో మాత్రమే! వాటివల్ల ఆ ప్రదర్శకులు గానీ, ఇతర మానవులు గానీ ఏమీ ప్రయోజనం పొందలేరు. అవి మానవుల సమస్యలను తీర్చలేవు. బాధలు నివారించలేవు. సుఖశాంతులను ప్రసాదించలేవు. మహిమలు నిజంగా మానవులకు సుఖశాంతులు కలిగించే యెడల వాటిని ప్రదర్శించేవారు మాటిమాటికి అవి ప్రదర్శించవలసిన అవసరం ఏమిటి? మానవులు అవి కోరవలసిన అవసరం ఏమిటి?

ఈ క్షుద్రవిద్యల వలన మానవుడు ఎన్నడూ తరించలేడు. తానే తరించలేనివాడు ఇతరులను ఏమి తరింపజేస్తాడు? అతడు ఇతరులను వంచించడమే కాక, తన్ను తాను వంచించుకుంటున్నాడు. దాని పర్యవసానం ఏమిటో మీరే ఊహించుకోండి.

ఇక అణిమాది అష్టసిద్ధుల విషయం. అవి వున్నమాట నిజమే, వానిలో కొన్నిగానీ, అన్నీగానీ ఆధ్యాత్మిక మార్గంలో చురుకుగా ముందుకు సాగిపోతున్న సాధకునికి అప్రయత్నంగానే లభిస్తాయి. అవి కూడా మానవుని తరింపజేయలేవు. మానవుని తరింపజేయ గలిగినది కేవలం ఆత్మజ్ఞానం మాత్రమే. **'జ్ఞానాదేవతు కైవల్యం'** అని శాస్త్ర వాక్యం కూడా చెబుతున్నది. జ్ఞానులు సిద్ధులకెన్నడూ విలువనివ్వరు, ప్రాముఖ్యత చూపరు. అయితే ఈ సిద్ధుల వలన మానవుడు ఏవో కొన్ని అద్భుతాలు చేయగలగవచ్చును. కానీ, వివేకవంతుడైన ముముక్షువు తనకు లభించిన సిద్ధులను స్వప్రయోజనానికి గానీ, జనాకర్షణకుగానీ ఎన్నడూ వినియోగించడు. అత్యవసర పరిస్థితులలో ఏ జీవినైనా, మహాపద నుండి రక్షించవలసివచ్చినప్పుడు మాత్రం ఉపయోగించవచ్చు

కానీ, సాధారణంగా అవి అతనిలో గుప్తంగానే వుండిపోతాయి. కష్టపడి సాధకుడు చేసే సాధన వలన అతనికి కొంత శక్తి సమకూరుతుంది. అప్పుడు ఆ సిద్ధులు అతని వద్దకు వచ్చి చేరుతాయి. కొద్దిగా డబ్బు సంపాదించిన వాడు దానిని ఎంతో జాగ్రత్తగా దాచుకుని, వృద్ధి చేసుకోవాలి గానీ, ఖర్చు చేయరాదు. కానీ, ఆ సాధకుడిని ఆ సిద్ధులు ఎంతో ఆకర్షిస్తాయి. ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా, మాయలో పడవేస్తాయి. కీర్తి వ్యామోహమో, సుఖ సంపదల వ్యామోహమో తెచ్చిపెట్టి అతనిని దోవ తప్పించి, అతడు కూడబెట్టిన శక్తిని పీల్చి పిప్పిచేసి అతనిని అధోగతిపాలు చేసి మరీ పోతాయి. సిద్ధులూ పోయి, శక్తీ నశించిన ఆ సాధకుడు రెంటికీ చెడ్డ రేవడయి, భ్రష్టుడైపోతాడు.

కనుక సాధకుడు ఆ సిద్ధులతో ఏ ప్రమేయమూ పెట్టుకోకుండా బహుజాగరూకుడై అప్రమత్తతోనూ, తీవ్ర నిశ్చయంతోనూ శ్రద్ధాళువై తన సాధన మార్గంలో ముందుకు పయనిస్తే తుదకు అతడు అనంత శక్తినే పొందగలుగుతాడు. **శ్రద్ధావాన్ లభతే జ్ఞానం** అనే గీతావాక్యాన్ని అనుసరించి, ఆత్మజ్ఞానమనే అతులిత ఐశ్వర్యం - ఐశ్వర్యమేమిటి సకల లోకాధిపత్యం, సర్వేశ్వరత్వమే అతనికి లభిస్తుంది. అతడే మహాత్ముడు, మహా మహిమాన్వితుడు అవుతాడు. అనంత శక్తి స్వరూపుడైన ఆ మహాప్రభువు కొలువులో అణిమాది సిద్ధులే కాదు, సర్వ సిద్ధులూ శాశ్వతంగా సేవకులై, ఆయన ఆజ్ఞకు లోబడి వుంటాయి. ఇక అట్టి మహాత్ముని ఆశ్రయించిన మానవునికి కొఱత ఏముంటుంది? ఆ మహాత్ముల సన్నిధియే మహిమాన్వితము! ఆయన దృష్టి మహామహిమాన్వితం! ఆయన దివ్య స్పర్శ మహిమ అపారం! ఇక ఆయన కరుణా వృష్టి మహిమను ఎవరు వర్ణించగలరు? ఒక్క మాటలో చెప్పాలంటే, ఆ మహాత్ముని మహత్తర వ్యక్తిత్వములోని అణువణువూ, వారి జీవితంలోని క్షణక్షణమూ మహిమాన్వితమే! అట్టి మహాత్ములు మహిమలు చూపవలసిన పని ఏమున్నది? వారి సన్నిధిలోనే, వారి దృష్టి సోకినంత మాత్రంచేతనే, వారి చరణ స్పర్శ లభించినంతనే సర్వ క్లేశములు, సమస్యలు తొలగిపోతాయి. దుష్ట గుణాలు, సంకల్పాలు తొలగిపోతాయి. అంతఃకరణ పరిశుద్ధమవుతుంది. ఇంద్రియ తాపాలు శమించిపోతాయి. శాశ్వత సుఖశాంతులు లభిస్తాయి.

మహర్షుల ఆశ్రమాలలో క్రూర మృగాలు కూడా తమ హింసా ప్రవృత్తిని కోల్పోయి సాధు జంతువులతో స్నేహంగా సంచరించేవి. అందులకై మహర్షులేమీ మహిమలు చూపలేదు. మీరా, తులసీదాస్ వంటి మహాత్ముల దర్శనం తురుష్కుడైన అక్బర్ చక్రవర్తిలో కూడా తాత్విక ప్రవృత్తిని కలిగించింది. తానీషా రామదాసు ప్రభావం చేత రామభక్తుడు కాలేదా? రామతీర్థకెదురైన పెద్దపులి ఆయనకు ప్రదక్షిణం చేసి, పిల్లివలె వెళ్ళి పోలేదా? సదాశివ బ్రహ్మేంద్రుల దర్శనం వలన నవాబు భక్తుడైపోలేదా? చీకటిని పోగొట్టడానికి సూర్యుడు ఏ మహిమ చూపాలి? ఎదురుగా వస్తే చాలు. మన క్షేత్రం సస్యశ్యామలం కావడానికి నది ఏ మహిమ చూపాలి? ఆ ప్రవాహం మన క్షేత్రానికి సోకితే చాలు. మహాత్ముల శక్తి సూర్యకాంతి వంటిది. అయితే క్షుద్రవిద్యలు, అష్టసిద్ధులు కలవారి శక్తి కొవ్వొత్తి దీపం, లేదా ఒక బ్యాటరీ లైట్ వంటిది. అది ఎంత చీకటిని పోగొట్టగలదు? ఎంతసేపు పోగొట్టగలదు? మహాత్ముల శక్తి మహానదివంటిది అయితే, క్షుద్రవిద్యలు, అష్టసిద్ధులు గలవారి శక్తి ఒక చెంచాడు లేదా బిందెడు నీటి వంటిది. అది ఎంత పొలాన్ని తడుపగలదు? దానిని ఎంతవరకూ సస్యశ్యామలం చేయగలదు? ఎంతమంది దాహాన్ని తీర్చగలదు? ఎంత చీకటిని ఎంతసేపు పోగొట్టినా ఎంత వెలుగును వెదజల్లినా సూర్యకాంతి తరిగేదికాదు, నశించేది కాదు. అలాగే ఎన్ని పొలాలను ఎన్నాళ్ళు సస్యశ్యామలం చేసినా, ఎంతమంది దాహాన్ని తీర్చినా మహానది క్షీణించేది కాదు, ఎండిపోయేదీ కాదు. మరి క్షుద్రవిద్యలు, అణిమాది సిద్ధులో? అవి అల్ప ప్రయోజనాన్ని కూడా సాధించలేనివి, స్వల్ప కాలంలోనే క్షీణించిపోయేవి.

మహిమలు చూపేవారందరూ ఆత్మానుభూతిని పొందిన మహాత్ములేనా అని తాము అడిగిన ప్రశ్నకు ఇప్పుడు జవాబు లభించిందని అనుకుంటున్నాను. ఇక మానవుని దృష్టిని ఆధ్యాత్మిక మార్గానికి మళ్ళించడానికి మహిమలు ప్రదర్శించడం అవసరమా? అనే తమ తరువాత ప్రశ్నకు వద్దాం.

మహాత్ములు మహామహిమాన్వితులే కాక, అపార ప్రేమ స్వరూపులు, అవ్యాజ కరుణామూర్తులు. ఆర్తులై ఆశ్రయించినవారి భవ రోగమును నివారించి, జనన మరణ విషవలయం నుండి వారిని

తప్పించి, శాశ్వత సుఖశాంతులను ప్రసాదించి, అమృత స్వరూపులుగా మార్చివేయగల సర్వసమర్థులు వారు. అయినా వారెన్నడూ మహిమలు చూపి, ప్రజలను ఆకర్షించడానికి ఒప్పుకోరు. అసలు తాము మహాత్ములుగా ప్రజలచేత గుర్తింప బడటానికే వారిష్టపడరు. నిజమైన మహాత్ముడు తాను భగవానుని దృష్టిలో పడాలని కోరుకుంటాడుకానీ, ప్రజల దృష్టిలో పడాలని ఎన్నడూ కోరుకోడు. కానీ, వారి దివ్య తేజస్సు, వారి వదనారవిందంలో వెలిగే ప్రశాంతత, ప్రసన్నత, వారి అవ్యాజ ప్రేమ, భూతదయా గుణం సహజంగానే సర్వమానవులను ఆకర్షిస్తాయి. అట్టివారికి మహిమలు చూపడం, ప్రకటనలు, అడ్వర్టయిజ్‌మెంట్లు చేయడం అవసరం లేదు. విద్యుత్ దీపాలకు అడ్వర్టయిజ్‌మెంట్ కావాలిగానీ సూర్యునికి ఎందుకు? బుద్ధ భగవానుడు, శంకర భగవత్పాదులవారు, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి, స్వామి వివేకానంద వంటి మహాత్ములు ఏ మహిమలు చూపారని, ఏ ప్రకటనలు చేసుకున్నారని అనేక వేలమంది వారి శిష్యులైనారు? ఏ సిద్ధుల ప్రయోగం వలన, లేదా మహిమల ప్రభావం వలన వారందరూ ఇహంలో సుఖశాంతులను, పరంలో శాశ్వతానంద పదవిని పొందగలిగారు? అది కేవలం మహాత్ములైన గురుదేవుల దివ్య చరణ ధ్యాన ప్రభావమేగానీ, మహిమల ప్రభావము కాదు, సిద్ధుల ప్రయోగము కాదు.

అయినా కొందరు తెలియని వాళ్ళు మహాత్ముల వద్దకు వెళ్ళి ఏదో మహిమ చూపి తమ తాత్కాలిక బాధలు నివారించమని, లేదా ఉద్యోగము, సంతానము, ఐశ్వర్యము వంటి తాత్కాలిక లాభాలను ప్రసాదించమని కోరతారు. అంతేకానీ, జన్మాంతరాల నుండి పట్టి పీడిస్తున్న భవరోగాన్ని నివారణ చేయమని కోరరు. ఒక దరిద్రుడు చక్రవర్తి వద్దకు వెళ్ళి ఒక పూట భోజనం పెట్టించమన్నాడట. చక్రవర్తి తలచుకుంటే, తన దారిద్ర్యాన్ని శాశ్వతంగా నివారించగలడు కదా? అలా చేయమని ప్రార్థించక, ఒక్కపూట ఆకలి తీర్చమని అడగటం ఏమి తెలివి? అలాగే జన్మపరంపర నుండి శాశ్వత ముక్తిని ప్రసాదించగల మహాత్ముని వద్దకు వెళ్ళి కూడా ఒడిదుడుకులతో, కష్ట సుఖాలతో, మహా యాతనలతో కూడుకుని వున్న జనన మరణ విషవలయం నుండి తప్పించి, అమృతత్వాన్ని ప్రసాదించమని కోరక, ఉద్యోగమో, సంతానమో కోరడం

ఏమి వివేకం? ఇలాగే వుంటుంది బాబూ, లోకం తీరు.

అయితే ఒక్కటి మాత్రం యదార్థం. సామాన్య మానవునికి కనిపించని భవరోగం కన్నా, కనిపిస్తూ ఏడిపించే దేహబాధలు, సంసార బాధలు ఎక్కువగా పీడిస్తాయి. అందువలన ఆ బాధల నుండి తక్షణ విముక్తిని అతను కోరడం సహజం. అందువల్ల కరుణామయులైన మహాత్ములు ఆర్తులై తమ వద్దకు వచ్చిన ఆ మానవులను నిరుత్సాహపరచక, వారిని ఓదార్చి, ధైర్యం చెప్పి, జగత్పతియైన భగవానుని కరుణామయ తత్వమును గూర్చి వివరించి, ఆ భగవానుని ఆర్తితో ప్రార్థించమని, మనస్సులో నిలుపుకోమని, మనసారా ధ్యానించమని బోధించి, వారి బాధా నివారణకై ఏదైనా ఒక పూజా విధానమునో, దీక్షనో, ఒక పారాయణమునో విధించి, శ్రద్ధతోనూ, చిత్తశుద్ధితోనూ దాన్ని ఆచరించమని, తప్పక భగవానుని కృప వలన బాధా నివారణ జరుగుతుందని హితవు చెబుతారు. ఆ మానవుడు కష్టంలో వున్నవాడు కనుక తప్పక విశ్వాసంతో దాన్ని ఆచరిస్తాడు. దీక్షా నిర్వహణకై శరీరాన్ని శ్రమింపజేస్తాడు. సోమరితనాన్ని దూరంగా పారద్రోలతాడు. పట్టుదలతో వ్రత సమాప్తి చేస్తాడు. ఫలితం సాధించుకుంటాడు. అతనికి బాధా నివారణ అవుతుంది. భగవంతుని యందు భక్తి విశ్వాస బీజములు అతని హృదయ క్షేత్రములో నాటుకుని, మొలకెత్తి, వృద్ధి పొందుతాయి. సోమరితనం వదలిపోతుంది. స్వయంకృషి అలవాటు అవుతుంది. అంతేకాదు, భగవానుడే ఆ మహాత్ముల రూపంలో తనకు ప్రసన్నుడై, బాధా నివారణ చేశాడనే విశ్వాసం పెరుగుతుంది. ఆ మహాత్మునే దైవ భావంతో చూసుకోగలుగుతాడు. నిజానికి నిజమైన మహాత్మునికి, భగవానునికి ఏమీ భేదం లేదు కదా!

తమరు నా విషయం కూడా ప్రశ్నించారు. బాబూ! నేను ఏమీ తెలియని వాడను. ఓనమాలు కూడా దిద్దుకోని చదువురానివాడను. అక్షరాలు వ్రాయడం చేతకాకపోయినా, అక్షర స్వరూపిణి, సకల విద్యా స్వరూపిణి, సాక్షాత్ వేదస్వరూపిణి అయిన జగన్మాత నన్ను తన బిడ్డగా అనుగ్రహించింది. ఆమె ఒడిలో పరుండి, ఆమె అందించే ప్రేమక్షీరాలను గ్రోలే పసివాడను మాత్రమే. మహాత్ముడననిగానీ, మహిమలు గలవాడననిగానీ, నేను ఎన్నడూ అనుకోను. మహాత్ముల పాదధూళి

నా శిరస్సున ధరించవలెనని సదా వువ్విళ్లూరే దాసానుదాసుడను మాత్రమే. ఆ పవిత్ర పాదధూళి అహంకార మమకారాలను నిర్మూలించగలదు. సకల సంకల్పాలను క్షాళనచేసి, అంతఃకరణమును నిర్మలముగా, పరిశుద్ధముగా చేయగలదు. ఆత్మజ్ఞానమును ప్రసాదించగలదు. ఆత్మజ్ఞాన సంపన్నుడైన మహాత్ముడు సర్వత్రా తన్నుతానే దర్శిస్తూ, సర్వవ్యాపకుడై, సర్వజ్ఞుడై, సర్వశక్తి సంపన్నుడై, సర్వేశ్వరుడై, సర్వసాక్షిగా వుంటాడు. ఆయనకు వేరే మహిమలతో పనేమిటి? ఎవరికి ప్రదర్శిస్తాడు? ఎక్కడ చూసినా తాను తప్ప రెండవ వస్తువు కనబడదే?

నా వలన ఏదైనా ఉపకారం పొందినట్లు ఎవరైనా భావిస్తే, వారికి నేను మనవి చేసుకునే సమాధానం ఏమంటే అది నేను చేసినది కాదని, కరుణామయి అయిన జగన్మాత అనుగ్రహమే అని, నేను ఆమె వద్ద పని చేసే తపాలా బంట్రోతుననీ, ఈ బంట్రోతు ద్వారా తన బిడ్డలకు తన అనుగ్రహ ప్రసాదాన్ని అందించడం ఆ తల్లి లీలా విలాసమని మాత్రమే. అదే నా భావన. అది సత్యం కూడానూ' అన్నారు.

'స్వామీ! నేడెంతో సుదినం! విజ్ఞానదాయకములైన ఎన్నో విషయాలను సహజ సరళంగానూ, మృదు మధురంగానూ అందిస్తూనే, తాము చూపే వినయ వివేకములు, నిరాడంబరత్వము, భూతదయా దృష్టి, తాము మహాత్ములని నిరూపిస్తున్నాయి. సర్వ మానవుల యెడల తమకు గల సమదృష్టి అన్నిటిలోనూ ఆత్మవస్తువునే దర్శించే అనుభవ స్వరూపులైన బ్రహ్మజ్ఞాన సంపన్నులకు మాత్రమే సాధ్యము. బాలురతో, వృద్ధులతో, స్త్రీలతో, పురుషులతో కూడిన ఎన్నో కుటుంబాలను ఇలా తమ సన్నిధిలో నిలుపుకుని, తమ స్వయం పర్యవేక్షణలో వారి ఐహిక, ఆధ్యాత్మిక పురోగమనాలను తీర్చి దిద్దటం ఒక అపూర్వ ప్రయోగంగా నేను భావిస్తున్నాను. ఇంకా ఎన్నో విషయాలను తమ వద్ద తెలుసుకోవాలనే ఆకాంక్ష మిక్కుటంగా వుంది. కానీ, ఇప్పటికే తమ అమూల్య కాలాన్ని చాలా ఎక్కువగా వినియోగించుకున్నాను. మళ్ళీ త్వరలోనే ఇటువంటి సదవకాశాన్ని నాకు కలుగజేయవలసినదిగా ప్రార్థిస్తూ తమ వద్ద శలవు తీసుకుంటాను' అన్నాను నేను.

'మీరు ఎప్పుడు వచ్చినా సదవకాశమే బాబూ! ఈ ఆశ్రమం మీ వంటి జిజ్ఞాసువుల కోసం ఏర్పడినది కానీ, నా ఏకాంతవాసానికి కాదు.

తమ తమ విధ్యుక్త ధర్మాలను నిర్వహించుకుంటూనే, నిజనాధుడైన జగన్నాధుని చేరుకునేందుకు కృషి చేసేవారందరికీ ఇక్కడ సదవకాశం కలుగుతుంది. ఇందరిలోనూ మసలుతూ, ఇందరితోనూ మాట్లాడుతూ, అందరి కష్టసుఖాలలోనూ పాలుపంచుకుంటూనే, నా ఏకాంతానికి భంగం లేకుండా నిలుపుకోవడానికి ఇది నాకు కూడా ఒక సదవకాశమే. తమరన్నట్లు కాలం అమూల్యమైనదే. బుద్బుదప్రాయమైన జీవితకాలంలో ఒక్క క్షణం కూడా వృథా చేయరాదు. ఎంత ధనం ఖర్చయిపోయినా తిరిగి కూడబెట్టుకోవచ్చు కానీ, పోయిన ఒక్క క్షణం కూడా తిరిగి పొందలేము. కానీ, సజ్జనులతో భగవద్విషయాలను గూర్చినటువంటి సంభాషణల వలన విలువైన కాలం యొక్క సరియైన మూల్యాన్ని మనం పొందగలం. ఇటువంటి సదవకాశాలను ఎన్నింటినైనా మీరు వినియోగించుకోవచ్చు. నేను సదా మీవాడను' అన్నారు స్వామి. ఆనాటి సమావేశం అంతటితో ముగిసింది.

ఓం గురురామ్ నమస్తే!

సమర్థ సద్గురు మాస పత్రిక చందా దారులకు విజ్ఞప్తి. ప్రతి నెల సక్రమంగా చందాదారులు అందరికీ మాస పత్రిక పోస్టులో పంపుతున్నాము. ఒకటికి రెండుసార్లు నిర్ధారించు కుంటున్నాం. అయినా కొంత మందికి చేరటం లేదని చెపుతున్నారు. ఈ విషయం పోస్టల్ వారికి, PMG కి కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అందు వలన పత్రిక చేరనివారు కోరినచో ఆ నెల పత్రిక వాట్స్ యాప్ ద్వారా కానీ, ఇ-మెయిల్ ద్వారా పంపుటకు ఏర్పాటు చేశారు. కనుక అవసరం వున్నవారు 8333808310 నెంబరు కు మెసేజ్ పెట్టండి. మీ చందా నెంబరు తెలియ జెయ్యండి. ఇంకా వివరములు కావలసిన వారు పై నెంబర్ కు ఫోను చెయ్యండి. జై గురుదేవ్.

సద్గురు మాసపత్రిక యాజమాన్యం.

# అంతా మన ఎంపికయే!

సేకరణ - వి. సాయికృష్ణ

ఒక రోజు ఆది శంకరాచార్యులు శిష్యులతో కలిసి వెడుతూ వుంటే, ఒక వ్యక్తి ఆవును తాడుతో లాగటం తారసపడింది. శంకరులు తన శిష్యులతో, 'ఆవు ఆ మనిషికి కట్టుబడి ఉందా. లేదంటే, మనిషి ఆవుకు కట్టుబడి ఉన్నాడా?' అని అడిగారు. శిష్యులు ఏమాత్రం సంకోచించకుండా 'గురువర్యా! తప్పకుండా ఆవే మనిషికి కట్టుబడి ఉంది. మనిషి తాడు పట్టుకొని ఉన్నాడు. ఆవు ఎక్కడికి వెళ్ళినా అతనిని అనుసరించాలి. మనిషి యజమాని, ఆవు బానిస' అని చెప్పారు. 'ఇప్పుడు చూడండి' అని శంకరాచార్యులు ఆ తాడును కత్తిరించారు. వెంటనే ఆవు పారిపోయింది. యజమాని దాని వెంట పరుగుపెట్టాడు.

అప్పుడు శంకరులు 'శిష్యులారా! ఆవుకు తన యజమాని పట్ల అస్సలు ఆసక్తి లేదు. నిజానికి ఆవు ఆ మనిషి నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తోంది. మన మనసు విషయంలో కూడా అదే జరుగుతుంది. మనసు దానంతట అదే చెడు ఆలోచనల మీద ఆసక్తి చూపదు. మనమే చెడు ఆలోచనలతో దాన్ని నింపుతున్నాం. వాటికి బదులు మంచి ఆలోచనలకి మనసులో స్థానం ఇవ్వాలి. అప్పుడు చెడు ఆలోచనలు ఆ ఆవులాగే వెళ్ళిపోతాయి. స్వేచ్ఛ, సంతోషం మన ఎంపికే అని బోధించారు శంకరులు.



(గత సంచిక తరువాయి విష్ణ  కథలు -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

రామనవమి ఉత్సవాలు వచ్చాయి. ఆ దంపతులు తొమ్మిది రోజులూ ఉపవాసం చేస్తూ శ్రీరాముడిని సేవించాలని నిశ్చయించుకొన్నారు. ఏడురోజులు గడచిపోయాయి. ఇంకా రామదర్శనం కాలేదు. అష్టమి నాడు వాకిట్లో ఎవరో తనని పిలుస్తున్నారు. అతడు ఆ ఊరిలో పనిచేసే పాలేరు వేస్‌కర్. ఆయన "ఇద్దరు పెద్దమనుషులు చెరువుగట్టున నాకు కనిపించారు. వారు పఠాన్లలాగా ఉన్నారు. వారు మీ అరుగు మీద కూర్చుని వచ్చేపోయే వారిని మీ గురించి అడుగుతున్నారు" అన్నాడు. "వారు ఎవరై ఉంటారా?" అనుకుంటూ తలపాగా చుట్టుకుని బయటకు వచ్చి, "ముందు హనుమంతుడి దర్శనం. ఆ తర్వాతే వారిని కలిసేది" అనుకుంటూ బయటకు వచ్చారు. హనుమంతుడి ముందు మోకరిల్లగానే, ఆ గుడి దివ్య తేజస్సుతో నిండి పోయింది. ఆయన మూర్ఛపోయారు. ఆ వచ్చిన ఇద్దరూ



రామ లక్ష్మణులు. రాముడు తన శరీరాన్ని నిమిరారు. అప్పుడు స్పృహ వచ్చింది. వేస్‌కర్ గారు హనుమంతుడిగా మారారు. సూర్యాజీపంత్ అందరికీ నమస్కరించాడు. శ్రీరామ చంద్రుల వారు పంత్ గారి భుజాలను సట్టుకొని "ఏదైనా వరం కోరుకో" అన్నారు. "మీ పాదాలపై అచంచలమైన భక్తి, మీ పాదాల చెంత నిరంతరం నివసించే భాగ్యం ప్రసాదించండి" అన్నారు పంత్ గారు. "తథాస్తు" అన్నాడు శ్రీ రాముడు. పంత్ వారికి చేతులు జోడించి "మీ దర్శనం తలచుకున్నప్పుడల్లా కలిగే భాగ్యం కలిగించండి" అని ప్రార్థించగా, రాములవారు పంచలోహాలతో చేసిన శ్రీరామ, సీతా, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలు ఆయన చేత ఉంచి "నీకు నన్ను ఎప్పుడు చూడాలని అనిపిస్తే, అప్పుడు ఈ విగ్రహాలను యధావిధిగా పూజించు. నీకు నా దర్శనం కలుగుతుంది" అని సెలవిచ్చి అంతర్ధానమైనారు.

విశ్వావసు నామ సంవత్సరం 1527 లో మార్గశిర శుద్ధ త్రయోదశినాడు రేణుబాయి గర్భవాసాన జన్మించిన తమ పుత్రుడిని తీసుకువెళ్ళి ఏకనాథ్ వారి పాదాలపై ఉంచారు. "వీడు రామభక్త పరాయణుడు అవుతాడు. ఇతని భక్తి శ్రేష్ఠమైనది. కాబట్టి "శ్రేష్ఠ" అని పేరుపెట్టండి" అని చెప్పారు.

శక సంవత్సరం 1530 చైత్ర శుద్ధ నవమి (రామనవమి) నాడు రెండవ పుత్రుడు జన్మించాడు. పైఠన్‌కు వెళ్ళి ఆ బాలుని ఏకనాథ్ పాదాలపై ఉంచారు. "నేను చేపట్టిన కార్యాన్ని ఇతడు సమర్ధవంతంగా నెరవేరుస్తాడు" అని అతనికి 'నారాయణ' అని పేరు పెట్టండి" అన్నారు. 1531 సౌమ్య సంవత్సరంలో దేహం చాలించారు ఏకనాథ్.

శ్రేష్ఠుడు హనుమంతుడి గుడిలో హనుమత్కవచం నిర్విరామంగా పదిరోజులు పఠించాడు. ఆకలిదప్పులతో అతని దేహం కృశించింది. పదకొండవరోజున హనుమంతుడు ప్రత్యక్షమై "ఏంకావాలి నీకు?" అని అడిగాడు. "నాకు మంత్రం అనుగ్రహించండి." అన్నాడు. హనుమంతుడు రాముణ్ణి స్మరించాడు. రాములవారు ప్రత్యక్షమై త్రయోదశాక్షరి మంత్రాన్ని అనుగ్రహించారు. 1537 లో సూర్యాజీపంత్ దేహం చాలించారు.

రెండవ వాడైన నారాయణ అతి తుంటరి. ఒకసారి చేనులో పని చేసే రైతును "తాతయ్యా! ఈ జొన్నల బస్తా నేను పట్టుకెళ్ళనా?" అని అడిగాడు. వాడి చేతనే మౌతుందని, "చేతనైతే పట్టుకెళ్ళు" అన్నాడు. నారాయణ ఆ వంద శేర్ల బస్తాను అవలీలగా భుజాలపైన వేసుకుని ఇంటికి వచ్చాడు. నారాయణ తల్లి "అలా పరుల సొమ్ము పట్టుకురావచ్చా?" అని కోప్పడింది. రైతుతో "ఆ బస్తా మాకు లభించాలన్నది భగవంతుని ఇచ్ఛ కాబట్టే నేను తెచ్చాను" అన్నాడు నారాయణ. "సరే కాస్త సాయం పట్టండి" అని అప్పుడే వచ్చిన శ్రేష్ఠులను కోరాడు. ఇద్దరూ కలిసి ఆ బస్తాను రైతు భుజాన పెట్టేసరికి ఇంకొక బస్తా తయారు. అలా బస్తాలు తీసిన కొద్దీ ధాన్యపు బస్తాలు తయారవుతున్నాయి. అదిచూసి రైతు "అమ్మా! నీ పుత్రుడు సామాన్యుడు కాడు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## హైదరాబాదు శాఖలో సెప్టెంబరు 16 నుండి 21 వరకు జరిగిన సత్సంగ దృశ్యములు



సత్సంగము



కుకట్‌పల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో



కాళీవనాశ్రమంలో ఆశ్వీయుజ పూర్ణిమనాడు గురుదేవులకు హారతులు



పెదనింద్రకొలను శాఖలో పూజ్య మాతాజీవారి జన్మదిన వేడుక

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

ఓం శ్రీ మహాగణాధిపతయే నమః ఓం శ్రీ గురు పరబ్రహ్మణే నమః ఓం శ్రీ పరాశక్త్యై నమః

శ్రీ కాళీవనాశ్రమ వ్యవస్థాపకులు శ్రీసర్వాధిష్ఠాన చైతన్య, సమర్థ సద్గురు
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ వారి దివ్యానుగ్రహముతో,
ఆశ్రమ పీఠాధిపతులు పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పరమానుగ్రహముతో...

## శ్రీ సద్గురు స్వామి స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవము మరియు
## శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి
## చతుస్త్రింశత్ (34వ) వార్షిక మహా పుణ్యారాధన మహోత్సవములు



శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత
మహా మృత్యుంజయ సంపుటీత రుద్రయాగము,
అఖండ హరినామ సంకీర్తన,
త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము



**ది. 11.11.2022 శుక్రవారము నుండి 21.11.2022 సోమవారము వరకు**

**కార్తీకమాస సందర్భముగా ప్రతిరోజు మహాన్యాస పూర్వక సామూహిక రుద్రాభిషేకములు జరుగును.**

### ఆహ్వానము

ఆధ్యాత్మిక బంధుమిత్రులారా!

శ్రీ కాళీ వనాశ్రమము ( శ్రీ కాళీ గార్డెన్స్) పరీధావి నామ సంవత్సర నిజవైశాఖ బహుళ తదియ బుధవారము అనగా ది. 31.05.1972న శ్రీ బాబా విజ్ఞాన మందిర్ గృహప్రవేశముతో ప్రారంభింపబడి 50 సంవత్సరములు పూర్తి చేసుకొన్న సందర్భముగా శ్రీ శుభకృత్ నామ సంవత్సర కార్తీకబహుళ తదియ శుక్రవారము నుండి కార్తీక బహుళ ద్వాదశి (తత్కాల త్రయోదశి) సోమవారము వరకు అనగా ది.11.11.2022 నుండి 21.11.2022 వరకు శ్రీ సద్గురుదేవుల పరమానుగ్రహముతో స్వర్ణోత్సవ మహోత్సవములు, అఖండ హరినామ సంకీర్తన, పరమహంస పరివ్రాజకాచార్య పరమ పూజ్యపాద శ్రీశ్రీశ్రీ నంది నిర్మలానందగిరి స్వామి వారి సర్వాధ్యక్షతన త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము (19.11.2022 నుండి 21.11.2022) నిర్వహించుకొనుచున్నాము. కార్యక్రమ పూర్తి వివరములు త్వరలోనే ప్రకటించబడును. ఆస్తిక మహాశయులందరూ ఈ కార్యక్రమములలో పాల్గొని భక్తుల సేవచేసుకొని తరించగలరు.

ఇట్లు
కార్య నిర్వాహక వర్గము

**శ్రీ కాళీవనాశ్రమము (శ్రీకాళీ గార్డెన్స్)**
శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాదబాబు ట్రస్టు
నంబూరు రైల్వేస్టేషన్ ఎదురుగా,గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి, పెదకాకాని , గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
☎ 9346535357, 9398334345, 9493786603, 8333067877
Website : www. mathaji-babuji.org., e-mail : shkvpbtrust @ gmail.com

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.